www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 212 | సోమవారం | 22 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం


Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

టిఎస్‌పిఎస్‌సి వెబ్‌సైట్‌లో మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా 6

- 19 నుంచి 24 వరకు పరీక్షలు
- 1:15 నిష్పత్తిలో ఎంపిక

వేటు



20 మంది ఆప్ ఎంఎల్‌ఎలపై అనర్హత వేటు వేసిన రాష్ట్రపతి రామ్‌నాథ్

లాభదాయక పదవుల కారణంతో కేంద్ర ఎన్నికల సంఘం చేసిన సిఫార్సుకు ఆమోదం

"ఎన్నికల కమిషన్ అభిప్రాయం మేరకు 20 మంది ఢిల్లీ ఎంఎల్‌ఎలను అనర్హులుగా ప్రకటిస్తున్నా"
- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



"రాష్ట్రపతి నిర్ణయం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర పరిణామం"
- ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) శాసనసభ్యులు 20 మందిపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అనర్హత వేటు వేశారు. లాభదాయక పదవుల్లో కొనసాగుతున్నారని, వీరిని అనర్హులుగా ప్రకటించాలని ఇటీవల కేంద్రం ఎన్నికల సంఘం చేసిన సిఫారసుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. 'ఎన్నికల కమిషన్ అభిప్రాయం మేరకు 20 మంది ఢిల్లీ ఎంఎల్‌ఎలను అనర్హులను ప్రకటిస్తున్నా' అని రాష్ట్రపతి పేర్కొన్నట్టు ఆదివారం నాడు కేంద్ర న్యాయశాఖ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. అనర్హత వేటు పడిన వారిలో మంత్రి కైలాశ్ గెహ్లాట్ కూడా ఉన్నారు. 20 మంది శాసనసభ్యులపై వేటు పడినప్పటికీ కేజ్రీవాల్ ప్రభుత్వానికి వచ్చిన ఆపద ఇప్పటికిప్పుడైతే ఏమీ లేదు. 70 సీట్లున్న ఢిల్లీ అసెంబ్లీలో రాష్ట్రపతి చర్యతో ఆప్ బలం ఇప్పుడు 46కు పడిపోయింది. అయితే ఆ పార్టీకి ఇది నైతికంగా దెబ్బేనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు రాష్ట్రపతి చర్యను ఆప్ తీవ్రంగా ఖండించింది. రాష్ట్రపతి నోటిఫికేషన్ రద్దుకు ఉన్న అవకాశాలన్నీ ఉపయోగించుకుంటామని, కోర్టును ఆశ్రయిస్తామని ఆప్ సీనియర్ నేత గోపాల్ రాయ్ స్పష్టం చేశారు. తమ ఎంఎల్‌ఎలపై రాష్ట్రపతి అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర పరిణామమని అదే పార్టీకి చెందిన మరోనేత అశుతోష్ అన్నారు. రాష్ట్రపతి నిర్ణయం బాధించిందని, నిర్ణయం తీసుకునేముందు తమ అభిప్రాయం ఏంటో కూడా విని వుండాల్సిందని వేటుపడిన వారిలో ఉన్న ఆల్కా లాంబా అన్నారు. మొత్తం 21 మంది ఎంఎల్‌ఎలు 2015, మార్చి 13 నుంచి సెప్టెంబరు 8, 2016 వరకు పార్లమెంటరీ కార్యదర్శుల పదవిలో ఉండటం ద్వారా లాభదాయక పదవులను చేపట్టినట్లయిందని, ఫలితంగా శాసనసభ్యులుగా అనర్హులవుతారని రాష్ట్రపతి కోవింద్‌కు ఇటీవల ఇసి ప్రతిపాదన పంపించింది. 21 మంది శాసనసభ్యుల్లో ఒకరు గతంలోనే రాజీనామా చేశారు. ఢిల్లీ అసెంబ్లీలో ఖాళీ అయిన స్థానాలకు 6నెలల్లో ఎన్నికల జరపాల్సి ఉంటుంది.

బిజెపిపై కేజ్రీవాల్ పరోక్ష విమర్శలు...

'మనం వెళుతున్న దారిలో ఎన్నో అవరోధాలు ఎదురవుతాయి. అలాంటప్పుడు నీవు నిజాయితీ, నీతి అనే దారిని ఎంచుకున్నప్పుడే ఈ అనంత విశ్వంలో కనిపించే, కనిపించనటువంటి శక్తులు నీ దారిలోకి వచ్చి మరీ సాయ తరువాయి 6లో

ఇద్దరు గవర్నర్లు?

తెలంగాణ, ఎపిలకు వేర్వేరుగా నియామకానికి రంగం సిద్ధం

నెల రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం?



మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు త్వరలోనే వేర్వేరు గవర్నర్లు రానున్నారా అంటే కేంద్రం నుంచి అందుతున్న సంకేతాలు, ఆంధ్రప్రదేశ్ బిజెపిలోని పరిణామాలు అవుననే సమాధానం ఇస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి గవర్నర్‌గా కొనసాగుతున్న నరసింహన్ ఇకపైన తెలంగాణకు పరిమితం కానున్నారో లేదో ఇప్పటికి స్పష్టత లేదుగానీ, ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం విడిగా మరో గవర్నర్ నియామకం జరిగే అవకాశాలు ఉన్నాయి. రెండు రాష్ట్రాలకు ఉమ్మడి గవర్నర్ స్థానంలో వేర్వేరు గవర్నర్లను నియమించాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. నెల రోజుల వ్యవధిలోనే ఈ మేరకు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. గవర్నర్ ఏర్పాటు గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేంద్రం ఇప్పటికే సంకేతం ఇచ్చినట్లు తెలిసింది. ఈ సంకేతంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కానీ గవర్నర్ మార్పు గురించి తెలంగాణ ప్రభుత్వానికి మాత్రం కేంద్రం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సంకేతాలు అందలేదని తెలిసింది. ఉమ్మడి హైకోర్టు విభజనకు స్వయంగా సిఎం చంద్రబాబు లేఖ రాయడం, కేంద్రం కూడా సానుకూలంగా స్పందించడం, రెండు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఎన్నికల తరువాయి 6లో

కొత్త సిఇసి రావత్

మరో ఎన్నికల కమిషనర్‌గా అశోక్ లావాసా



న్యూఢిల్లీ: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)గా ఓం ప్రకాశ్ రావత్‌ను నియమించారు. ఈనెల 23న ఆయన సిఇసిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు న్యాయ మంత్రిత్వ శాఖ ఆదివారం నాడు నోటిఫికేషన్ జారీ తరువాయి 6లో



కాబూల్ హోటల్ నరమేధంలో 43 మంది మృతి

కాబూల్: అఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని అత్యంత విలాసవంతమైన ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌లో ఉగ్రవాదులు నరమేథం సృష్టించారు. హోటల్‌లోకి చొరబడి 43 మంది అతిథులను పొట్టనబెట్టుకున్నారు. మృతుల్లో 13 మంది విదేశీయులున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం కూడా ఈ భయానకం కొనసాగింది. భవనంలోకి ప్రవేశించిన నలుగురు సాయుధులు విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. గదులకు నిప్పుపెట్టారు. హోటల్‌లోని అతిథులే లక్ష్యంగా కాల్పులకు పాల్పడ్డారు. ఎనిమిది గంటలకు పైగా ఉగ్రవాదులు హోటల్‌లోని అతిథులపై బుల్లెట్ల వర్షం కురిపించారు. ప్రత్యేక బలగాలు హెలికాప్టర్ల సాయంతో తరువాయి 6లో

దూరంగా ఉందాం 11

- వాళ్ళే కూర్చొని పరిష్కరించుకుంటారు
- జడ్జీల సంక్షోభంపై పార్టీలకు ప్రధాని సూచన
- దావోస్ సదస్సుకు వెళ్లిన మోడీ
- డబ్ల్యుఇఎఫ్ వేదికపై తొలిసారిగా యోగా ప్రదర్శన

నేటి నుంచి జనసేన ప్రజాయాత్ర 3

- జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభ వేదికగా పవన్ పర్యటన

నరసింహన్‌పై గరం!

కాళేశ్వరం సందర్శన సమయంలో గవర్నర్ ప్రకటనలపై టిపిసిసి తీవ్ర అభ్యంతరం

రాజ్యాంగ పరిరక్షకుడు తన స్థాయి మరిచి వ్యవహరించారని విమర్శ



మన తెలంగాణ / హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ చేసిన ప్రకటనలపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉన్న గవర్నర్ తన స్థాయి మరచి ఒక పార్టీపై, ప్రభుత్వంపై మాట్లాడిన మాటలు గవర్నర్ హోదాను, పదవిని కించపరిచినట్లుగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. సాగునీటి ప్రాజెక్టుల పేర్ల మార్పు, బాధితులకు పునరావాస ప్యాకేజీల గురించి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం విచారకరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క, సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, మాజీమంత్రి డి.శ్రీధర్ బాబు హైదరాబాద్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడారు. గవర్నర్ తీరుపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భట్టివిక్రమార్క మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరుమీద పెట్టిన ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్లి ఆ పేరును ఎందుకు తీసేశారని ప్రశ్నించకపోవడం విచారకరమన్నారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రూ.38 వేల కోట్లతో అప్పటి తరువాయి 6లో

కాంగ్రెస్‌పై మండిపడ్డ మంత్రి హరీశ్

బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్

మంచిని చూడలేక పోతున్నారని వ్యాఖ్య



మన తెలంగాణ/ భూపాలపల్లి /కాళేశ్వరం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోదావరి పరీవాహక ప్రాంతాల్లో నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించి, పనుల తీరుపై సంతృప్తి చెంది కితాబు ఇచ్చిన రాష్ట్ర గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్‌ను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు విమర్శించడం సిగ్గుచేటని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని తరువాయి 6లో

కుంచెపోటు



మన సినిమా పూర్తయ్యిందిగా సెన్సార్ బోర్డుకి పోదామా, సుప్రీంకా..?

రిజిస్ట్రేషన్లు తగ్గినా పెరిగిన రాబడి



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది నెలల కాలంలోనే రిజిస్ట్రేషన్లు, స్టాంపుల విభాగం 85 శాతం లక్ష్యాన్ని సాధించింది. మొత్తం ఆర్థిక సంవత్సరానికి మూడు వేల కోట్ల రూపాయల మేర రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా ఆర్జించాలని బడ్జెట్‌లో ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా నవంబరు నాటికే రూ. 2559.73 కోట్లను ఆర్జించింది. అందులో దాదాపు 75 శాతం ఆదాయం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచే సమకూరింది. ఈ మూడు జిల్లాల నుంచి రూ.1916.58 కోట్ల మేరకు ఆదాయం సమకూరగా మిగిలిన రూ. 643.15 కోట్లు మెదక్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి సమకూరింది. అత్యంత కనిష్ఠంగా ఆదిలాబాద్ జిల్లా నుంచి కేవలం రూ. 34.86 కోట్లు మాత్రమే తరువాయి 6లో

సాగు విద్యుత్‌కు మీటర్లు?

నిరంతర సరఫరా దుర్వినియోగం కాకుండా తరుణోపాయం, ప్రభుత్వ యోచన


ఆటో స్టార్టర్లకు సగం మంది మాత్రమే స్వస్తి • ప్రశ్నార్థకంగా జాతీయ గ్రిడ్ భద్రత



మన తెలంగాణ/ హైదరాబాద్: వ్యవసాయ విద్యుత్ వినియోగంలో దుబారాను అరికట్టి పొదుపును పాటించడం, సమర్థ వినియోగాన్ని పెంచుకోవడంపై ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వమే వ్యవసాయ కనెక్షన్లకు ప్రీపెయిడ్ మీటర్లను బిగించి, ప్రతినెలా నిర్థిష్ట మొత్తంలో రీచార్జ్ చేస్తే ఫలితాలు ఎలా ఉంటాయని ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలో సుమారుగా 25 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సుమారు రూ.250 కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వమే ప్రీపెయిడ్ మీటర్లను కొనుగోలు చేయాలనుకుంటోంది. ఒకేసారి ప్రీపెయిడ్ మీటర్లు బిగించి, రీచార్జ్ చేస్తే విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని ప్రభుత్వ ఆలోచన. శాస్త్రీయ అధ్యయనం చేసి, రైతులకు ఎంత కరెంటు కావాలో సగటున లెక్కలు వేసి, ఆ మేరకు నెలకు ఒకేసారి అన్ని యూనిట్లకు సరిపడే డబ్బులను ప్రీపెయిడ్ రూపంలో వ్యవసాయ మీటర్లకు రీచార్జ్ చేయించాలని విద్యుత్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. సగటు అంచనా కంటే తక్కువ కరెంటు వాడుకున్నట్లయితే ఆ మిగిలిన డబ్బులను మరుసటి నెలఖాతాలో జమ అయ్యేలా చూడాలని భావిస్తోంది. ఒకవేళ ఎక్కువ వాడుకున్నట్లయితే ఆ కనెక్షన్‌ను కట్ చేయడమా లేక రైతులే స్వచ్ఛందంగా రీచార్జ్ చేసుకునే అవకాశం ఇవ్వడమా లేక ప్రభుత్వమే అదనపు రీచార్జ్ చేసి భవిష్యత్తులో సర్దుబాటు చేయడమా.. ఇలా అనేక రకాల ఆలోచనలు తెరమీదకు వస్తున్నాయి. శాస్త్రీయ అధ్యయనం చేసి రైతులకు అనుకూలంగా తరువాయి 6లో

కలాం అంతరిక్ష శాస్త్రవేత్త, మోడీ సామాజిక శాస్త్రవేత్త: కోవింద్

అహ్మదాబాద్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అంతరిక్ష శాస్త్రవేత్త అయితే, ప్రధాని నరేంద్ర మోడీ సామాజిక శాస్త్రవేత్త అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇరువురిని సమాంతరంగా పోల్చారు. ఆదివారం గుజరాత్ యూనివర్సిటీ (జియు) 66వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కలాం అదృష్టవశాత్తు తన కన్నా ముందు రాష్ట్రపతి అయ్యారని, ఆయనను తాను అంతరి క్ష శాస్త్రవేత్తగా పిలుస్తానని కోవింద్ తెలిపారు. మోడీ గుజరాత్ వర్సిటీ పూర్వ విద్యార్థి అని, కలాం కొన్నాళ్లు ఇక్కడే ఉన్నారని పేర్కొన్నారు. మోడీ తన చిన్న వయసులో తేనీరు విక్రయిం చారని, బహుశా ఈ స్నాతకోత్సవంలో పాల్గొన్న వారు ఎవ్వరూ తేనీరు విక్రయించి ఉండక పోవచ్చన్నారు. 'డిజిటల్ ఇండియా' 'స్టార్ట్ ఆఫ్ ఇండియా' వంటి కార్యక్రమాలు తీసుకొచ్చిన మోడీ, 21వ శతాబ్దపు ద్వారాలు తెరిచారని రాష్ట్రపతి పేర్కొన్నారు. అభివృ ద్ధి సాధించాలంటే సహకారం, సౌభ్రాతృత్వ సూత్రాలను గుర్తుంచుకోవాలని విద్యార్థులకు ఆయన ఉద్బోధిం చారు. రాష్ట్రంలోనే మొదటి వర్సిటీ జియులో 56,159 మంది పట్టభద్రులకు ఆయన డిగ్రీలు ప్రదానం చేశారు.



స్టేట్ గ్రిడ్ కోడ్‌పై నేడు విచారణ

మన తెలంగాణ/హైదరాబాద్: స్టేట్ గ్రిడ్ కోడ్‌పై సోమవారం నాడు విద్యుత్ నియంత్రణ కమిషన్ బహిరంగ విచారణ జరపనుంది. సింగరేణి భవన్‌లోని ఇఆర్‌సి కోర్టు హాల్‌లో జరుగనున్న ఈ విచారణలో విద్యుత్ అధికారులు పాల్గొంటారు. గ్రిడ్ కోడ్ ముసాయిదాపై వచ్చిన అభ్యంతరాలను డిసెంబరు 15 వరకు కమిషన్ స్వీకరించింది. వీటిపై ఇప్పుడు కమిషన్ బహిరంగ విచారణలో ఇరు పక్షాల వాదనలు విని, త్వరలోనే తమ ఆదేశాలు వెలువరిస్తుంది.

పవన్ పర్యటనపై పొన్నం ఫైర్



కరీంనగర్: మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ జనసేనాని పవన్ కల్యాణ్ కొండగట్టు పర్యటనపై మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పవన్ మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకున్న తర్వాతే కొండగట్టులో అడుగుపెట్టాలన్నారు. అంతేగాక ఇటీవల ముఖ్యమంత్రి కెసిఆర్‌తో పవన్ భేటీని కూడా ఆయన తప్పుబట్టారు. ఈ భేటీని పొన్నం వారిద్దరీ మధ్య జరిగిన చీకటి ఒప్పందంగా పేర్కొన్నారు. కొండగట్టుకు పవన్ మొక్కు తీర్చుకోవడానికి వస్తే అభ్యంతరం లేదని, కానీ రాజకీయ లబ్ధి కోసం వస్తే మాత్రం ఊరుకోబోమన్నారు. మరోవైపు మేడారం జాతర సందర్భంగా కొండగట్టుకు భక్తుల తాకిడి అధికమైన నేపథ్యంలో పవన్ పర్యటనకి ఎలా అనుమతించారని ఆయన ప్రశ్నించారు.

విద్యార్థి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ : జిల్లా కేంద్రంలోని ఓ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అంజప్ప అనే విద్యార్థి ఆదివారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కాలేజీలో చదవడం తనకు ఇష్టం లేకపోవడం వల్లనే ఆత్మహత్య చేసుకున్నట్టు అంజప్ప తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. హాస్టల్ గదిలోనే అంజప్ప ఉరేసుకొని చనిపోయాడు. దీంతో కాలేజీ యాజమాన్యం రెండు రోజులు పాటు సెలవు ప్రకటించి, విద్యార్థులను వారివారి ఇళ్లకు పంపించింది. అంజప్ప కుటుంబంతో రాజీకి కాలేజీ యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోంది.

డిటెన్షన్ అమలులో తలోదారి!

- వేర్వేరు విధానాలు అవలంబిస్తున్న వర్సిటీలు
- రాష్ట్రమంతటా ఒకేలా ప్రవేశాలు



మన తెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీ కోర్సుల్లో డిటెన్షన్ విధానం అమలులో ఒక్కో యూనివర్సిటీ ఒక్కో విధానం అవలంబిస్తుండడంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఉస్మానియా, శాతవాహన, పాలమూరు విశ్వవిద్యాలయాలు మాత్రం డిటెన్షన్ విధానాన్ని అమలు చేస్తుండగా, కాకతీయ, మహాత్మాగాంధీ, తెలంగాణ విశ్వవిద్యాలయాల్లో మాత్రం ఈ ఏడాది 'నో డిటెన్షన్'నే కొనసాగుతోంది. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే డిగ్రీ స్థాయిలో డిటెన్షన్ విధానం అమలులోకి తీసుకువస్తున్నామని ఉన్నత విద్యామండలి ప్రకటించినా కొన్ని వర్సిటీలు మాత్రమే అమలు చేస్తున్నాయి. డిటెన్షన్ విధానం ఉండదనే ముందే తెలిస్తే తాము కూడా ఆ విశ్వవిద్యాలయాలకే వెళ్లి చదువుకునే వారిమని ఈ ఏడాది డిటెండ్ అయిన విద్యార్థులు వాపోతున్నారు.

ఒకే విధానంలో ప్రవేశాలు..

రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఒకే విధంగా డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ద్వారా ప్రవేశాలు జరుగుతున్నాయి. ప్రవేశాలు ఒకే విధానంలో జరుగుతున్నప్పుడు డిటెన్షన్ విధానం అమలు విషయంలో కూడా అన్ని వర్సిటీలు ఒకే విధానాన్ని పాటిస్తే బాగుంటుందని ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. ఏ యూనివర్శిటీ పరిధిలో డిటెన్షన్ విధానం ఉంటుందో, ఎందులో ఉండదో ప్రభుత్వం ముందుగానే ప్రకటించి, ప్రవేశాల సమయంలోనే విద్యార్థులకు స్పష్టత ఇచ్చినట్లయితే ఎందులో చేరాలో వారే నిర్ణయించుకునేవారని వ్యాఖ్యానించారు. డిటెన్షన్ విధానం అమలులో ఉన్న వర్సిటీల పరిధిలోని కళాశాలల్లో ప్రవేశం పొంది డిటెండ్ అయిన విద్యార్థులకు ఏడాది సమయం వృథా అవుతుండగా, డిటెన్షన్ లేని వర్శిటీల పరిధిలో ప్రవేశం పొందిన విద్యార్థులు నిరాటంకంగా ద్వితీయ సంవత్సరంలోకి వెళ్తున్నారు. గత ఏడాది ఉస్మానియా యూనివర్సిటీలో పరిధిలో 65,550 మంది డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా, అందులో 4,650 మంది డిటెయిండ్ అయ్యారు. శాతవాహన వర్శిటీ పరిధిలో మొత్తం 40,536 మంది పరీక్షలు రాయగా, 2,300 మంది, పాలమూరు వర్సిటీ పరిధిలో 11,600 మందికి 3,200 మంది డిటెయిండ్ అయ్యారు.

వర్సిటీలకే నిర్ణయాధికారం..

యూనివర్శిటీలకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది. కాబట్టి డిటెన్షన్ అమలు విషయంలో ఆయా వర్సిటీలకే నిర్ణయాధికారం ఉంటున్న నేపథ్యంలో కచ్చితంగా అమలు చేయాలని ఎవరూ చెప్పలేకపోతున్నారు. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యలో ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సిబిసిఎస్) విధానం అమలు చేయాలని యుజిసి ఆదేశాలిచ్చిన నేపథ్యంలో గత ఏడాది నుంచి అన్ని వర్సిటీలు సంవత్సరం (ఇయర్) విధానానికి బదులుగా సెమిష్టర్ విధానం అమలు చేస్తున్నాయి. అందులో భాగంగానే డిగ్రీలో డిటెన్షన్ విధానం తీసుకువచ్చారు. అయితే మొదటి ఏడాది కొన్ని వర్సిటీలే అమలు చేసినా వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని వర్సిటీలు డిటెన్షన్ విధానం అమలు చేయనున్నట్లు తెలిసింది.

క్రెడిట్లుగా మారనున్న పేపర్లు

రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీల పరిధిలో గత ఏడాది నుంచి డిగ్రీలో ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సిబిసిఎస్) అమలవుతోంది. ఈ విధానంలో క్రెడిట్ల ఆధారంగా డిటెన్షన్ విధానం అమలు చేయాల్సి ఉంటుంది. అయితే సిబిసిఎస్ విధానంపై ఇప్పటికీ విశ్వవిద్యాలయాల్లో అధ్యయనమే కొనసాగుతోంది. ఇంకా స్పష్టత రాలేదు. అందువల్ల చాలా వర్శిటీలు ఇంకా పేపర్ల విధానాన్నే కొనసాగిస్తున్నాయి. డిటెన్షన్ విధానం అమలులో కూడా ప్రథమ సంవత్సరంలో 50 శాతం పేపర్లు ఉత్తీర్ణులైన వారిని ద్వితీయ సంవత్సరానికి ప్రమోట్ చేసి, మిగతా వారిని డిటెండ్ చేశారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలే ఎక్కువ

- టిఎస్ ఐపాస్‌లో ప్రత్యేకత నిలుపుకుంటున్న వైనం
- అనుమతులు పొంది తాత్సారం చేస్తున్న కంపెనీలకు హెచ్చరికలు



మన తెలంగాణ/హైదరాబాద్: నూతన పారిశ్రామిక విధానం టిఎస్‌ఐపాస్ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏర్పడిన పరిశ్రమల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగానిదే సింహభాగం. ఇతర పరిశ్రమలతో పోలిస్తే ఈ పరిశ్రమలు అధికంగా ఏర్పాటయ్యాయి. సుమారు 900 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు అనుమతులు పొందగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 361 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఇది రికార్డేనని పరిశ్రమశాఖ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. నూతన పారిశ్రామిక పాలసీ అమలులోకి వచ్చాక రాష్ట్రంలో కొత్త పరిశ్రమల్లో ఫుడ్ ప్రాసెసింగ్, ఐటి, ఫార్మా, ప్లాస్టిక్, పవర్, ఇంజనీరింగ్, ఆగ్రో బేస్డ్ ప్రాజెక్టులతో పాటు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, స్టోన్ క్రషింగ్ , టెక్స్‌టైల్ తదితర పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. వీటిని రెండేళ్లలోనే ఏర్పాటు చేయాలని కూడా స్పష్టం చేసింది. ఇప్పటికే కొన్నింటికి ఏడాది, మరి కొన్ని ఏడాదిన్నర కావస్తుండడంతో ఇంకా జాప్యం కాకుండా అనుమతులు పొందిన ఆయా సంస్థలు తమ పనులను ముమ్మరం చేస్తున్నాయి.

అనుమతి పొందిన కంపెనీలు..

అనుమతి పొందిన కంపెనీలు రంగాల వారీగా చూస్తే ఇలా ఉన్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ 900, థర్మల్ పవర్ ప్లాంట్లు 13, సోలార్ విద్యుత్ సంస్థలు 168, పారిశ్రామిక పార్కులు, ఐటి బిల్డింగ్స్ 52, ఫార్మాస్యూటికల్స్, రసాయన సంస్థలు 454, ఎరువులు, క్రిమిసంహారక మందుల కంపెనీలు 53, గ్రానైట్, స్టోన్ క్రషింగ్ పరిశ్రమలు 562, ఐటి సర్వీసులు 5, ఆర్ అండ్ డి సంస్థలు 122, ఇంజినీరింగ్ 1174, బేవరేజెస్ 216, పేపర్, ప్రింటింగ్ 239, ప్లాస్టిక్ రబ్బర్ 531, ఆటో మొబైల్ 21, ఎలక్ట్రికల్ , ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు 156, ఆగ్రో , కోల్డ్ స్టోరేజీ యూనిట్లు 586, సిమెంటు, ఇటుక ఉత్పత్తి , కాంక్రీటు కటింగ్ సంస్థలు 462, టెక్స్‌టైల్ 164, లెదర్ 69, ఏరో స్పేస్ 7 ఉన్నాయి. వీటిలో కొన్ని పరిశ్రమల పనులు పూర్తి కాగా , చాలా సంస్థలు ఇంకా పనుల్నే ప్రారంభించలేదు.

అందుబాటులోకి 3538 సంస్థలు..

మొత్తంగా 6063 కంపెనీలు అనుమతులు పొందగా వీటిలో ఇప్పటి వరకు 3538 సంస్థలు అందుబాటులోకి వచ్చాయని, మరో 481 కంపెనీలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇంకా 517 సంస్థలు ఇప్పుడిప్పుడే పనులు ప్రారంభించగా, మరో 1527 సంస్థలు పనులు ప్రారంభించాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. పనులు ఇంకా మొదలు పెట్టని సంస్థలను పరిశ్రమలశాఖ ఎప్పటికప్పుడు సంప్రదిస్తూనే ఉందని, అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందించేందుకు పరిశ్రమల శాఖతో పాటు సిఎం కార్యాలయంలోని ఛేజింగ్ సెల్ కూడా అందుబాటులో ఉంటుందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. అయినా తాత్సారం చేస్తే ప్రభుత్వం ఉపేక్షించదనే అంశాన్ని కూడా పరోక్షంగా స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. టిఎస్‌ఐపాస్ అనుమతులు ఇచ్చింది మూడేళ్లకే అయినా ప్రభుత్వం ఇటీవల జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేసిన నేపథ్యంలో అత్యధికంగా పరిశ్రమలు వచ్చిన జిల్లాగా మేడ్చల్ (1561 కొత్త పరిశ్రమలు), అత్యల్పంగా పరిశ్రమలు వచ్చిన జిల్లాలుగా (35 కొత్త పరిశ్రమలు) గద్వాల, వనపర్తి నిలుస్తున్నాయి.

మంత్రులను కలవలేని స్థితిలో ముఖ్యమంత్రి

- జెఎసి చైర్మన్ ప్రొ.కోదండరామ్



మన తెలంగాణ/హైదరాబాద్/ ముషీరాబాద్ : తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే టిజెఎసి లక్ష్యమని టిజెఎసి చైర్మన్ కోదండరాం అన్నారు. మంత్రులను కూడా కలవలేని సిఎం కేసిఆర్ ప్రభుత్వంపై ప్రజా సమస్యలపై ఒత్తిడి పెంచుతామన్నారు. హైదరాబాద్ జిల్లా స్థాయి జెఎసి శిక్షణ తరగతులు ఆది వారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. నగర కన్వీనర్ సత్యంగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా కోదండరాం హాజరై ప్రసంగించారు. విద్యార్థులు, అమరుల త్యాగాల పై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ప్రేమతో, ఏ సమస్య లేకుండా ఉండాలనుకున్నామని, కానీ అధికారంలోకి వచ్చిన సిఎం మంత్రులను కూడా కలవలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే, అదేదో కక్షతో చేసినట్లు టిఆర్‌ఎస్ ప్రభుత్వం అనుకుని, ఎక్కడికక్కడ నిర్బంధాలు, అరెస్టులు చేస్తున్నారన్నారు. చివరకు మీడియాలో కూడా జెఎసి వార్తలు రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జెఎసి జీవించే ఉందని, ప్రజా సమస్యలపై, నిధులు, ఉద్యోగాలు, నియామకాలపై ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు ముందుకు వెళ్లాల్సిన ఉందని నాయకులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జెఎసి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని, ప్రజా సమస్యలపై, తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వంపై జెఎసి పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిజెఎసి రాష్ట్ర కన్వీనర్ రఘు, అధికార ప్రతినిధి వెంకట్‌రెడ్డి, జశ్వంత్‌కుమార్, బాలరాం, నర్సయ్య, శ్రీధర్‌రెడ్డి, రవికాంత్, అనురాధ, రామగిరి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


రాజకీయాల్లోకి వస్తున్నాం

టిజెఎసి త్వరలో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించనుందని కోదండరాం స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో తాము కీలకపాత్ర పోషిస్తామని ప్రకటించారు. జెఎసి ఫేస్‌బుక్ లైవ్ షోలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో క్రియాశీలక పాత్రను ఒక పార్టీ రూపంలో పోషించాలా లేక పలు పార్టీలను ఒకే వేదిక మీదకు తెచ్చే ఫ్రంట్ రూపంలో పోషించాలా అనే విషయమై త్వరలోనే నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. అన్నీ అనుకూలిస్తే ఈ నెలాఖరుకే ఒక నిర్ణయానికి వస్తామని, లేదంటే మరో 15 రోజుల్లో స్పష్టత వస్తుందని అన్నారు. ఇదిలా ఉంటే జెఎసి రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని ఫిబ్రవరి 4న హైదరాబాద్‌లో నిర్వహించాలని స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో నిరుద్యోగం, రైతు సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నారు. హైదరాబాద్‌లోని జెఎసి కార్యాలయంలో ఆదివారం కోదండరామ్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సోమవారం నుంచి నిర్వహించనున్న రైతు అధ్యయన యాత్రలు, సదస్సులు, జెఎసి నిర్మాణం తదితర అంశాలపై వారు చర్చించారు.

ముగ్గురు మిలిటెంట్లు అరెస్ట్

భద్రాద్రి కొత్తగూడెం : మావోయిస్టు పార్టీకి చెందిన ముగ్గురు మిలిటెంట్లను అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్‌పి అంబర్ కిశోర్ తెలిపారు. అంతరాష్ట్ర సరిహద్దులో మందుపాతరలు ఏర్పాటు చేయడానికి మావోయిస్టులు చేసిన కుట్రను పోలీసులు భగ్నం చేసినట్టు ఎస్పి వెల్లడించారు. అరెస్ట్ అయిన మిలిటెంట్ల నుంచి 51గిలిటెన్ స్టిక్స్, 130 డిటోనేటర్స్‌ను స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. అరెస్ట్ అయిన మిలిటెంట్లపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

క్యాన్సర్లను ముందుగానే గుర్తించే రక్తపరీక్ష



సిడ్నీ: ఎనిమిది రకాల సాధారణ క్యాన్సర్లను ముందుగానే గుర్తించే రక్తపరీక్ష విధానాన్ని ఆస్ట్రేలియా పరిశోధకులు కనుగొన్నారు. ఈ పరీక్ష ద్వారా క్యాన్సర్లు సోకే ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టడమే కాకుండా దుష్ఫలితాలను నివారించేందుకు వీలు కలుగుతుంది. ఈ పరీక్ష విధానంతో అండాశయం, కాలేయం, ఉదరం, ఊపిరితిత్తులు, రొమ్ములు తదితరాలకు సోకే క్యాన్సర్లను ముందుస్తుగా గుర్తించడం ఇక సులభమవుతుందని ఆస్ట్రేలియాలోని వాల్తేర్ అండ్ ఎలిజా హాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ వెల్లడించింది. ఎలాంటి ఇబ్బందులు లేని సురక్షిత, సులభమైన ఈ పరీక్ష ఎంతో ప్రభావవతంగా ఉంటుందని అసిస్టెంట్ ప్రొఫెసర్ జీన్ టీ తెలిపారు. అంతేకాకుండా వ్యాధికారకంగా వచ్చే దుష్ఫలితాలను నివారించడమే కాకుండా మరణాలను కూడా తగ్గించవచ్చని పేర్కొన్నారు.

త్వరలో అందుబాటులోకి ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు

- సాధారణ డిగ్రీలతో సమాన విలువ



మన తెలంగాణ/ హైదరాబాద్: సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతుండడంతో పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం అన్నీ ఆన్‌లైన్ విధా నంలోకి రాగా, త్వరలో ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు కూడా అందుబాటు లోకి రానున్నాయి. ఇప్పటి వరకు రెగ్యులర్ విధానంలో, దూరవిద్యా విధానంలో డిగ్రీ కోర్సులు అందిస్తున్న వర్సిటీలు, భవిష్యత్తులో ఆన్‌లై న్ డిగ్రీ కోర్సులు కూడా అందించనున్నాయి. త్వరలోనే మూడేళ్ల ఆన్ లైన్ డిగ్రీ కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇప్పటి వరకు ఆన్‌లైన్ కోర్సులు ఐటి, సాఫ్ట్‌వేర్, కంప్యూటర్ కోర్సులకే పరిమితం కాగా, భవిష్యత్తులో సాధారణ డిగ్రీ లు కూడా అందుబాటులోకి రానున్నాయి. వీటికి సాధారణ డిగ్రీలతో సమాన విలువ ఇవ్వాలని కేంద్రం యోచిస్తోంది. ఆ దిశగా మార్గదర్శ కాలు రూపొందిస్తోంది. దేశవ్యాప్తంగా న్యాక్ ఎ ప్లస్, 'ఎ డబుల్ ప్లస్' స్కోర్ ఉన్న విద్యా సంస్థలకే మూడేళ్ల ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు అందిం చేందుకు అవకాశం కల్పించనున్నారు. ఆన్‌లైన్ కోర్సుల్లో సైతం పూర్తి స్థాయి విద్యార్థుల్లా కష్టపడాల్సి ఉంటుంది.

నెలాఖరు నుంచి ప్రవేశ పరీక్షల మాక్ టెస్టులు

మన తెలంగాణ/హైదరాబాద్: జనవరి నెలాఖరు నుంచి ప్రవేశ పరీక్షల మాక్ టెస్టులు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది మొదటిసారి ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నందున విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షలకు అలవాటు పడేందుకు, ప్రాక్టీస్ చేసుకునేందుకు సంబంధిత ప్రవేశ పరీక్షల వెబ్‌సైట్లలో మాక్ టెస్ట్‌లను ఆయా 'సెట్' పరీక్షల నిర్వాహకులు అందుబాటులోకి తీసుకురానున్నారు. అయితే ఫిజికల్ ఎడ్యుకేషన్ సెట్‌కు మాత్రం ఈ విధానం వర్తించదు. పాత ప్రశ్నపత్రాలను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఎంసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, ఇసెట్ తదితర ప్రవేశ పరీక్షలకు వచ్చే దరఖాస్తుల ఆధారంగా ఒక్కో పరీక్ష ఎన్ని రోజులు జరుగుతుందో నిర్ణయిస్తారు. ఎంసెట్‌కు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఐదు రోజులపాటు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. అందులో మూడు రోజులపాటు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఇంజనీరింగ్ పరీక్షలు, రెండు రోజుల పాటు అగ్రికల్చర్ పరీక్షలు నిర్వహించనున్నారు.

24న మజ్దూర్ యూనియన్ ధర్నా

మన తెలంగాణ /హైదరాబాద్ : రైల్వేలో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, కార్మికులు, ఉద్యోగులందరికీ పెన్షన్‌ను కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన సికింద్రాబాద్ రైల్ నిలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సిఆర్‌ఎంయు) అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.శంకరరావు తెలిపారు. ఈ ధర్నాను ఉద్దేశించి అఖిల భారత రైల్వేమెన్ ఫెడరేషన్ (ఎఐఆర్‌ఎఫ్) ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రాతో పాటు పలువురు జాతీయ నాయకులు పాల్గొంటారని వారు ఒక ప్రకటనలో తెలిపారు. పిఆర్‌సిలోని అవకతవకలను సవరించి కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర కార్మిక సంఘాలతో రైల్వే బోర్డు, రైల్వే మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

వచ్చే నెలలో ఎఎంఐ ట్రేడ్ ఫెయిర్

మన తెలంగాణ/హైదరాబాద్: వస్త్ర తయారీ దారులు, వాణిజ్య వేత్తలతో కూడిన అప్పెరల్ గ్రూప్, అప్పెరల్ మ్యానిఫ్యాక్చరర్స్ ఆఫ్ ఇండియా వచ్చే నెల 6 నుంచి నాలుగు రోజుల పాటు హైదరాబాద్‌లో అతి పెద్ద ట్రేడ్ ఫెయిర్‌ను నిర్వహించనుంది. మాధాపూర్ హైటెక్స్ ప్రాంగణంలో ఏర్పాటు కానున్న ట్రేడ్ ఫెయిర్‌లో తెలంగాణతో పాటు, కర్నాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల రిటైలర్లు, దుస్తుల తయారీ సంస్థలు పాల్గొననున్నాయని ఏఎంఐ నిర్వాహకులు నిఖిల్ పురియా ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా రెడీమేడ్ అప్పెరల్ మార్కెట్, రిటైలర్లు, సరఫరా దారుల మధ్య నెలకొన్న గ్యాప్‌ను పూరించనున్నట్లు పేర్కొన్నారు.

మన తెలంగాణ
3
హైదరాబాద్
సోమవారం
22, జనవరి 2018
www.manatelangana.news



నా స్థానం ప్రజాభవన్‌లోనే : దత్తాత్రేయ

మన తెలంగాణ/హైదరాబాద్: తాను గవర్నర్‌గా రాజ్‌భవన్‌కు వెళ్లనని, ఎప్పటికైనా ప్రజాభవన్‌లోనే ఉంటానని, 2019 ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తానని బిజెపి ఎంపి బండారు దత్తాత్రేయ వెల్లడించారు. రాష్ట్రంలో బిజెపి బలం రోజు రోజుకూ పెరుగుతోందని, రాష్ట్రంలో టిఆర్‌ఎస్‌కు తామే బలమైన ప్రత్యామ్నాయమన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అధికారాలను అప్పగిస్తే, వాటిని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. పరోక్ష ఎన్నికల పేరుతో కొత్త పంచాయతీ రాజ్ చట్టాన్ని ప్రవేశపెట్టడం అప్రజాస్వామికమని, ఇలాంటి విధానం ద్వారా అల్ప, బలహీనవర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా పోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక సాయం చేసిందన్నారు. నాబార్డ్ ద్వారా రాష్ట్రానికి మిషన్ భగీరథ పనులకు రూ.3939 కోట్లను, మిషన్ కాకతీయకు రూ. 6767 కోట్లను, త్రాగునీటి అభివృద్ధి పథకానికి (డెవలప్‌మెంట్ డ్రింకింగ్ వాటర్) మరో రూ.1767 కోట్లను, మైక్రో ఇరిగేషన్‌కు 2016–17లో రూ. 874 కోట్లను మంజూరు చేసిందని ఆయన వివరించారు. దేశ వ్యాప్తంగా నాబార్డ్ ద్వారా 99 రకాల స్కీములు ఉండగా, తెలంగాణకే 11 స్కీములను మంజూరు చేసిందన్నారు.

ఎంఎల్‌సి ఖాతాలో నగదు మాయం



మన తెలంగాణ/సిటీబ్యూరో: సైబర్ క్రైం నేరస్థులు ఏకంగా ఓ ప్రజాప్రతినిధినే తమ తెలివితేటలతో బోల్తా కొట్టించారు. అందినకాడికి దండుకున్నారు. హైదరాబాద్ నగరానికి చెందిన బిజెపి ఎంఎల్‌సి రాంచందర్‌రావుకు ఆన్‌లైన్ మోసగాళ్లు తమ సాంకేతిక పరిజ్ఞానంతో మోసం చేశారు. ఎస్‌బిఐ, ఆంధ్రాబ్యాంక్ ఖాతాల నుంచి రూ. 40 వేలు మాయం చేశారు. బ్యాంక్ ఖాతాను క్లోన్ చేసిన నేరస్థులు ఆన్‌లైన్‌లో చాకచక్యంగా ఆయన ఖాతాలోని నగదును బదిలీ చేశారు. తన ఖాతాలోని నగదు తనకు తెలియకుండానే బదిలీ కావడంతో ఎంఎల్‌సి కంగుతిన్నారు. దీనిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి. రంగంలోకి దిగిన సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

థర్డ్ పార్టీతో 'హోమ్‌లెస్' జిఐఎస్ సర్వే

మన తెలంగాణ/హైదరాబాద్: నిలువ నీడ లేకుండా ఫుట్‌పాత్‌లపై జీవిస్తున్నవారిని గుర్తించే (హోమ్‌లెస్) సర్వే బాధ్యతలను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఒక ప్రైవేటు సంస్థకు (థర్డ్ పార్టీ) అప్పగించింది. ఈ సర్వేను మార్చి 31లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. 'జిఐఎస్ (జియోగ్రఫిక్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్) ద్వారా నిర్వహించే సర్వేకు సంబంధించిన ప్రత్యేక మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. అత్యవసర పద్ధతిన థర్డ్ పార్టీ సర్వే నిర్వహించాలని అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) ఆదేశించిన నేపథ్యంలో ఈ ప్రక్రియను మెప్మా వేగవంతం చేసింది. సర్వేను మూడు విభాగాలుగా విభజించిన మెప్మా ఈ బృందంలో స్థానిక పురపాలిక, మెప్మా సిబ్బందితో పాటు స్థానికంగా ఒక పోలీసు సిబ్బంది సహకారం కూడా తీసుకోనున్నారు. రహదారులతో పాటు పురాతన భవనాలు, రైల్వేస్టేషన్లు, ఖాళీ స్థలాలు, ప్రార్థన మందిరాలు, హాస్పిటల్, పార్కులు తదితర ప్రాంతాల్లో ఉన్న వారిని గుర్తించాలని మెప్మా తన మార్గదర్శకాల్లో పేర్కొన్నది. సర్వేతో పాటు వీరికి అవసరమైన షెల్టర్ల ఏర్పాటుకు తగిన వసతులు, సౌకర్యాలను కూడా అంచనా వేయాలని నిర్ణయించింది. ఇప్పటికే వివిధ మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రులలో నైట్ షెల్టర్లను ఏర్పాటు చేసే ప్రక్రియను మొదలు పెట్టింది. వీటి ఏర్పాటుపై ఇటీవల వైద్యాధికారులు, మెప్మా సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తాజాగా జిఐఎస్ సర్వేతో మరింత స్పష్టత వస్తుందని వర్గాలు భావిస్తున్నారు. హోమ్‌లెస్ సర్వేలో వ్యాధిగ్రస్తులను కూడా గుర్తించాల్సి ఉంటుంది. ఏ వ్యాధితో ఎక్కువగా బాధపడుతున్నారో గుర్తించి వారి పూర్తి వివరాలను సేకరించాలని, పురుషులు, మహిళలు, పిల్లల సంఖ్య వారి విద్యార్హతతో పాటు వారి నేపథ్యాన్ని కూడా ఆరా తీయాలని సర్వే ఏజెన్సీకి మెప్మా స్పష్టం చేసింది. వివిధ రోగాలతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఎలాంటి ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు?, వారు ఎక్కడ చికిత్స పొందుతున్నారనే వివరాలను కూడా సర్వే ఏజెన్సీ సేకరించనుంది. అలాగే రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో సర్వే చేపట్టేందుకు వేరే ప్రణాళికను రూపొందించుకోవాలని సర్వే ఏజెన్సీకి సూచించింది. స్థానిక స్వచ్ఛంద సంస్థలు, అధికారుల సహకారాన్ని కూడా తీసుకోవాలని పేర్కొన్నది. సర్వే పూర్తి కాగానే గడువులోగా సమగ్ర నివేదికను అందించాలని మెప్మా తెలిపింది.

సిఎస్ పదవీకాలం పెరిగేనా?



మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సిం గ్ పదవీ కాలం ఈ నెల 31న ముగుస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగిస్తుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. పదవీ విరమణ తర్వాత సిఎస్‌గా కొనసాగేందుకు మరో మూడు నెలల పాటు పొడిగింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని డిఒపిటి (సిబ్బంది శిక్షణా వ్యవహారాల విభాగం)కు విజ్ఞప్తి చేసింది. గతంలోని ఒకేసారి ఆరు నెలల పాటు పొడిగించే వెసులుబాటు ఉన్నప్పటికీ మూడేళ్లుగా మూడు నెలల పాటు మాత్రమే పొడిగించడం ఆనవాయితీగా వస్తోంది. తెలంగాణ రాష్ట్ర తొలి ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ విషయంలో సైతం రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల పాటు పొడిగింపు కోరితే మూడు నెలల చొప్పున రెండు సార్లు పొడిగించింది. ఆ తర్వాత ప్రదీప్ చంద్ర పదవీకాలాన్ని కూడా మూడు నెలల పాటు పొడిగించాలని కోరినా కేంద్రం ఆ దిశగా స్పందించలేదు. ఇప్పుడు ఎస్పి సింగ్ విషయంలో కేంద్రం ఏ విధంగా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. పదవీకాలం పూర్తికావడానికి ఒకటి రెండు రోజుల ముందే కేంద్రం నుంచి సమాచారం వస్తుండడంతో ఈ నెలాఖరుకు ప్రస్తుత సిఎస్‌కు పొడిగింపు ఉంటుందా ఉండదా అనేది సచివాలయ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. చివరి గంటల్లో ఎలాంటి సమాచారం వచ్చినా దానికి తగిన ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఒకవేళ పొడిగిస్తున్నట్లు కేంద్రం నుంచి సమాచారం వచ్చినట్లయితే రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ముగిసేంత (మార్చి నెల) వరకు ఎస్‌పి సింగ్ పరధాన కార్యదర్శిగా కొనసాగుతారు. లేదంటే సీనియారిటీ ప్రకారం ప్రస్తుత సాగు నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న శైలేంద్రకుమార్ జోషి ప్రధాన కార్యదర్శి అయ్యే అవకాశముంది.

కులం, మతం పేరుతో ప్రభుత్వం చిచ్చు



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో కులం, మతంపేరుతో టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను విడగొట్టే ప్రయత్నం చేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా.కె.లక్ష్మ ణ్ ఆరోపించారు. ప్రభుత్వం విఫలమైన అంశాలను, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. 2019 ఎన్నికల్లో సోషల్ మీడియానే తమ ప్రధాన అస్త్రమని, దీనిని విస్తృతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఐటి సెల్ వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మ ణ్ మాట్లాడుతూ ఐటి సెల్‌ను రాష్ట్ర స్థాయి నుంచి బూత్‌స్థాయి వరకు విస్తరింపజేయాలన్నారు. మోడీ ప్రధాని కాకముందు దేశంలో కేవలం ఐదు రాష్ట్రాల్లోనే బిజెపి అధికారంలో ఉండేదని, ప్రధానిగా ఆయన పాలన చూసిన ప్రజలు అదనంగా మరో 14 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ బిజెపి గెలుపు ఖాయమని, ప్రజలు మోడీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. టిఆర్‌ఎస్ ఇచ్చిన హామీలు అటకెక్కాయని, ప్రజల్లో అధికార పార్టీపై రోజు రోజుకూ అసంతృప్తి పెరుగుతోందని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలో వస్తామని కాంగ్రెస్ కలలు కంటోందని, ఆపార్టీని ప్రజలు తిరస్కరిస్తారని పేర్కొన్నారు. టిఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బిజెపియేనని ఆయన నొక్కిచెప్పారు. ఈ వర్క్‌షాపులో బిజెపి రాష్ట్ర ఇన్‌చార్జ్ కృష్ణదాస్, ఐటి సెల్ ఆల్ ఇండియా కన్వీనర్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీలకు చెక్!



- ఆన్‌లైన్‌లో వర్సిటీల సమాచారం
- ధ్రువపత్రాల పరిశీలనకు వెసులుబాటు
- 2001 నుంచి సమాచారం అందుబాటులో ఉంచేలా విద్యామండలి కసరత్తు



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో అన్ని యూనివ ర్శిల విద్యార్థుల డాటాను ఉన్నత విద్యామండలి అందు బాటులోకి తీసుకొచ్చింది. టెక్నాలజీని వినియోగించుకొని నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లను కట్టడి చేసేందుకు చర్యలు చేపడుతోంది. ఇప్పటి వరకు 2011 నుంచి స్టూడెంట్ డాటా అందుబాటులో ఉండగా, దానిని 2001 నుంచి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతోంది. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలకు వస్తున్నారని, మార్కులను కూడా మారుస్తూ గతంలో ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీనిపై దృష్టి సారించిన ఉన్నత విద్యామండలి యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లతో సమావేశాలు నిర్వహించి www.tsche.ac.in వెబ్‌సైట్‌లో విద్యార్థుల సమాచారాన్ని అందుబాటులో ఉంచింది.

సులభతరంగా ధ్రువపత్రాల పరిశీలన

విద్యార్థుల డాటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం తో పాటు ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలతో పాటు ఎవరైనా ఉచితంగా ధ్రువపత్రాలను పరిశీలించుకునే వెసులుబాటు కల్పించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం www. tsstudentverification.org వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థి చదువుకున్న యూనివర్సిటీ, డిగ్రీ, ఉత్తీర్ణులైన సంవత్సరం, హాల్ టికెట్ నెంబర్ పొందుపరిస్తే వెంటనే ఆ విద్యార్థికి సంబంధించి మార్కులు, ఇతర సమాచారం చూపిస్తుంది. దేశ విదేశాలకు చెందిన సంస్థలు, వ్యక్తులు నిమిషాల్లో విద్యార్థుల డాటాను పరిశీలించవచ్చు. ఇదివరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ వర్సిటీలకు రూ. 500 ఫీజు చెల్లించడంతో మూడు నెలల నుంచి ఆరు నెలల వరకు వేచి చూడాల్సిన వచ్చేది. ఈ ప్రక్రియ అంతా చేయలేక కొన్ని కంపెనీలు అనుమానం వచ్చిన విద్యార్థులను తిప్పి పంపించిన సందర్భాలు ఉన్నాయి. ఫలితంగా అన్ని సర్టిఫికెట్లు సరిగ్గా సమర్పించిన ప్రతిభ గల విద్యార్థులు కూడా ఉద్యోగ అవకాశాలు కోల్పోవాల్సి వచ్చింది. ఆన్‌లైన్‌లో స్టూడెంట్ డాటాను అందుబాటులోకి తీసుకురావడంతో ఈ తరహా చాలా సమస్యలకు చెక్ పడుతుండడంతో పా టు విదేశాలలో ఉన్నత విద్యకోసం , ఉద్యోగాల కోసం వెళ్లే అభ్యర్థుల వెరిఫికేషన్ కూడా సులభతరమైంది.

13 లక్షల మంది విద్యార్థుల డేటా

ప్రస్తుతం ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో 2011 నుంచి జెఎన్‌టియుహెచ్, ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ, శాతవహన, తెలంగాణ, పాలమూరు, మహాత్మా గాంధీ యూనివర్సిటీలతో పాటు అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాలకు చెందిన 13,52,756 మంది విద్యార్థులు డాటా అందుబాటులో ఉంచారు. మరో ఆరు నెలల్లో 2001 నుంచి ఈ వర్సిటీలకు చెందిన స్టూడెంట్ డాటాను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఉన్నత విద్యా మండలి కసరత్తు చేస్తోంది.

అర్ధరాత్రి.. చలిలో కాలినడకన!

- 12 గంటల సమయంలో మేడారం రిజర్వాయర్ పనులు పరిశీలించిన మంత్రి హరీశ్‌రావు
- పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- మంత్రితో పాటు ఇంజినీర్లు, అధికారుల జాగారం





మన తెలంగాణ/ధర్మారం/అంతర్గాం: అర్ధరాత్రి.. అపై చలి.. అందులోనూ కాలినడకతో భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు శనివారం 12 గంటల సమయంలో మేడారం రిజర్వాయర్ పనులను పరిశీలించారు. ఇటీవల కుంగిన ప్రాంతంలో జరుగుతున్న పనుల వద్ద కాలినడకనే కలియ తిరిగారు. పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధి కారులను ఆదేశించారు. జులై నాటికి రెండు పంపుల్ని పూర్తిచేసి నీటి విడుదలకు కృషి చేయాలని సూచించారు. మంత్రి వెంట కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో పాటు, ఎసిపి హబీబ్‌ఖాన్, ఎస్‌ఐ బాబురావు ఉండి రాత్రంతా జాగారం చేశారు. అంతకుముందు ఉదయం కాళేశ్వరం పనుల పరిశీలనలో భాగంగా అధికారులను వెంటబెట్టుకొని టన్నెళ్లు పరిశీలించి, వారితో సమీక్షించారు. అప్పటికే రాత్రి ఏడు కావడంతో అధికారులంతా మంత్రి హైదరాబాద్‌కు వెళ్తారని ఊహించినా 7:30 గంటల సమయంలో మల్లాపూర్ చేరుకొని ప్యాకేజీ 7లో భూగర్భ పనులను పరిశీలించారు. ఇక్కడ పలు సూచనలు చేసి పైకి రాగానే అధికారులందరినీ ప్యా కెజీ 6 మేడారంలోని సాయంపేట క్యాంప్‌కు రావాల్సిందిగా ఆదేశించారు. ఏకంగా నీటి పారుదల ముఖ్య కార్యదర్శి ఎస్‌కె. జోషి , ఇంజినీర్ ఇన్‌చీఫ్ మురళీధర్‌రావు, సిఇ వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ వెంకట్రాములుతో పాటు గవర్నర్ వెంట హెలికాప్టర్‌లో హైద్రాబాద్ వెళ్లిన నూనె శ్రీధర్‌ను పిలిపించుకొని అధికారులందరితో రాత్రి వరకు సమీక్షించారు.

గోలివాడ పంప్‌హౌస్ ఆకస్మిక తనిఖీ

అంతర్గాం మండలం గోలివాడ వద్ద నిర్మిస్తున్న కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు అనుబంధ పంప్ హౌస్‌ను ఆదివారం మంత్రి హరీశ్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. మిగతా ప్రాజెక్టుల వద్ద జరుగుతున్న పనుల కంటే వేగంగా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో వేగాన్ని పెంచి త్వరితగతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. జూన్ వరకు కాంక్రీట్ పనులు పూర్తిచేసి మోటార్ల ద్వారా ఇక్కడి పంప్‌హౌస్ నుంచి నీటి పంపింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలని నీటిపారుదల అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల స్థితి గతులను నీటి పారుదల శాఖ ఎస్‌ఇ సుధాకర్ మంత్రికి వివరించారు. మంత్రి వెంట డీఈ నరేష్, స్థానిక సర్పంచ్ దబ్బెట రమ్య తిరుపతి, యంపిటిసి ధరణి హైమావతి సత్తయ్య, టిఆర్‌ఎస్ నాయకులు పానగంటి సత్తయ్య, కట్కూరి గోపాల్ రెడ్డి లతో పాటు ఎస్‌ఐ ప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు.

నేటి నుంచి జనసేన ప్రజాయాత్ర

మన తెలంగాణ/హైదరాబాద్: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తెలంగాణ రాష్ట్రంలో తన రాజకీయ యాత్రను సోమవారం ప్రారంభించనున్నారు. జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని ఇందుకు ప్రారంభ స్థలంగా నిర్ణయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం యాత్ర ప్రణాళికను ప్రకటించనున్నారు. నిరంతర ప్రజా యాత్ర (ఛలోరే.. ఛలోరే.. ఛల్)ను హైదరాబాద్ జనసేన కార్యాలయం నుంచి ప్రారంభించి జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆలయానికి మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో చేరుకుంటారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సాయంత్రం కరీంనగర్‌కు చేరుకుని పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడుతారు. మరుసటి రోజున జగిత్యాలలోని 'శుభం గార్డెన్'లో ఉదయం 10.45 గంటలకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల కార్యకర్తలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం కొత్తగూడెం చేరుకుని రాత్రికి అక్కడే బస చేసి, 24వ తేదీన ఉదయం 9.30 గంటలకు కొత్త గూడెం నుంచి ప్రదర్శనగా బయలుదేరి ఖమ్మంకు చేరుకుంటారు. అక్కడ ఎం.బి. గార్డెన్స్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొగొండ జిల్లాల కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. తన యాత్రలో ఎలాంటి బహిరంగ సభలు ఉండబోవని, కేవలం కార్యకర్తలతోనే సమావేశం ఉంటుందని జనసేన కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

సెయింట్ థెరిస్సాలో పవన్ దంపతుల ప్రార్థనలు



సికింద్రాబాద్‌లోని సెయింట్ థెరిస్సా బెసిల్లికా చర్చిలో పవన్‌కళ్యాణ్ తన సతీమణితో కలిసి ఆదివాయరం ఉదయం ప్రార్థనలో పాల్గొన్నారు. పోలాండ్ దౌత్యాధికారి ఆడమ్ బురాకోవస్కీ కూడా కుటుంబ సమేతంగా ఈ ప్రార్థనలో పాల్గొన్నారు. భారతీయ జీవన శైలి, విద్యా విధానాన్ని అధ్యయనం చేసేందుకు పోలాండ్ నుంచి వచ్చిన విద్యార్థుల బృందం, ప్రతినిధులు కూడా ఈ ప్రార్థనలో పాల్గొన్నారు. పవన్‌కళ్యాన్ కుటుంబం, మిగిలిన బృందం వారికి పొలిష్ కౌన్సిల్‌తో కలిసి రెవ రెండ్ ఫాదర్ స్వాగతం పలికారు. అనంతరం పోలాండ్ దౌత్యాధికారి, ఆ దేశ విద్యార్థి బృందం హైదరాబాద్‌లోని జనసేన పరిపాలన కార్యాలయానికి వెళ్లి పవన్ కళ్యాణ్‌తో చర్చించారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్, ఆడమ్ రెండు దేశాల జాతీయ పతకాలను పరస్పరం అందుకున్నారు. ఆ తర్వాత పోలాండ్‌లోని మహారాజ కళాశాల, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను ఉద్దేశించి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇతర దేశాలకు చెందిన సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవడం ఎంతో మేలు చేస్తుందన్నారు. తద్వారా వివిధ దేశాల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడతాయన్నారు. దేశాల మధ్య అనుమానాలు తొలగిపోతాయని చెప్పారు. తన భార్య 'అన్నా' రష్యా దేశస్తురాలని వారికి తెలిపారు.

రెండు రోజులు చలిగాలులు

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే రెండు రోజుల పాటు రాష్ట్రంలో చలిగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో ఈ తీవ్రత ఎక్కువగా ఉంటుందని డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. గడచిన 24 గంటల్లో ఆదిలాబాద్‌లో కనిష్టంగా 6 డిగ్రీల ఉష్ణోగ్రత, మెదక్‌లో 9, రామగుండంలో 11 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాచలం, హకీంపేట, హైదరాబాద్, ఖమ్మంలలో 13, నిజామాబాద్‌లో 14 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణంలో చలి తీవ్రత పెరిగింది. ఖమ్మం, రామగుండం, మెదక్ జిల్లాలలో సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఏకంగా 6 డిగ్రీల మేర తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాచలంలో 5, హైదరాబాద్‌లో 4 డిగ్రీలు తక్కువగా నమోదు కావడంతో చలి ప్రభావం కనిపించింది.

నేతన్నల ఆకలి చావులు కనిపించట్లేదా?



- ప్రభుత్వాన్ని పొగిడి హుందాతనాన్ని కోల్పోయిన గవర్నర్ నరసింహన్
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

మన తెలంగాణ/కరీంనగర్ రూరల్: 'రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేనేత కార్మికుల ఆకలి చావులు కనిపించట్లేదా? ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని పొగిడి తన గవర్నర్ తన హుందాతనాన్ని కోల్పోయారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామంలో జరిగిన సిపిఐ 9వ మండల మహాసభకు ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. నేరెళ్ల బాధితులను వెళ్లి పరామర్శించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని గవర్నర్‌కు ఆయన హితవు పలికారు. ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలకు పతనం తప్పదని, మోడీ ప్రధాని అయ్యాక దేశంలో కార్పోరేట్ శక్తుల ఆగడాలు మితిమిరాయన్నారు. దేశంలో మతోన్మాదులు పెరిగి లౌకికవాదులు, వామపక్ష భావజాలం కలిగిన వారిపై, మేధావులు, రచయితలు, పాత్రికేయులపై దాడులు చేస్తూ హత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కెసిఆర్ నైజాం పాలనను తలపిస్తున్నారన్నారు. ఇసుక, డ్రగ్స్, భూ మాఫియాల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో ఒకే కుటుంబ పాలన నడుస్తుందని, వారి చేతుల్లో తెలంగాణ బందీ కావడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాల్వ నర్సయ్య యాదవ్, సభ అధ్యక్షుడు లక్ష్మ య్య, రాయమల్లు, జిల్లా కార్యవర్గ సభ్యుల పైడిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ సీనియర్ నేత మృతికి నివాళి

మన తెలంగాణ/కోహెడ : సిద్దిపేట జిల్లా కోహెడ మండలం పర్వేద గ్రామంలో సీనియర్ సిపిఐ నేత రేమిడి సుదర్శన్‌రెడ్డి ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆయన భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ సుదర్శన్‌రెడ్డి నిబద్ధత కలిగిన వ్యక్తి అని, పార్టీ పటిష్టత కోసం కృషి చేశాడని కొనియాడారు.







మేడారం భక్తజనం సంద్రమైంది. మహాజాతరకు ముందే అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే పెద్దసంఖ్యల్లో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజుల్లోనే సుమారు 20లక్షల మంది తరలివచ్చారు. కలెక్టర్ ఆర్.వి. కర్ణన్,సబ్ కలెక్టర్ గౌతమ్, ఎస్‌పి ఆర్ భాస్కరన్, అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. మహబూబాబాద్ ఎంఎల్ఎ శంకర్ నాయక్, మాజీ ఎంపి సిరిసిల్ల రాజయ్య, వైఎస్‌ఆర్‌సిపి నేత జగన్‌మోహన్ రెడ్డి బంధువులు, ఉన్నతస్థాయి అధికారులు, వనదేవతలను దర్శించుకున్న వారిలో ఉన్నారు. - మన తెలంగాణ/మేడారం/తాడ్వాయి/భూపాలపల్లి

కలం

సాహితీ పిపాసి పోతుకూచి



డా.ఎస్.విజయభాస్కర్
9290826988

తెలుగు సాహిత్యంలో పోతుకూచి సాంబశివరావు బహుముఖ ప్రజ్ఞాశీలి. కవిగా, రచయితగా, నాటక కర్తగా, నటుడిగా, అనువాదకునిగా,వ్యాస కర్తగా, జీవిత చరిత్ర రచయితగా, పత్రి కా రచయితగా, సంపాదకునిగా, సాహిత్యోద్యమకర్తగా, కథారచయితగా, విమర్శకునిగా, సాహిత్యాభిమానులకు సుపరిచితులు. పోతుకూచి సాంబశివరావు 1928 జనవరి 27న తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు గ్రామంలో జన్మించారు. సూరమ్మ, నరసింహమూర్తి పుణ్య దంపతులు ఇతని తల్లిదండ్రులు. పోతుకూచి వంశస్తులు కావడంతో పోతుకూచి సాంబశివరావు 'పోతుకూచి'గా సుప్రసిద్ధులు. 1950 ప్రాంతంలో తెలంగాణకు రావడం హైదరాబాద్‌లో స్థిరపడటంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, హైదరాబాద్ సంస్కృతి సంప్రదాయాలు, హైదరాబాద్ ఆచార వ్యవహారాలు తమ కథలలో, నాటకాలలో ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. తెలంగాణలో జీవితమంతా గడిపి తెలంగాణ రచయితలను, కవులను, కళాకారులను, సాహిత్య సంస్థలను ప్రోత్సహిస్తూ తెలుగు సాహిత్యం కోసం ఎప్పుడూ తపించిన పోతుకూచి సాంబశివరావును'' తెలంగాణ దత్తపుత్రుడు'గా చెప్పవచ్చు. తెలంగాణలోని లబ్ధప్రతిష్టులైన కవుల నుంచి వర్ధమాన కవుల వరకు ఎంతో మంది రచనలను పోతుకూచి నడిపిస్తున్న విశ్వరచన, విశ్వసాహితీలో ప్రచురించడం. విశ్వసాహితీ సాహిత్య, సాంస్కృతిక సంస్థ ద్వారా సన్మానించడం. పుస్తక ప్రచురణలకు ఆర్థికంగా, హార్ధికంగా సహాయ, సహకారాలు అందించడం చేస్తుండేవారు. 2017 ఆగస్టు 6వ తేదీన స్వర్గస్తులైనప్పటికీ ఆయన సాహిత్యం తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానంను పొందింది.

పోతుకూచి సాంబశివరావు నటుడిగా, నాటకకర్తగా ఎంతో ప్రసిద్ధి పొందారు. రేడియో నాటకాలలోనూ నటించారు. ఏకపాత్రాభినయాలు రచించారు. రేడియో నాటికలను రాశారు. రేడియో నాటికలను సంపుటిగా ప్రచురించారు. ప్రతిధ్వనులు అనే శ్రవ్యనాటకాల సంపుటిలో 10 నాటికలున్నాయి. అవి 1) పెళ్ళి పిలుపు, 2) రెండు నాటికలు, 3) అంత్యక్రియలు, 4) అద్దె కొంపలో ఒక నెల, 5) స్వాముల వారు, 6) కాలక్షేపం, 7) గృహంలో ప్రజాస్వామ్యం, 8) వితంతు వివాహం, 9) తిరుగుబాటు, 10) చుట్టాల రభస. ఈ నాటికలు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి ప్రసారమవుతూ పాఠకుల ప్రశంసలు అందుకున్నాయి. నాటికలలో ''ఇదీ తంతు'', ''దొంగ'', ''దొర'' ''ఏడు సున్నాలు'', ''మూడు నాటికల సంపుటి ఇందులో ''ఒన్, టు, త్రీ, ఫోర్'', ''ఏం ప్రేమలో ఏం గొడవలో'', ''అంతరించే అంతరాలు'', ''దీన్ దయాళ్ గారి దేవుడిలో'' ''సరిహద్దుల్లో'', ముఖ్యమైనవి.

''హంతకులు'', ''పల్లె కదిలింది'' నాటకాలను రాశారు'' పోతుకూచి నాటకాలు ఒక పరిశీలను'' అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం ఓరియంటల్ విభాగం నుండి ఈ వ్యాస రచయిత. ఉస్మానియా యూనివర్సిటీ ఓరియంటల్ ఫ్యాకల్టీ బోర్డు ఆఫ్ స్టడీస్ మాజీ చైర్మన్ బి.జయరాములు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. పోతుకూచి నాటకాలపై చలం, శ్రీ.శ్రీ. నార్ల, షేక్ స్పియర్, మొదలైన అనేక మంది ప్రభావం ఉన్నట్లు కన్పిస్తుంది. పోతుకూచి నాటకాలను భారతదేశ జాతిపిత మహాత్మగాంధీ, భారతదేశ మాజీ రాష్ట్రపతి ఆర్. వెంకట్రామన్, మాజీ ముఖ్యమంత్రులు వెల్లోడి, బూర్గుల మొదలైన వారు ఎంతో మెచ్చుకున్నారు. నాటకరంగంలో సుప్రసిద్ధులైన ఎంతోమంది కళాకారులు, నటులు, నాటక కర్తలు, విమర్శకులు పోతుకూచి నటనను చూసి వేనోళ్ళ పొగిడేవారు. ఆల్ ఇండియా రేడియోలో 'ఎ' క్లాస్ ఆర్టిస్ట్‌గా పేరు సంపాదించారు.



పోతుకూచి సాంబశివరావు

పోతుకూచి కథలు సంపుటాలుగా వచ్చి సంచలనం సృష్టించాయి. ''ఎదురు ప్రశ్నలు (1952), హైదరాబాద్‌లో (1957), బతుకుల పతనం (1962), కొత్త విలువల బతుకు (1963), మందారాలు (1969), పోతుకూచి కథలు, శేఖరం కథలు (రెండు సంపుటాలు) ఒక్కొక్క కథల సంపుటం కొత్తదనంతో మరింత మెరుగులతో ఉగ్రూతలూగిస్తూ, ఉత్సాహపరుస్తూ చదివింపజేస్తాయి. పోతుకూచి కథలలో సాంఘిక కథలు, దేశభక్తి కథలు, ప్రేమకథలు, హాస్యం కథలు కన్పిస్తాయి. సామ్రాజ్యవాద భావాలతో పాటు మూఢనమ్మకాలు, సనాతన మతాచారాలపై తిరుగుబాటు ఎన్నో సామాజిక విషయాలు చోటుచేసుకున్నాయి.

పోతుకూచి కథలలో ముఖ్యంగా 1) కొత్త విలువల బ్రతుకు. 2) మామ్మ నడిపిన విప్లవం, 3) వారసులు, 4) మాతృమూరి, 5) ఏకాంతం, 6) రాయబారి, 7) మలుపు తిరిగిన మమత, 8) అతనిలో వెలుగు చుక్క, 9) సిగరెట్ చిలిపి చేష్టలు, 10) విముక్తి, 11) తొలి వెలుగు మలుపు, 12) గోదావరి గట్టు మీద, 13) నాకీ అవతరాలు చాలు ప్రభూ, 14) చౌరస్తాలో నాయకుడు, 15) బస్సులో పది నిమిషాలు, 16) చౌకులో, 17) అసమర్థుడు, 18) రామచంద్రుని అరణ్యవాసం, 19) విడివడని ముడులు, 20) ప్రాణం తీసిన పందు, 21) సంఘర్షణ, 22) సాలెగూళ్ళు, 23) ఆహ్వానం, 24) అంతర్భాగాలు, 25) కాలయంత్రంలో సాయంత్రం, 26) వీడ్కోలు, 29) వివాహంలో కలహం, 30)పండుగ నాటి శాపం, 31) పెంపుడు జంతువు, 32) కలిసి విడిన వెలుగు కణాలు, 33) స్మృతి వెలుగులు, 34) డాక్టర్ చంపిన రోగి, 35) ఆమె గృహంలో అతని స్వగృహం, 36) దారి తప్పిన ప్రేమ, 37) మాజీ యజమాని, 38) మంచివాని చెడ్డతనం.39 తెగిన కథ . 40 జీవితం విలువ 41. చితికిన మాతులు 42. విముక్తి ఎప్పుడు? పోతుకూచి కథలు హిందీలోనూ, ఇంగ్లీష్‌లోనూ, రష్యా , జర్మనీ భాషలలో అనువదింపబడి ఎంతో ప్రఖ్యాతి గాంచాయి.

పోతుకూచి నవలలు రచించారు. ముఖ్యంగా ''ఉదయ కిరణాలు'' ''ఏడు రోజుల మజిలీ'', ''అన్వేషణ'',''చలమయ్య షష్టి పూర్తి'', ''నారింజ'' లాంటి నవలలు చదవడం ప్రారంభిస్తే ముగింపు వరకు పాఠకులను కట్టిపడేసేవే. పోతుకూచి పేరు కాస్తా ''ఉదయ కిరణాలు సాంబశివరావు''గా కూడా మారిపోయింది. కవితా రచనలోనూ పోతుకూచి విశేషంగా కృషి చేశారు. వర్ధమాన రచయితలతో పోటీ పడ్తూ దిన, వార, పక్ష, మాస పత్రికలలో తమ కవితలనూ ప్రచురించేవారు. ఇతరుల కవితలు చదివి వారిని ప్రోత్సహించేవారు. మెచ్చుకునేవారు పోతుకూచి 5 కవితా సంపుటాలను వెలువరించారు. అవి. 1. రాసి సిరా, 2. అనురాగం 3. శిఖరాలు 4. చైతన్య కిరణాలు 5. అన్ని నాదాలు, ఈ కవితా సంపుటాలలో అవినీతి, అన్యాయం, బంధుప్రీతి, లంచ గొండితనం. మూఢ నమ్మకాలను నిరసిస్తూ దేశభక్తిని ప్రబోధించారు.

పోతుకూచి ఆధునిక తెలుగు సాహిత్యంలోని ప్రక్రియలలో ముఖ్యంగా హైకూలు, నానీలు, మీని కవితలు, సాధామినీ కవితలు మాదిరిగా స్వయంగా ''చుక్కలు'' అనే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దీనిని అనుసరించి అనేక మంది కవులు ''చుక్కలు'' ప్రక్రియలో తాము కవితలు రాయడం. కవితా సంకలనాలను ప్రచురించడం చేశారు. వ్యాస కర్తగా పోతుకూచికి ప్రత్యేక స్థానం ఉంది. ''శృంగాటకం'' అనే శీర్షికతో అనేక వ్యాసాలు రాశారు. శృంగాటకం అంటే చదుకూ (చౌరస్తా) అని అర్థం నాలుగు వీధుల కూడలి చదుకూ కాబట్టి ఆయన వ్యాసాలు నాలుగు మార్గాలు అంటే వాటికి సంబంధించిన నాలుగు అర్థాలు గోచరిస్తాయి. 'దక్కన్ క్రానికల్' ఆంగ్ల దినపత్రికలో ''ది తెలుగు వరల్డ్'' అనే శీర్షికతో తెలుగు సంస్కృతి. సాహిత్యం, భాష, సంప్రదాయాలపై అనేక వ్యాసాలు రాశారు. ఆంధ్ర పత్రికలో ''న్యాయం, చట్టం'' గురించి సామాన్యులకు అర్థమయ్యేలా అందరికి న్యాయం' అనే శీర్షికతో పలు వ్యాసాలు రాశారు.

అనువాద రచనలో పోతుకూచికి మంచి అనుభవం ఉంది. ఆలిండియా రేడియో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో గణతంత్ర దినోత్సవం , సందర్భంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనాలలో ఆంగ్ల కొంకణి, కన్నడ, ఒరియా, హిందీ, నేపాలీ కవితలను అనువాదం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆలిండియా అనువాద వర్క్‌షాప్‌లో పోతుకూచి నిర్వహించిన పాత్ర అనిర్వచనీయం. దక్షిణ భారత భాషలకు సంబంధించిన సాహిత్య అకాడమీ నిర్వహించిన అనువాదకుల వర్క్‌షాప్‌లో కూడా పోతుకూచి ప్రముఖంగా నిలిచారు. పద్యరచనలో పోతుకూచికి బాల్యంలోనే బీజాలు పడ్డాయి. సుమతి, వేమన, కుమారి, భాస్కర, రామదాసు, శతకాల మాదిరిగా తాను శతక రచన రాయాలని ''పోతుకూచీయం'', ''సాంబశివానందలహరి'' అను రెండు శతకాలను రచించారు. కళాశాలలో చదివే రోజుల లోనే ''జనసాందుడు'' అనే పేర పద్యాలను రచించారు. పోతుకూచి తాను నడిపే విశ్వరచనలో డైరీ రాసేవారు. ఈ డైరీని ఎంతో మంది సాహితీ ప్రముఖులు మెచ్చుకున్నారు. డా॥. సి.నా.రె., జి.వి. సుబ్రహ్మణ్యం, పి.వి. రమణ, చే.రా, కోకా రాఘవరావు, గండవనం సుబ్బరామిరెడ్డి మొ. ఎంతో మంది పోతుకూచి డైరీలో సాహిత్య విషయాలను ఎంతో అద్భుతంగా కన్నులకు కట్టినట్లు రాస్తారని ప్రశంసలు కురిపించేవారు.1984లో బెంగళూర్‌లో అఖిలభారత భాషా సాహిత్య సమ్మేళనం జరిగిన సందర్భంలో పోతుకూచిని ''భారత భాషా భూషణ్'' అను బిరుదుతో సత్కరించారు.

ఈ బిరుదు డాక్టరేట్‌కు సమానమైనది. 1993లో ఆంధ్రవిశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదును ప్రదానం చేసింది. 1972 లో హైదరాబాద్‌లో జరిగిన సాహితీ రజతోత్సవం సందర్భంగా అప్పటి విద్యాశాఖ మంత్రి యం. వి. కృష్ణారావు చేతుల మీదుగా ''సాహితీ చైతన్య'' అనే బిరుదును ప్రదానం చేశారు. 1979లో వరంగల్‌లో సాహితీ భీష్మ, త్యాగరాయ గానసభలో ''కళారత్న'' ఈ విధంగా ఎన్నో సంస్థలు, సాహిత్య, సాంస్కృతిక, కళా సంస్థలు అనేక బిరుదులతో సన్మానాలు చేశాయి. అనేక మందికి సాహిత్య, కళా సంస్థలను ప్రారంభించేటట్లు ప్రోత్సహించి వారికి సలహాదారులుగా ఉంటూ సహాయ, సహకారం అందించారు. జీవితమంతా తెలుగు సాహిత్యానికి అంకితం చేసిన వ్యక్తి పోతుకూచి నిరాడంబర జీవితం, నిశితమైన ఆలోచన, తెలుగు సాహిత్యాభివృద్ధికై తపన, కొత్తవారిని ప్రోత్సహించాలనే తాపత్రయం, నిష్కల్మష హృదయం గల పోతుకూచి తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలో సాహితీ వ్యవసాయం చేసిన కృషీవలుడు. ఈ నెల 27వ తేదీ ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఉదయం నుండి సాయంత్రం వరకు పోతుకూచి జన్మదినోత్సవ సందర్భంగా కవి సమ్మేళనాలు, సన్మానాలు, ఉపన్యాసాలు వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోతుకూచిని గురిం చి తలుచుకునే కంటే ఆయన సాహిత్యాన్ని, చదివితే నిజమైన నివాళులు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల లోనూ తమ తోడ్పాడు అందించారు.

తల చిదమాలి!



తెలిసి
ప్రజాస్వామ్యంపేరు చెప్పి
దీన్ని బ్రతకనిస్తే
జన వాసానికెంత నష్టం..!
పచ్చని పంట పొలంలో
పట్టు కుచ్చులాంటి పత్రహరితాన్ని
పసాపడిత్రేన్చె పాపిష్టి పురుగుని
నిర్లక్ష్యంగా వదిలేస్తే ఎంత అరిష్టం..?
నలుపు ఇష్టమవటం
నైజం అది జన్మాదిష్టం కనుక
తెలుపు అనిష్టమవటమూ
సహజమే – అది మనోభీష్టం కనుక
లాగూ చొక్కా తొడుక్కున్నంత మాత్రాన
లావు పోడిమి ఎలా వస్తుంది
శివశుక్ల మెఋవైన రక్కసి పొదజాతి
సారగంధ మెలా వీస్తుంది..?
జీను వేసినంత మాత్రాన
రాసభం రాజస్కంధ మౌతుందా
కుర్చీపై కెక్కించినంత మాత్రాన
కుక్క కాలెత్తడం మానుకుంటుందా..?
వైదేశిక శ్వేత కుష్ఠ నిభృతాంగాన్ని
ఆబగా ఆప్యాయనంగా ఆస్వాదించడం
అలవడిన అవలక్షణం కాదు – అది
చీడ పురుగు సహజ లక్షణం
కలిసిపోయిన వర్ణ ప్రభల పర్ణ ప్రబంధాన్ని
'ఈ నె''లంటా ఛిద్రం చేసే కిలారి కీటకాన్ని
పిచ్చి పురుగని జాలి తలచి వదిలేసి
తల చిదమకపోతే
ఆ తప్పు మానవత్వానిది..!


సాంధ్యశ్రీ
8106897404

నిరాడంబర రుషులు

కదిలిపోతూ జారిపోతూన్న
కాలం లోని ముఖ్యఘట్టాలనూ
మారుతూన్న ప్రకృతిలోనీ,
జీవనగమనంలోనీ
ప్రధాన సన్నివేశాలనూ, సంఘటనలనూ
చాకచక్యంగా ఒడిసిపడుతూ,
కవులూ,రచయితలూ
నిస్వార్థంగా, నిర్విరామంగా కృషిచేస్తూ
తమ తమ ప్రక్రియల రూపాలలో
అపురూపంగా భద్రపరుస్తూంటారు।
కవితలుగా, మహాకావ్యాలుగా–
కథా,నవలా, నాటకాదులుగా–
అత్యద్భుత కళాఖండాలను
సృష్టిస్తూంటారు।
అయినా–వీరిలో చాలా మంది
ఉన్నత భోగభాగ్యాలనూ,
భూషణాల సన్మానసత్కారాలనూ కోరుకోరు।
జనం మెచ్చుకుంటూ కొట్టే చప్పట్లనే
దుప్పట్లుగా కప్పుకుంటూ
అవే గొప్ప సన్మాన సత్కార బిరుదులుగా
సంతృప్తి పడుతూంటారు
ఈ నిరాడంబర రుషులు।

రఘువర్మ
92922 93933

అయోధ్యారెడ్డి ఆహారయాత్ర



డా.బి.వి.ఎన్.స్వామి
9247817732


పుట్టిన చోటనే బతికే రోజులు పోయినయి. బతుకుదెరువు కోసం బాటసారిలా మారి ఏదో ఒక మజిలీ చేరుకోవడంలో యాత్ర ఆగుతుంది. మనిషి స్థలాన్నయితే వదిలిపెట్టగలడు కాని జ్ఞాపకాలను ఎలా వదలగలడు. ఆచరణ అందించిన అనుభవాలు, అనుభూతించిన ఆసక్తులు, ఆశయాల వెలుగుదారులు అన్ని వదిలిన చోటు నుండి కుదురుకున్న చోటు వరకు మనిషి వెంబడేవస్తయి. అవన్నీ జ్ఞాపకాల రూపంలో ఉంటయి. చింతనాపరుడికి పట్టింపు ఎక్కువ కనుక వారికి గతం ఎప్పుడూ గుర్తుకొస్తుంటది. వీరు తమ జ్ఞాపకాలను ఇతరులతో కలబోసుకుంటరు. సృజనకారుడైతే రచనల్లో వాటిని నిక్షిప్తం చేస్తడు. పాఠకులకు చేరవేస్తడు. ఆ క్రమంలో వచ్చినవే డా॥ ఎయం అయోధ్యా రెడ్డి రాసిన ''ఆహార యాత్ర'' కథలు.

కథకుడిగా అయోధ్యారెడ్డిది నిశితమైన చూపు. తను చిత్రించదలచుకున్న జీవిత పార్శ్వాలన్నిటిలోకి చొరబడి, విషయం అర్థమయ్యాక చెప్పడం మొదలుపెడతడు. కొన్నయితే తను అనుభవించినవేనా అన్నట్లుంటవి. అసాంఘిక కార్యక్రమాలు చేసే వాళ్లకు కూడా మనసు ఉంటది. కొట్టుకులాడే మనసు ఏం కోరుకున్నదో తెలిసేసరికి పాఠకుడి హృదయం ద్రవిస్తది. పాఠకుడి మనసు ద్రవీభూతం చేయడంలోనే కథకుడి నైపుణ్యం దాగి ఉంటది. అయోధ్యారెడ్డి నైపుణ్యానికి కథలు అద్దంపడతాయి. అందరూ వేశ్య శరీరాన్ని పంచుకోవాలనుకొనేవాళ్లే కాని మనసు పంచుకోవాలనుకొనేవాళ్లు ఎవరు? ఒకవేళ అనుకుంటే సంఘనీతి అడ్డొస్తుంది. వీటన్నిటిని దాటి ఆమె మనసు తెలుసుకొని, ఆత్మీయతను, పవిత్రతను అందుకున్న పిల్లవాడి కథ ''నిశ్శబ్దం చప్పుడు'' అందుకు అతను చెల్లించిన మూల్యం వెలలేనిది.

తెలంగాణలో పటేల్ వ్యవస్థ గురించి అందరికి తెలుసు. వాళ్ల దోపిడీ గురించి అనేక కథలు వచ్చినవి. చదువురాని పాలేరును, పటేల్ ఏ విధంగా అప్పు కింద పీల్చి పిప్పి చేస్తడో కథలో కనపడుతుంది పటేల్‌ను ''పిచ్చి కుక్క'' తో పోల్చడం ప్రతీకాత్మకంగా ఉంది. అమాయకుల వద్ద నుండి ఏ విధంగా డబ్బు గుంజి సుఖంగా బతకవచ్చో పటేల్ తెలియజెపితే మిగతా వారందరు అట్లనే చేసే అవకాశం ఉంది. పిచ్చికుక్క ప్రతి ఒక్కర్ని కరచినట్లే, మోతుబరులు తమ కిందివారిని అట్లనే దోపిడీ చేసే అవకాశముందని అర్థం. పిచ్చికుక్కను చంపినట్లే, ఇలాంటి వాళ్లను కూడా లేకుండా చేయాలనేది అంతరార్థం. ఈ నిర్ణయానికి పాలేరు వచ్చే సన్నివేశము కొత్తగా ఉంది. ఇద్దరు వ్యక్తులు తన గురించి మాట్లాడుకుంటూ ఉండగా, అనుకోకుండా చాటు నుండి విన్న పాలేరు చైతన్యవంతుడవడం ఆసక్తి గొలుపుతుంది. పటేలు, మోతుబరిల అహంకారం, పాలేరును కించపరచడం భరించలేనివిగా ఉన్నవి.

'పొట్టోని తల పొడుగోడు కొడితే, పొడుగోని తల దేవుడు కొడుతడు' అనేది ఒక సామెత. దీనికి విరుద్ధంగా అత్యంత హృదయ విదారకంగా సాగిన కథ ''ఆకలికి మరో వైపు'' లేవలేని రోగంతో తల్లి, నిలువలేని ఆకలి కడుపుతో లచ్చి, ఏం చెయ్యాల్లో పాలుపోక రైలెక్కుతది. రైల్లో ముష్టి ఎత్తుకునే గుడ్డివాని సత్తు గిన్నెలో పావలా వేసి, చిల్లర తీసుకున్నట్లుగా రెండు రూపాయలు తీసుకుంటది. రైలు దిగి ఇడ్లీతో కడుపు నింపుకొని, తల్లికి పార్సిల్ తీసుకపోతున్న ఆమె భుజాన్ని చీకట్లో గుడ్డివాడు పట్టుకోగానే భయపడుతుంది. నీ ఆకలి తీరింది. మరి నా ఆకలి తీర్చుమని మీద పడగానే వాడు గుడ్డివాడు కాదనే విషయం తెలుస్తుంది. ఆమె చేతి నుండి కిందపడ్డ ఇడ్లీలను కుక్క తినడంతో పోల్చి కథను ముగిస్తడు. హృదయ విదారకమైన పరిస్థితుల వల్ల కథలో అనేక మలుపులు తారసపడుతవి. అవేవీ అసంభవాలుగా అనిపించవు. అంత పకడ్బందీగాపేర్చడం జరిగింది.

కుటుంబ కష్టాల వల్ల చదవలేని పిల్లవానికి చదువుపై ఆసక్తి ఎక్కువ. కళాశాలలో పనిచేసే లెక్చరర్ రచయిత కావడం వల్ల అతని రచనల్ని చదివి అభిమానం పెంచుకుంటడు. అది క్రమంగా గురు శిష్య సంబంధంగా మారుతది. జీవితంలోని అవసరాలు, పిల్లవానితో అనేక రకాల పనులు చేయిస్తవి. బాధ్యతలను నెత్తిన పెడతవి. ఈ క్రమాన్నంతా విసుగు పుట్టకుండా చెప్పడంలోనే కథకుని నైపుణ్యం దాగి ఉంది. రచయిత – పాఠకుడి మధ్య సంబంధం, గురు శిష్య సంబంధంగా అంతకుమించి ఒక మానవీయ సంబంధంగా మారడం ''పొగ మేడలు'' కథలో కనపడుతుంది. ''కథనాది ముగింపు ఆమెది'' కథలో శిల్పం శిఖరం అంతులు తాకింది. ఆ బలంతోనే కథ ఆకట్టుకుంటుంది. ఇదొక ప్రేమ కథ. ఎనభైలనాటి ప్రేమ నవలల్లోని వాతావరణం కథంతా పరచుకొని ఉంది. శీర్షిక,



కథను మెరిపించింది. ఉదాత్తులైన హీరో హీరోయిన్‌లు విడిపోవడం వల్ల పాఠకులకు తీయని బాధ మిగులుతుంది. ''హృదయం'' కథలోని మనసున్న మొరటు మనిషి నర్సింహులు. పార్వతి తండ్రి తాగుబోతు. పార్వతిని బలవంతంగా నర్సింహులుకు కట్టబెట్టడంతో తండ్రి స్వార్థం ఉంది. పరిస్థితుల ప్రాబల్యం, నర్సింహులు మీద అసహ్యంవల్ల పార్వతి, మాధవరావుకు లొంగుతుంది. ఇదంతా తెలిసి రాఘవులును చంపి నర్సింహులు జైలు కెలతడు. కథంతా భయ వాతావరణంలో సాగుతది. అందులో నుండి ఒక ప్రేమికుడిగా నర్సింహులు తలెత్తడంలో కథ ముగుస్తుంది.

'పెద్ద చేప, చిన్న చేపను మింగుతుంది. బలవంతుడు, బలహీనుణ్ణి దోపిడీ చేస్తడు' అనే విశ్వవ్యాపిత విషయాన్ని అద్భుతమైన కథనంతో ఆహార యాత్రగా అందించారు. అంతరార్థ కథనం ద్వారా చెప్పడం వల్ల కథ విడువకుండా చదివిస్తుంది. చీమల ఆహార యాత్రలో జరిగే సంఘటనలు, పోరాటం, సమస్యలు మనుషుల జీవితాల్లో కూడా జరుగుతవనే ధ్వని, కథనం ద్వారా అందడమేఈ కథ విజయ రహస్యం.

రాజ్యం చేస్తున్న ఎన్‌కౌంటర్స్‌ను కళ్లకు కట్టినట్లు ప్రతీకాత్మకంగా చూపిన కథ ''అరణ్యం'' పేరుకు తగినట్లే కథలోని వర్ణన ఉంది. 'పుణ్యానికిపోతే పాపం ఎదురైందన్నట్లు' అనే సామెతను గుర్తు తెచ్చే కథ ''పిట్టపోరు''. పిట్టపోరు పిట్టపోరు పిల్లితీర్చే అనే సామెతలోని పదాన్ని కథకు పేరు పెట్టడంలోనే కథా సారాంశం ఇమిడి ఉంది. నిత్య జీవన పోరాట పార్శ్వాల్ని పట్టించే ఇద్దరి స్త్రీల జగడం ఈ కథ. జారుడు మెట్టు, ఒయాసిస్, చదరంగంలో పావులు, నిప్పు– పొగ, నిర్ణయం , దేవుడి దిష్టి, గిట్ట మనసు, ఛాలెంజ్ కథల్లోని విషయం, ఆయా కథలకు ముడి సరుకైతే, దాన్ని అందమైన కథలుగా మార్చి పాఠకునికి అందించింది కథన నైపుణ్యం.

అయోధ్యా రెడ్డికి శిల్ప శ్రద్ధ అధికం. కథను చదివింపజేయడానికి ఆయన వద్ద అనేక ఉపకరణాలు ఉన్నవి. అందులో పోలికలు అధికం. ''పుట్టలోకి వెళ్లిన పాములా అతని ప్యాంటు జేబులోకి, చేయి వెళ్లింది''. ''పదమూడేళ్ల అమ్మాయి పైట లేయడం మొదలెట్టినట్లు, అతడు ఉద్యోగాలకు దరఖాస్తులు పంపటం, ఇంటర్వ్యూలకు వెళ్లటం మొదలుపెట్టాడు''. ''ఆకులు రాల్చిన రేగు పొదలా ఉంది తల'', ''బక్కెద్దులా కాళ్లీడుస్తూ నడవసాగాడు'' లాంటి పోలికల వల్ల విషయం సూటిగా తలకెక్కుతుంది. ''విశ్వమంతా నిండి వెలి బూదివోలె'' బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టు నన్ను'', ''చూడు చూడు నీడలు.. నీడలు పొగమేడలు'' లాంటి గీతాలు మనసుకు హత్తుకుంటాయి. భళ్లున పెళ్లయిపోయింది'' లాంటి వాక్యాలు విస్మయానికి గురి చేస్తాయి.

''ఎక్కడ్నుంచో ఊరకుక్క ఒకటి పరుగెత్తుకుంటూ వొచ్చి కిందపడిన ఇడ్లీలను కొల్లగొట్టసాగింది. ఎక్కడో ఆకాశం ఉరిమింది లచ్చిమి ఆర్తనాదాలను తనలో కలుపుకుంటూ'', ''తెల్ల బడ్డ ఒక వెంట్రుక కూడా రాలిపోకుండా ఉన్న తలకాయ నల్లటి స్తంభం మీద తెల్లటి ఫ్లోరసెంట్ బల్బులా ఉంది'' లాంటి వర్ణనలు కథ సాగడానికి దారులు పరిచాయి. ''కథ నాది ముగింపు ఆమెది'' శీర్షిక కథా సారాంశాన్ని పొదవుకుంటే, ''పిచ్చి కుక్క'' కథ ముగింపును పలికింది. ''జారుడు మెట్టు'' పేరు కథకు సామంజస్యాన్ని అద్దితే, ''చదరంగంలో పావులు'' కథకు వాస్తవికతను కూర్చింది. ''హృదయం'' సైకలాజికల్ టచ్ చేస్తే, ''దేవుడి దిష్టి'' సెంటిమెంటల్ టచ్ ఇచ్చింది.

''ఆ యాక్సిండెంట్‌లో మా ఇంటిల్లిపాదీ చీకటిని కావలించుకున్నారు'' లాంటి కవితాత్మ కలిగిన వాక్యాలు కథా సౌందర్యాన్ని ఇనుమడింప చేశాయి. పాఠకుడు ఊహించని మలుపులు దాదాపు కథలన్నిటిలో ఉన్నవి. నాటకీయత కథా వ్యాప్తమైంది. ఇవన్నీ కథల్లోంచి పుట్టుకొచ్చినట్లుగా ఉండడంవల్ల సినిమాటిక్‌గా అనిపించదు. చేయి తిరిగిన శిల్పి మహిమ అది. శీర్షిక మొదలు ముగింపు వరకు అంతా చీమల బారులా క్రమ శిక్షణగా కథలు సాగినయి. కథల్లో సామాజిక స్పృహ, అభ్యుదయ భావనలు చోటు చేసుకున్నట్లే, వ్యక్తి అరిషడ్వర్గాలు కూడా పాలు పంచుకున్నవి. దశాబ్దాల కిందటి కథలను కొత్తగా సంపుటి వేయడం ముదావహం. మలి దశ రచనలో వీరి కలం పరుగులు తీస్తుందని ఆశించవచ్చు.

ఓ మగువా!

ఓ మగువా నీ తెగువకు వందనం
అతివా నీ తెలివికి అభివందనం

ఉద్యోగం చేసేడప్పుడెంత మధన పడ్డావో
దినదిన గండంగా నువ్వెలా బ్రతుకు నీడ్చావో
అడుగడుగునా నువ్వు ఎంత అభద్రతకు గురైనావో
అనుక్షణం నువ్వు ఎంత నరకమనుభవించావో
వణుకుతున్న నీ స్వరమే – ఉబుకుతున్న కన్నీళ్లే
నీ బాధను చాటినాయి – నీ గాథను తెలిపినాయి

ఆధ్యాత్మిక ముసుగులోన అరాచకం చేసేటోళ్ల
సంస్కారం ముసుగులోన వికారాన్ని చూపేటోళ్ల
పదవి పేరు చెప్పుకొని ప్రజలను అణచేసేటోళ్ల
కళల పేరు చెప్పి మరీ కాంతల వంచించేటోళ్ల
గుండెల్లో గునపానివి – అపర భద్రకాళివి



మగవాడి నైచ్యానికి మహిళలు బలి కావద్దని
ప్రాణాలను బిగబట్టి పటుతర వ్యూహం రచించి
నువు చూపిన ఆరాటం – నువు చేసిన పోరాటం
అందరికీ ఎప్పటికీ మార్గదర్శకం
మరువదమ్మ నీ త్యాగం మహిళా లోకం

(ఓ గజల్ గాయకుడి ఆగడాలకు సాహసోపేతంగా అడ్డుకట్ట వేసిన మహిళను అభినందిస్తూ)

ఎ. గజేందర్ రెడ్డి, 9848894086

నేడే పత్తిపాక మోహన్‌కు పురస్కారం

మల్లవరపు జాను కవి పేరిట ప్రతి సంవత్సరం ''జానుడి సాహిత్య పురస్కారం' ఒక ప్రముఖ సాహితీ వేత్తకు ఇస్తున్నారు. ఈ సంవత్సరం బాల సాహిత్య రచన, వికాసానికి విశేషంగా కృషి చేస్తున్న పిల్లల్లో సృజనాత్మక రచనను మెరుగుపరిచేందుకు వృత్తి రీత్యా నేగాక ఇతర ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలతో కలిసి వివిధ కార్యశాలలు, కార్యక్రమాలను నిర్వహిస్తున్న డా॥ పత్తిపాక మోహన్‌కు ఈ రోజు ఒంగోలులో జరిగే జానుకవి జయంతి సభలో ఈ అవార్డు అందిస్తారు.

'జల గీతం' కావ్యానికి సాహితీ పురస్కారం

జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి లక్ష్మీ నారాయణ జైని జాతీయ సాహితీ పురస్కారం –2018ని తొలిసారిగా సుప్రసిద్ధ కవి, నానీల సృష్టికర్త, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డా॥. ఎన్.గోపీ రచించిన జలగీతం కావ్యానికి ఇస్తున్నారు. ఈ కార్యక్రమం జనవరి 29 సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరుగనుంది. ఈ పురస్కారానికి లక్ష రూపాయల నగదుతో కవికి సత్కారం వుంటుందని ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్ జైని, బిక్కి కృష్ణ తెలిపారు.

సహస్ర కవి సమ్మేళనం

అవని గడ్డలోని తెలుగులోగిలి స్వచ్ఛందసేవా సంస్థ పక్షాన ఫిబ్రవరి 25,26&27 –2018 మూడు రోజుల పాటు వెయ్యి మంది కవులతో "అంతర్జాతీయ సహస్ర కవి సమ్మేళనం" జరుపుతున్నారు. ప్రముఖ కవి బిక్కి కృష్ణ సారథ్యంలో నిర్వహించే ఈ సమ్మేళనంలో అనేక మంది వివిధ రంగాల ప్రముఖులు పాల్గొంటారు. పాల్గొనదలచిన కవులు తమ పేర్లను 5 ఫిబ్రవరి 2018 తేదిలోగా సెల్ నెం: 83329 03156లో నమోదు చేసుకోవాలి. వివరాలకు 9246415150, 8374439053 నెంబర్లను సంప్రదించవచ్చు.

సునారెకి "రంగినేని" సాహిత్య పురస్కారం

సుప్రసిద్ధ సాహితీ వేత్త, కవి సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన "తావు" కవితా సంపుటి "రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం–2017" కు ఎంపికైంది. ఫిబ్రవరి 2018 నెలలో సిరిసిల్ల యందు నిర్వహించబోయే రంగినేని చారిటబుల్ ట్రస్ట్ ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డు నారాయణ రెడ్డి కి ప్రదానం చేస్తున్నామని అవార్డు కమిటీ కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్, అధ్యక్షులు రంగినేని మోహన్‌రావులు తెలిపారు.

మన తెలంగాణ
5
హైదరాబాద్
సోమవారం
22 జనవరి, 2018
www.manatelangana.news



ఇప్పుడు విజయం పేరు మహిళ. వివిధ రంగాలలో దూసుకుపోతూ అరుదైన శిఖరాలను అధిరోహిస్తోంది. రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి ఎప్పడూ సంసిద్ధంగా ఉంది. క్రీడా, వైద్య, ఆరోగ్య, రక్షణ, విమానయాన, పరిశ్రమ,సినీ అనేక రంగాల్లో విజయం సాధించిన 112 మంది మహిళలను కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ 'ఫస్ట్‌లేడి' అవార్డులతో సత్కరించింది. వీరంతా మిగతా మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా ఒలింపిక్ పతకం గెలిచిన మొదటి భారత వెయిట్ లిఫ్టర్ కరణం మల్లేశ్వరి, ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో తొలి మహిళా డ్రైవర్‌గా ఎంపికైన తెలంగాణకు చెందిన సరిత, బ్రిటీష్ పార్లమెంటు ద్వారా హౌస్ ఆఫ్ కామర్స్ గౌరవాన్ని పొందిన తొలి భారతీయ గాయకురాలు కె.ఎస్. చిత్ర, హైదరాబాద్‌కు చెందిన తొలి మహిళా మ్యూజిక్ టెక్నీషియన్ సాజిదాఖాన్‌లు తమ మనోభావాలను మనతెలంగాణ ముందుపరిచారు..

ప్రత్యేక గౌరవం పొందిన ఫస్ట్‌లేడి

మహిళా సాధికారతను పెంచాలి

గాయని చిత్ర



అన్నిరంగాలలో మహిళా సాధికారతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులు ఇవ్వడం చాలా గొప్ప విషయం. అవార్డు రావడం ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు చాలా సినిమాల్లో చాలా పాటలు పాడాను. క్లాసికల్ ఆల్బమ్స్ చేశాను. ఈ రంగంలో ఇంకా ఏదో చేయాలన్న తపన ఉంది. నేడు మహిళలు అన్ని రంగాలలో ముందుకు వస్తున్నారు. వారికి అభినందనలు. ఒక కుటుంబంలో మహిళ ఉద్యోగం సాధించి ఆర్థికంగా బలపడినప్పుడే ఆ కుటుంబానికి ఆర్థిక భద్రత ఏర్పడుతుంది..

మన సమాజంలో పాఠశాల స్థాయి నుండి పిల్లలలో సోదరభావాన్ని, ఒకరికి ఒకరు గౌరవ, మర్యాదలను ఇచ్చి పుచ్చుకొనే ధోరణిని మళ్లీ నేటి స్థాయి యువతకు బోధించాలి. పిల్లలు పాఠశాల స్థాయి నుండే మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారు, వారు ఆ బారిని పడకుండా జాగ్రత్తగా కాపాడాలి. అటువైపు మళ్లకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలి. చాలా వరకు మద్యపానం, డ్రగ్స్ వాడకం వల్లనే మహిళలపై దాడులు జరుగుతున్నాయి. మహిళా సాధికారతను పెంచే ప్రయత్నాలు కొనసాగాలని కోరుకుంటున్నాను. గల్ఫ్ దేశాలలో భాగంగా అందరికి చట్టం అంటే భయం ఉండాలి, చట్టాలు కూడా ఆ దిశగా చేయాలి. తప్పు చేసిన వ్యక్తి చట్టం ద్వారా కఠినంగా శిక్షించబడతామనే భావన కలిగినప్పుడే మహిళలపై దాడులు చేసేందుకు భయపడతాడు. మహిళల పట్ల గౌరవ భావన, దృక్పథం మారే విషయంలో స్కూలు స్థాయి నుండే వారికి ఆ దిశగా బోధన, శిక్షణ సాగాలి.

అవార్డు నాకు అరుదైన గౌరవం

తొలి అంధ ఐఎఫ్ఎస్ అధికారిణి బేణి



అవార్డు అందుకోవడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నాను. భవిష్యత్తులో సామాజిక రంగంలో అత్యుత్తమ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాను. దానికి కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాను. నేను పదోతరగతిలో ఉన్నప్పుడు అంధ విద్యార్థులను గౌరవించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోరాను. నా అభ్యర్థనను మన్నించిన ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. ఆ ఘటన తరువాత నాలో ఒక ఫైర్, సామర్థ్యం ఉన్నదని గమనించాను. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరగడం వల్ల సివిల్స్ కి ప్రిపేర్ అవ్వాలని నిర్ణయించుకున్నాను. తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో 2013 సివిల్ సర్వీస్ ఎగ్జామ్ లో 343 ర్యాంకు సాధించాను. మా నాన్న నా చిన్నప్పటి నుండి ఎటువంటి అపజయం ఎదురయినా నన్ను కృంగిపోకుండా ధైర్యం చెప్పి వెన్నుతట్టి ప్రోత్సహించారు. మేము హైదరాబాద్‌కు చెందిన తెలుగువారమే. మా నాన్న వృత్తి రీత్యా చెన్నై వెళ్లి స్థిరపడాల్సి వచ్చింది. తమిళంతో పాటు అంతే స్థాయిలో తెలుగును కూడా మాట్లాడగలను. మహిళలైనా, యువత అయినా తమలో ఉన్న బలహీనతలను పెద్దవిగా చేసి, వాటి గురించి ఆలోచించకుండా దాన్ని మన బలంగా మార్చుకొని ముందుకు సాగిపోవాలి. ప్రతి మనిషిలో కూడా ఏదో ప్రత్యేకత, సామర్థ్యం దాగి ఉంటాయి. వాటిని బయటకు తీసినప్పుడే ప్రతి మనిషి జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగగలుగుతాడు. మనం విజయం దిశగా సాగిపోవడానికి కావాల్సిన మార్గాన్ని మనమే అన్వేషించుకోవాలి. అందుబాటులో ఉన్న పుస్తకాలను చదవడం ద్వారా ఎప్పుటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి. మనం ఏ ప్రాంతం నుండి వచ్చినా, ఏ భాష నుండి వచ్చినా దేశాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి. అప్పుడే మనం మన కుటుంబ సభ్యులను ప్రేమిసాం.

సొంత రాష్ట్రానికి రావాలనుంది

సరిత, తొలి బస్‌డ్రైవర్

బస్ డ్రైవర్ కంటే ముందు ట్యాక్సీ నడిపాను. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో డ్రైవర్లుగా మహిళలను కూడా తీసుకోవాలి అనుకున్నప్పుడు నాతో పాటు 10 మంది దరఖాస్తు చేశారు. కాని నేనొక్కదాన్ని మాత్రమే సెలెక్ట్ అయ్యాను. అప్పుడు చాలా గర్వంగా ఫీలయ్యాను. ఇప్పుడు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రులు తెలంగాణలో ఉంటారు, వారు అనారోగ్యంతో బాధపడుతున్నారు. తల్లిదండ్రులను విడిచిపెట్టి నేనిక్కడ ఉండడం ఇబ్బందిగా ఉంది.అలాగని వాళ్లను ఇక్కడికి తీసుకొచ్చి ఉంచే పరిస్థితి లేదు. అందుకే నేను నా సొంత రాష్ట్రంలో పనిచేయాలనుకున్నాను. అక్కడ డ్రైవర్‌గా పనిచేయడానికి కావాల్సిన అర్హతలన్నీ నాకున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే రవాణాశాఖ మంత్రి మహేందర్ రెడ్డిని, ఎంపీ కవితను కలిశాను. నాకు తెలంగాణ ఆర్టీసీలో అవకాశం ఇప్పించాల్సిందిగా కోరాను. పరిశీలిస్తామని హామీ ఇచ్చారు తప్ప ఇప్పటి వరకు ఆచరణలో కార్యరూపం దాల్చలేదు.



ఇప్పటికైనా నా బాధను సహృదయంతో అర్థం చేసుకుని నా తెలంగాణలో అవకాశం ఇప్పించడం ద్వారా ఆదుకుంటారని ఆశిస్తున్నాను. మహిళలకు పెద్దపీట అంటున్న మన ప్రభుత్వం నాకు అవకాశం కల్పిస్తుందని భావిస్తున్నాను.

నిబంధనలు అడ్డుకాలేదు

సాజిదాఖాన్, తొలి సౌండ్ ఇంజనీర్



నాకు తల్లిదండ్రులు, సమాజం నుంచి చాలా ప్రోత్సాహం అందింది. ఒకప్పుడు మతపరమైన నిబంధనలతో మహిళలు బయటకు వచ్చేవారు కాదు. ఇప్పుడు రోజులు, పరిస్థితులు మారాయి. మహిళలు బయటికొచ్చి వివిధ రంగాల్లో సత్తా చాటుతున్నారు.ఈ రంగంలో ఒక్కోసారి రాత్రిళ్లు కూడా పనిచేయాల్సి వస్తోంది. కానీ ఇలాంటివి అన్ని రంగాల్లోనూ ఉంటాయి. స్వశక్తి మీద నమ్మకంతో అడుగు ముందుకేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించగలం. కష్టాలు, ఇబ్బందులు అందరికీ వస్తాయి. ధైర్యంగా నిలబడినప్పుడే విజయం వరిస్తుంది.

స్ఫూర్తినివ్వడమూ స్ఫూర్తే

కరణం మల్లేశ్వరి, తొలి వెయిట్‌లిఫ్టర్



ఎంచు కున్నప్పుడు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. ఎవరో ఒకరు దారి వేస్తే ఆ దారిలో ఇంకో వంద మంది నడుస్తారు. వెయిట్ లిఫ్టింగ్ లో మహిళలు ఏం రాణిస్తారు అనుకున్న సమయంలో నేను ప్రవేశించాను. నేను సాధించిన విజయాలతో అనేక మంది స్ఫూర్తి పొందారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇప్పటికీ మహిళలు చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం సాహసంతో కూడిన పనే. అయినా మహిళలు ఇప్పుడు ఎన్నో రంగాల్లో ముందుకు వెళ్తున్నారు.

కొమ్మాలపాటి సాయిసుధ
మన తెలంగాణ కరస్పాండెంట్– ఢిల్లీ



కొత్త జీవితం నిర్మించుకోండి..

ప్రస్తుతం మీరు నిద్రలేస్తున్న సమయం కంటే ఒక గంట ముందుగా నిద్రలేవండి. ఇప్పుడు 6 గంటలకు నిద్రలేస్తుంటే మీ ఛాలెంజ్ మొదటిరోజు నుంచి 5 గంటలకే నిద్రలేవండి. ఇది ఓ మంచి గుడ్‌న్యూస్ ఇస్తుంది. అది ఏమిటంటే రోజుకి ఓ గంట, వారానికి 7 గంటలు, అంటే వారానికి దాదాపు మరో ఒక రోజు మీకు వచ్చినట్లే.

కాలకృత్యాలు ముగించుకుని 30 నిమిషాలు శారీరక వ్యాయమం చేయండి. ఆ వ్యాయామం ఏవరైనా శిక్షకులు చెప్పినదైనా లేక వాకింగ్ జాగింగ్, వార్మ్‌అప్స్ చేయడం జిమ్, షటిల్ ఆడటం, మీకు నచ్చినది ఏదైనా కావచ్చు. వ్యాయమం గురించి ఓ సామెత ఉంది. వ్యాయామానికి సమయం ఉంచలేకపోతే, రోగానికి సమయాన్ని కేటాయించాల్సి వస్తుంది. అందుకే వ్యాయామానికి, కొంత సమయం కేటాయించండి.

రోజు శారీరక వ్యాయామం తర్వాత కనీసం 15 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకుని మెడిటేషన్ చేయండి. ఇవి శరీరాన్ని, మనుస్సుని ప్రశాంతపరిచి, రీచార్జ్ చేసి, శక్తివంతమైన శరీరాన్ని మనస్సుని తయారుచేసే ప్రాక్టికల్ పవర్‌ఫుల్ టెక్నిక్స్. 5000 వేల సంవత్సరాల కంటే ముందు ఈ భారత భూమిపై ఆవిర్భవించిన ధ్యానం, యోగా, ప్రాణామాయ, ఆయుర్వేదం మనిషిని ప్రకృతి సిద్ధంగా ఉన్నతంగా మలచగల అత్యున్నత శక్తివంతమైన ప్రక్రియలు వాటిని పాటించండి.

ఛాలెంజ్ ప్రిపరేషన్ రోజు మీరు చేసిన పాజిటివ్ విజువలైజేషన్ ఎక్సర్‌సైజ్‌లు ప్రతి రోజు మీ శక్తివంతమైన లక్ష్యాలు సాధించినట్లుగా ఊహించుకొని చేయండి. మీ లక్ష్యాన్ని సాధించినప్పుడు మీ ఫీలింగ్స్ ప్రతిరోజు ఫీలవ్వండి. మైండ్ ప్రోగ్రామింగ్ మీ ఎక్స్‌లెన్స్‌ని నిజంగా సృష్టిస్తుంది.

రాత్రి నిద్రపోయే ముందు పాటించవలసిన పాజిటివ్, **పవర్‌ఫుల్ ఆఫిర్‌మేషన్స్–ఎక్స్‌లెన్స్ సూత్రాలు**: ఈ కింది వాక్యాలను బిగ్గరగా ప్రతి రోజు ఉదయం చదవండి. మనస్సులో కూడా రెండు సార్లు చదవండి.

మీరు మీ జీవితాన్ని ఉన్నతంగా ,శక్తివంతంగా, ఆనందంగా నిర్మించుకోండి. ప్రత్యేకమైన జీవితాన్ని మీరు మాత్రమే చేయగల ప్రత్యేకమైన ఉన్నత పనులు నెరవేర్చడం కోసం ఆలోచించండి. జీవితంలోని ముఖ్యమైన ఒక సంవత్సరం శక్తివంతమైన లక్ష్యాలను నిర్ణయించుకుని ఆనందంగా, అవి సాధించటానికి పనిచేయండి. ఆరోగ్యవంతమైన ఆహారపు, నిద్రా సమయం, పనివేళల అలవాట్లు పాటించాలి. మానసిక స్థితులను, భావోద్వేగాలను ఉన్నతంగా మలుచుకుంటూ ఆహ్లాదమైన మానసిక ఆరోగ్యంతో ప్రేమపూర్వంగా, పాజిటివ్‌గా ఇతరులతో మెలగాలి. మీ కుటుంబ సభ్యులతో బంధువులు, స్నేహితులతో, టీమ్‌మెంబర్స్, ఆఫీస్‌లోని వ్యక్తులతో, అర్థవంతమైన ఉన్నతమైన సంబంధాలు మానవీయ అనుబంధాలు నిర్మించుకోవాలి. నేటి సమాజంలోని ప్రతి వ్యక్తితో, ప్రకృతితో గౌరవంతోను, ప్రేమతోను వ్యవహరించండి. ఆధ్యాత్మిక భావాలను ఉన్నతంగా మలుచుకుంటూ ఈ సృష్టి ప్రసాదించిన ఈ మానవ జన్మను చైతన్యవంతంగా , బాధ్యతాయుతంగా మార్చుకోవాలి. మీ అందమైన ప్రపంచంలో మీ గతం తాలుకు మంచి జ్ఞాపకాలతో వర్తమానాల్ని సద్వినియోగపరుచుకుంటూ ఉన్నతమైన భవిష్యత్తును సృష్టించుకోవడానికి కృషి చేస్తూ ప్రతి క్షణం ఆనందంగా, ఉత్సాహంగా, శక్తివంతంగా జీవించాలి. మీ జీవితంలో జరిగిన, జరుగుతున్న, జరగబోయే అన్ని అనుభవాలను, అంశాలను మీరు నూరు(100%) శాతం బాధ్యతలను వహిస్తున్నారై ఉండాలి. మీమల్ని మీరు ఉన్నతంగా, విలువైన వ్యక్తిగా నిర్మించుకోవాలి. మీ శక్తివంతమైన లక్ష్యాలు సాధించే దిశలో నిర్వర్తించాల్సిన ఏవైనా నాలుగు ముఖ్యమైన పనులు ప్రతిరోజు చెయ్యండి. వాటిని మీమీ రోజువారి కార్యక్రమంలో ముందురోజే రాసుకోండి.

ఉదా: గంట పుస్తకాన్ని చదవటం... 2 గంటలు ప్రాక్టీస్ చేయటం, రోజువారిలో పనికివెళ్లే ముందు లేదా బ్రేక్‌టైమ్‌లో లేదా సాయంత్రం సమయంలో వ్యక్తిత్వ, పత్రికలు, పుస్తకాలు చదవండి. కచ్చితంగా 30 నిమిషాలు చేయండి. చదవడం కంటే వినటం ఇష్టమైతే ఆడియో ప్రోగ్రామ్స్ లేదా వీడియో ప్రోగ్రామ్స్ చూడండి. శారీరక ఆరోగ్యానికి మంచి ఆహారాన్ని అందించినట్లు, మానసిక ఆరోగ్యానికి ఉన్నతమైన ఆలోచనా విధానాలు, మిమ్మల్ని ఇన్‌స్పైర్ చేసే అంశాలు అందించండి. రోజు మొత్తంలో ప్రత్యేకంగా కానీ , ఫోన్‌లో గానీ, ఇంటర్‌నెట్ కమ్యూనికేషన్ ద్వారా కానీ మీ లక్ష్యాల గురించి చర్చించి, రివ్యూ చేసుకోండి. ఆ విషయంలో మీకు గైడెన్స్ ఇవ్వగల గ్రూప్‌లో, క్లబ్‌లో మెంబర్‌షిప్ తీసుకోండి. ఇలా చేయటం వల్ల మీరు అనుకున్నది సాధించడానికి వీలుంటుంది.



చరిత్ర సృష్టించిన ఆంచల్

స్కియింగ్‌లో అంతర్జాతీయ పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా హిమాచల్ ప్రదేశ్ , మనాలీకి చెందిన ఆంచల్ ఠాకూర్ చరిత్ర సృష్టించింది. టర్కీలో నిర్వహించిన ఎజ్డెర్ 3200 కప్‌లో ఆంచల్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. నెలలపాటు తాను పడిన కష్టానికి ప్రతిఫలం దక్కిందని ఆంచల్ ఆనందం వ్యక్తం చేస్తోంది. ఆమె తండ్రి రోషన్ ఠాకూర్ వింటర్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్‌గా పని చేస్తున్నారు. అంతర్జాతీయ స్కియింగ్ పోటీల్లో ఆంచల్ పాల్గొనడం కోసం అవసరమైన మొత్తాన్ని ఆమె తండ్రే భరించారు. 2012 ఆస్ట్రేలియాలో జరిగిన వింటర్ యూత్ ఒలంపిక్స్‌లో భారతదేశం నుండి ఆంచల్ ఠాకూర్ పాల్గొన్న భారతీయ మహిళగా పేరు తెచ్చుకున్నారు.

మన తెలంగాణ

6 హైదరాబాద్ సోమవారం 22, జనవరి 2018

www.manatelangana.news

'ఆమె' సమ్మతి లేకుండా ముట్టుకోరాదు : ఢిల్లీ సెషన్స్ కోర్టు

న్యూఢిల్లీ : మహిళను ఆమె సమ్మతి లేకుండా తాకరాదని ఢిల్లీ సెషన్స్ కోర్టు స్పష్టం చేసింది. మహిళ శరీరం ఆమె సొంతమని, దానిపై ఆమెకు మాత్రమే అధికారం ఉంటుందని తెలిపింది. ఆమె సమ్మతి లేకుండా ఆమె శరీరాన్ని ఇతరులు ఏ ఉద్దేశంతోనైనా ముట్టుకోవడం నిషిద్ధమని పేర్కొంది. తొమ్మిదేళ్ళ బాలికపై లైంగిక దాడి కేసులో న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన చవి రామ్ అనే వ్యక్తికి ఐదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ అదనపు సెషన్స్ జడ్జి సీమా మైని తీర్పు చెప్పారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రామ్ ఉత్తర ఢిల్లీలోని ముఖర్జీ నగర్‌లో ఈ బాలికను అసభ్యకరంగా ముట్టుకున్నాడని కేసు దాఖలైంది. 2014లో రద్దీగా ఉన్న మార్కెట్‌లో ఈ సంఘటన జరిగినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. జస్టిస్ సీమా తీర్పు చెబుతూ మహిళ శరీరంపై ఆమెకే పూర్తి అధికారం ఉంటుందని తెలిపారు. రామ్‌కు ఐదేళ్ళ జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారు. దీనిలో రూ.5000 బాధితురాలికి ఇవ్వాలని తీర్పు చెప్పారు. అంతేకాకుండా బాధితురాలికి రూ.50 వేలు చెల్లించాలని ఢిల్లీ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థను ఆదేశించారు.



కాంగ్రెస్‌పై మండిపడ్డ హరీశ్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర భారీనీటి పారుదల శాఖ మంత్రి టీ. హరీష్ రావు మండిపడుతూ ఘాటుగా స్పందించారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం గోదావరి పరివాహక ప్రాంతాల్లో నిర్మిస్తున్న అన్నారం బ్యారేజీకి సంబందించిన గ్రావిట్ కెనాల్ పనులు మొదటి దశనుండి చివరి వరకు కెనాల్ వెంటే వెళ్లుతూ క్షణ్ణంగా పరిశీలించి పనుల వివరాలను ,పురోగతిని అడిగి తెలుసుకుంటూ సూచనలు సలహాలు ఇస్తూ కాళేశ్వరం పంప్‌హౌజ్ వరకు పనులను పరిశీలించారు. తెలంగాణ ప్రజలను ,రైతులను దృష్టిలో పెట్టుకొని సాగు,త్రాగునీరుకు ఇబ్బందులు తలెత్తకుండా సస్యశ్యామలంగా మార్చాలనే సంకల్పంతో కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న ప్రాజెక్టులను మంత్రి హరిష్ రావు పనుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ త్వరగతిన పూర్తైయ్యేలా ప్రాజెక్టుల వద్దనే ఉంటూ వేగంగా పనులు జరిగేలా చూస్తూన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల ప్రాంతంలో హారిష్ రావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో ప్రాజెక్టులను నిర్మించకుండా ప్రజాదనాన్ని దుర్వినియోగం చేస్తూ లూటీ చేశారని విమర్శించారు. ప్రభుత్వ నిభందన ప్రకారం డిజన్ల ఆధారంగా ఒక్కరూపాయాయి వృధా కాకుండా పనులు సక్రమంగా నడుస్తావుంటే,పనులను పరిశీలించిన సీడబ్యూసీ ,ఉన్నతస్థాయి అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ కేసిఆర్ ప్రభుత్వాన్ని పొగిడితే జీర్జించుకోలేని కాంగ్రెసోళ్లు విమర్శలు చేస్తా వున్నారని వారికి మంచి చూడడం కానీ...వినడం కానీ ఉండదని తెలిపారు. కర్ణాటక మంత్రి రేవంతన్న గొర్రెల పథకంపై,శాసనసభా పక్షనేత జాన రెడ్డి ఐదు రూపాయలకు భోజనం లాంటి పథకాలపై సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వాన్ని అభినందిస్తే వారిపై హైకమెండ్‌కు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ ప్రతిష్టత్మకంగా నిర్మిస్తున్న ప్రాజెక్టుతో ఈ ప్రాంత రైతాంగం,పంటలు సస్యశ్యామలంగా మారనున్నాయని,5జిల్లాల ప్రజలకు త్రాగునీరుకు ఏలాంటి ఇబ్బందులు ఉండవని పారిశ్రామిక అవసరాల సైతం ఉపయోగపడుతాయన్నారు. గోదావరి నుండి ఇసుక తరలింపుతో నీటిమట్టం పెరిగి మత్సకారులకు ఉపాధి కలుగుతుందని విద్యుత్ కు సైతం ఇబ్బంది ఉండదని మంత్రి హరిష్ రావు వెల్లడించారు. ఆయన వెంట మంథిని ఏమ్మేల్యే పుట్ట మధు,అధికారులు ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

సాగు విద్యుత్‌కు మీటర్లు?

(మొదటిపేజీ తరువాయి)

ఉండేలా ఓ నిర్ణయం తీసుకోవాలన్నది అధికారుల అభిప్రాయం. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరగడం, అంతే వేగంగా తగ్గడంతో జాతీయ గ్రిడ్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వడం మొదలైనప్పటి నుంచి గ్రిడ్ నిర్వహణపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, ఇతర రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో ఈ నిర్ణయంపై ప్రశంసలు రావడంతో అమలు చేయడం మినహా గత్యంతరం లేని పరిస్థితి. ప్రభుత్వం కూడా రైతుల నుంచే 24 గంటలు వద్దు అని డిమాండ్లు వస్తుండడంతో ఏం చేయాలో ప్రభుత్వానికి తోచడం లేదు. సగం మంది రైతులు మాత్రమే ఆటోమేటిక్ స్టార్టర్లను తీసేశారు. ప్రీపెయిడ్ మీటర్లు ఇస్తే తమ కోటాలో ఉన్న విద్యుత్‌ను రైతులు జాగ్రత్తగా వినియోగించే అవకాశం ఉందని అధికారుల భావన. అవసరం ఉన్నప్పుడే మాత్రమే బోర్లు ఆన్ చేసి, అవసరం లేనప్పుడు బంద్ చేస్తారని, దీంతో విద్యుత్ పొదుపుతో పాటు భూగర్భ జలమట్టం కూడా దుర్వినియోగం కాకుండా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ కనెక్షన్ల నీటిని వ్యవసాయేతర అవసరాలకు మళ్లిస్తున్నారని విద్యుత్ అధికారుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోడానికి ప్రీపెయిడ్ మీటర్ల బిగింపు చక్కని పరిష్కారమవుతుందని అభిప్రాయపడుతున్నారు. అయితే ముఖ్యమంత్రి ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

43 మంది మృతి



(మొదటిపేజీ తరువాయి)

హోటల్ పైకప్పు మీదకు చేరుకొని ఉగ్రవాదులతో భీకర పోరాటం జరిపాయని అంతర్గత మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి నర్సత్ రహిమి తెలిపారు. హోటల్లోకి ప్రవేశించిన ముష్కరుల వద్ద చిన్నచిన్న తుపాకులు, రాకెట్ ప్రొపెల్ గ్రెనేడ్స్ ఉన్నాయని రహిమి తెలిపారు. గాయపడ్డ వారిని ఆస్పత్రులకు తరలించామని, చాలా మంది అతిథులను రక్షించామని పేర్కొన్నారు. ఉగ్రవాదులు వంటగది నుంచి హోటల్‌లోకి ప్రవేశించారని అనుమానిస్తున్నారు. ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌పై 2011లో తాలిబన్లు దాడి చేశారు. ఆదివారం జరగనున్న సమాచార సాంకేతిక సదస్సు కోసం కొందరు విదేశీయులు ఈ హోటల్‌లో బస చేసేందుకు వచ్చారు. హోటల్ మొదటి అంతస్తులోంచి తుపాకులతో కాల్పులు జరుగుతున్న శబ్దాలు వచ్చాయని ఒకరు తెలిపారు. ఉగ్రదాడికి భయపడుతూ చాలామంది హోటల్‌లోని గదుల్లో తల దాచుకున్నారు. రాత్రి భోజనం కోసం అందరూ ఒక చోటికి చేరుకుంటుండగా ముష్కరులు కొందరిని బందీలుగా చేసుకున్నారు. ఈ దృశ్యం చూసిన మరికొందరు వెంటనే తమ గదుల్లోకి చేరుకొని భయంతో తలుపులు వేసుకున్నారు. మరోవైపు మృతుల సంఖ్య ఎక్కువగానే ఉంటుందని బాధితులు చెబుతున్నారు. ప్రభుత్వం మృతుల సంఖ్యను తక్కువగా చెబుతోందని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు తెలిపాడు. హోటల్‌పై దాడికి తామే బాధ్యులమంటూ తాలిబన్లు ప్రకటించుకున్నారు. 12 గంటల పాటు భద్రతా బలగాలు పోరాడి హోటల్‌లోకి చొరబడిన నలుగురు ముష్కరులను హతమార్చారు. హోటల్‌లో బందీలుగా ఉన్న 150 మందిని భద్రతా బలగాలు సురక్షితంగా కాపాడాయి. వారిలో 41 మంది విదేశీయులు కూడా ఉన్నారు.

బెడ్ షీట్‌ల సాయంతో దూకి... బాంబు దాడితో హోటల్‌లోని పై అంతస్థులో మంటలు ఎగిసిపడుతుండగా పక్క పోర్షన్ నుంచి కొందరు తప్పించుకునే ప్రయత్నం చేశారు. బెడ్ షీట్‌ల సాయంతో బాల్కనీ నుంచి దూకేందుకు యత్నించారు. ఈ ప్రయత్నంలో ఓ వ్యక్తి కింద పడిపోగా మరొకరిని కింది ఫ్లోర్‌లో ఉన్న వ్యక్తి కాపాడాడు. దూరం నుంచి ఓ వ్యక్తి ఈ ఘటనను వీడియో తీసి మీడియాకు అందించాడు. గ్రెనేడ్‌లతో తుపాకులతో దూసుకొచ్చిన ఉగ్రవాదులు కాల్చుకుంటూ పోయారని, తాము మాత్రం ఎలాగోలా ప్రాణాలు కాపాడుకున్నామని తప్పించుకున్న అఫ్‌రుద్దీన్ తెలిపాడు. తన స్నేహితుడు కిందపడి గాయాలైనట్లు అతను వివరించాడు.

రోడ్డు పక్కన పేలుడు : 12మంది మృతి

ముష్కరుల వరుస దాడులతో ఆఫ్ఘనిస్తాన్ ప్రజలు వణికిపోతున్నారు. ఏ క్షణం ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. తాజాగా కాబుల్‌లోని పశ్చిమ హెరత్ ప్రావిన్స్‌లో రోడ్డు పక్కన భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 12 మంది మృతి చెందారు. చాలామంది గాయాలపాలైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. అయితే ఈ దాడికి తామే బాధ్యులమని ఏ ఉగ్ర సంస్థ ప్రకటించనప్పటికీ బాంబు పేలుడు ఘటన తాలిబన్ల పనేనని స్థానిక పోలీసు అధికారి అబ్దుల్ అహద్ అనుమానం వ్యక్తం చేశారు.

ప్రచార లోపం... లబ్ధిదారులకు శాపం

నీరుగారుతున్న సామాజిక భద్రత బీమా పథకం లక్ష్యం

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ''సామాజిక భద్రత ప్రమాద బీమా పథకం'' గురించి తగిన ప్రచారం, శ్రద్ధ కనబరచకపోవడం, బీమా సంస్థల కొర్రీలతో పథకం లక్ష్యం నీరుగారుతోంది. ఈ పథకం అమలు కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్న ప్రభుత్వం ఆ స్థాయిలో పథకం గురించి ప్రచారం చేయకపోవడంతో బాధితులకు ఆశించిన లబ్ధి జరగడం లేదు. కోట్లాది రూపాయల ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వం పర్యవేక్షణ లోపించడంతో బీమా సంస్థ ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నాయని ఆరోపణలున్నాయి. ఈ పథకం కింద దాదాపు 5.5 లక్షల మంది సభ్యులకు ప్రభుత్వం ప్రిమియం చెల్లిస్తుండగా గత రెండున్నరేళ్లలో కేవలం 137 మంది మాత్రమే లబ్ధి పొందడం ఈ పథకం అమలు అమలు తీరును తెలియజేస్తుంది. రోడ్డు, అగ్ని ప్రమాదాలు, జంతువుల కాటు, పిడుగుపాటు తదితర రకాల ప్రమాదాల కారణంగా మరణించే వ్యక్తుల కుటుంబాలకు ప్రభుత్వం సామాజిక భద్రత పథకం కింద రూ.5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని 2015 ఆగస్టు నుంచి అమలు చేస్తున్నది. రవాణ రంగంలో ఉపాధి పొందుతున్న సుమారు 5.10 లక్షల మంది డ్రైవర్లు, పోలీసు శాఖలోని సుమారు 22 వేల మంది హోంగార్డులు, మీడియా రంగంలోని సుమారు 11 మంది జర్నలిస్టులు మొత్తం 5.5 లక్షల మందికి పథకాన్ని వర్తింపచేస్తోంది. దీనికి సంబంధించిన బీమా ప్రీమియం ఏటా దాదాపు రూ.5.5 కోట్లను ప్రభుత్వమే చెల్లిస్తున్నది. అయితే ఈ పథకం ద్వారా లబ్ధి పొందేకుందుకు ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి, ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అందుకు కావాల్సిన ధృవీకరణ పత్రాలేమిటి అంశాలపై తగిన ప్రచారం, అవగాహన కార్యక్రమాలు జరగడం లేదు. ఫలితంగా ప్రమాదాలలో మరణించిన వారి బాధిత కుటుంబాలకు నష్టం జరిగిన అనంతరం ఆ నోటా ఈ నోటా ఈ పథకం గురించి తెలిసే సరికి బీమా సొమ్ము కోసం దరఖాస్తు చేసుకునే గడువు కాస్తా ముగిసిపోతున్నది.

బీమా సంస్థల కొర్రీలు

ప్రమాదాలలో మృత్యువాత పడిన కుటుంబాలకు 'ఆసరా'గా ఉండేందుకు ఒక వైపు సర్కార్ చర్యలు చేపడుతుంటే బీమా సంస్థలు బాధిత కుటుంబాలకు ఆర్థిక 'ఆసరా'ను మాత్రం అందించలేకపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. లబ్ధిదారులకు బీమా సొమ్మును ఎగవేసేందుకు బీమా సంస్థలు ధృవపత్రాల పేరుతో అనేక కొర్రీలు పెడుతుండడంతో బాధిత కుటుంబాలు సర్టిఫికెట్ల కోసం రకరకాల కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతన్నది. తమ కుటుంబ యజమానిని కోల్పోయిన దుఃఖంలో తాముంటే బీమా సంస్థలు తమను సర్టిఫికెట్ల పేరుతో ముప్పు తిప్పలు పెడుతున్నారని పలువురు బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇక రాష్ట్రానికి చెందిన డ్రైవర్లు పొరపాటున ఇతర రాష్ట్రాలలో జరిగే ప్రమాదాలలో మరణిస్తే వారి కుటుంబ సభ్యులు బీమాను పొందేందుకు పడే కష్టాలు అంతా ఇంతా కావంటున్నారు. ఒక వేళ అన్ని సర్టిఫికేట్లు సమర్పించినప్పటికీ ఇన్స్యూరెన్స్ ఏజెంట్లకు ముడుపులు సమర్పించుకోక తప్పడం లేదని వారు వాపోతున్నారు. పథకం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్యే తక్కువగా ఉండగా వచ్చిన దరఖాస్తులను కూడా వివిద ధృవీకరణ పత్రాల పేరుతో బీమా సంస్థలు తిరస్కరిస్తున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు. గత రెండేళ్ళ కాలంలో రోడ్డు, ఇతర ప్రమాదాలలో వందల సంఖ్యలో ఈ మూడు రంగాలలోని డ్రైవర్లు, ప్రజలు మరణించినప్పటికీ ఒక్కో రంగంలో పట్టుమని ముప్పై మంది బాధిత కుటుంబ సభ్యులకు కూడా బీమా సంస్థ నుంచి రూ.5 లక్షల బీమా చెల్లింపు జరగలేదంటే ఈ పథకం అమలు పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతున్నది.



గడువు పెంపు, బీమా సంస్థ మార్పు

''సామాజిక భద్రత ప్రమాద బీమా పథకం సభ్యుల కుటుంబాలకు ఆదుకునేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నాం. ఈ పథకం గురించి పెద్దఎత్తున పలు రకాలుగా ప్రచారం చేయాలని, ప్రతి మండల కేంద్రంలో దీని గురించి తెలియజేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం అమలు బాధ్యతను కొత్త బీమా సంస్థకు అప్పగించాం. బాధిత కుటుంబాల దరఖాస్తులు తిరస్కరణకు గురికాకుండా తమ వైపు నుంచి చర్యలు చేపడుతున్నాం. శోకతప్తహృదయంతో ఉండే బాధిత కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడకుండా బీమా సొమ్ము కోసం దరఖాస్తు చేసుకునే గడువును నెల రోజుల నుంచి6 నెలలకు పెంచాం'' అనిరాష్ట్ర కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ శ్యా మ్ సుందర్ జాజూ 'మన తెలంగాణ' ప్రతినిధితో చెప్పారు.

సామాజిక భద్రత పథకం లబ్ధిదారుల వివరాలు

వివరణ	2015–16	2016–17	2017– -18 (డిసెంబర్ నాటికి)
అందిన మొత్తం దరఖాస్తులు	107	95	02
పరిష్కరించిన దరఖాస్తులు	84	53	0
ప్రక్రియకొనసాగుతున్న దరఖాస్తులు	01	03	0
తిరస్కరించిన దరఖాస్తులు	19	11	0

వెబ్‌సైట్‌లో మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా

మనతెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులు, జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్, లెక్చరర్లు, లైబ్రేరియన్ పోస్టుల ప్రధాన పరీక్షలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు టిఎస్‌పిఎస్‌సి తెలిపింది. ప్రధాన పరీక్షలకు 1:15 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రధాన పరీక్షలు ఫిబ్రవరి 19 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

ఇద్దరు గవర్నర్లు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానాధికారి (సిఇఒ) స్థానంలో విడివిడి సిఇఒలను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో గవర్నర్ వ్యవస్థను కూడా రెండు రాష్ట్రాలకు విడివిడిగా ఉండేలా కేంద్రం ఆలోచనలు చేస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం గవర్నర్‌గా కొనసాగుతున్న వ్యక్తినే ఆంధ్రప్రదేశ్‌కు నియమించే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించినట్లు సమాచారం. నెల రోజుల వ్యవధిలోనే కొత్త గవర్నర్ వచ్చే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు విడిగా గవర్నర్‌ను నియమించాలని విశాఖపట్నం ఎంపి (బిజెపి) కంభంపాటి హరిబాబు కేంద్ర హోం మంత్రికి ఇటీవల రాసిన లేఖ నేపథ్యం కూడ అదేనని ఆ వర్గాల ద్వారా తెలిసింది. అంతకుముందే విశాఖపట్నం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు (బిజెపి) గవర్నర్‌పై బహిరంగ విమర్శలు చేశారు. ఒకే రాష్ట్రంలో ఒకే పార్టీకి చెందిన ఇరువురు నేతలు స్వల్ప వ్యవధిలోనే గవర్నర్ మార్పుపై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త గవర్నర్ నియమితులైతే అది ఆంధ్రప్రదేశ్‌లోని ఆ ఇద్దరికీ రానున్న ఎన్నికల ప్రచారంలో లాభించే అంశం అవుతుంది. గవర్నర్‌గా కొనసాగుతున్న నరసింహన్‌పై కొంతకాలం క్రితం తెలుగుదేశం నేతలు విమర్శలు చేశారు. ఇటీవల తెలంగాణ బిజెపి నేత లక్ష్మణ్ గవర్నర్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా కాంగ్రెస్ నేతలు ఏకంగా ఆయనతోనే వాగ్వాదానికి దిగారు. రెండు రాష్ట్రాల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తితో గవర్నర్‌ను మార్చడమే శ్రేయస్కరమని కేంద్రం ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌కు విడిగా గవర్నర్‌ను నియమిస్తే ప్రస్తుతం కొనసాగుతున్న గవర్నర్ నరసింహన్ తెలంగాణకు కొనసాగుతారా లేక ఇక్కడ కూడా కొత్త గవర్నర్ వస్తారా అనేది రాజకీయ పార్టీల్లో చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో బిజెపి, కాంగ్రెస్ నాయకులు గవర్నర్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్రం ఇక్కడే కొనసాగనిస్తుందా లేక మరో రాష్టానికి బదిలీ చేస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. టిఆర్ఎస్ వర్గాలు మాత్రం గవర్నర్ మార్పుపై ఇప్పటివరకు తమకు ఎలాంటి సమాచారం లేదని వ్యాఖ్యానించారు. ఒకవేళ నరసింహన్‌ను గవర్నర్ పదవి నుంచి కేంద్రం తప్పించినట్లయితే తెలంగాణ ప్రభుత్వం ఆయనను సలహాదారుగా నియమించుకునే అవకాశాలు లేకపోలేదని టిఆర్ఎస్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ప్రధాన కార్యదర్శి పదవీ అయిపోయిన తర్వాత రాజీవ్‌శర్మను, డిజిపిగా పదవీ విరమణ చేసిన తర్వాత అనురాగ్ శర్మలను సలహాదారులుగా నియమించుకున్నట్లే గవర్నర్ పదవి తర్వాత నరసింహన్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకునే అవకాశాలు హెచ్చుగానే ఉన్నాయని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బహుశా నెలరోజుల్లో ఈ ఊహాగానాలకు కేంద్రం ముగింపు పలికే అవకాశం ఉంది.

నరసింహన్‌పై గరం!

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో ప్రారంభించి, రూ.10 వేల కోట్లు ఖర్చుచేయగా, ఆ ప్రాజెక్టును కాళేశ్వరంగా పేరు మార్చి అంచనాను రూ.80 వేల కోట్లకు పెంచితే గవర్నర్ ప్రశ్నించకుండా ప్రాజెక్టు గురించి 'ఆహా... ఓహో' అని పొగడడం, సిఎం కెసిఆర్‌ను 'కాళేశ్వరం చంద్రశేఖర్‌రావు' అని, హరీష్ రావును 'కాళేశ్వర రావు' అని గవర్నర్ అభివర్ణించడం విచాకరమన్నారు. ఇవన్నీ చూస్తుంటే రేపు రాజ్‌భవన్‌ను 'టిఆర్ఎస్ భవన్' అంటారేమో అనే అనుమానం, బాధ కలుగుతుందన్నారు. ప్రాణహిత ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేస్తే ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా పూర్తయ్యేదన్నారు. ఈ ప్రాజెక్టుల టెండర్లలో పెరిగిన అంచనాలను ప్యాకేజ్‌ల వారిగా రాజ్‌భవన్‌లో సమీక్షించాల్సిన భాధ్యత గవర్నర్‌పై ఉందన్నారు. ఒక వేళ గవర్నర్ అలా చేయనట్లయితే తాము ప్రాజెక్టుల విషయంలో రాష్ట్రపతిని కలుస్తామని, గవర్నర్ పాత్రపై ఫిర్యాదుచేస్తామని చెప్పారు. ఇతర పార్టీల నుంచి ఎన్నికైనవారిని టిఆర్ఎస్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించి రాజ్యాంగాన్ని గవర్నర్ అవమానపరిచారన్నారు.

రూ.80 వేల కోట్ల కుంభకోణం

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో రూ.80 వేల కోట్ల కుంభకోణం, లక్ష కోట్ల అవినీతి జరిగిందని వి.హనుమంతరావు ఆరోపించారు. ఇంత పెద్ద కుంభకోణం కేవలం పేరు మార్చడంతోనే చేశారని ఆయన విమర్శించారు. గతంలో సిఎంలు అవినీతికి పాల్పడితే (లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఉద్దేశించి) కేసులు పెట్టి జైలుకు పంపించారని, ఇప్పుడు గవర్నర్ మీద కూడా కేసులు పెట్టే పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అంతలా పొగుడుతున్నారంటే రాష్ట్ర ప్రభుత్వం చేసే అవినీతిలో గవర్నర్‌కూ భాగస్వామ్యం ఉందనే అనుమానం కలుగుతోందన్నారు. గవర్నర్‌పై ప్రధానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

గవర్నర్‌కు తప్పుడు సమాచారం

గవర్నర్ నరసింహన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు సమాచారమిస్తున్నదని మాజీ మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుతో రైతులను ఏ విధంగా ఆదుకుంటుందో చెప్పే ప్రయత్నం చేయలేదని, నిర్వాసితులకు సహాయ, పునరావాస చర్యలు ఎలా చేపట్టారో చెప్పలేదన్నారు.

భూమి కోల్పోయిన రైతులను రాజ్ భవన్‌కు పిలిపించి గవర్నర్ వివరాలు తెలుసుకోవాలని, అప్పుడు సర్కార్ నిజ స్వరూపం తెలుస్తుందన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలుచేయాలని కాంగ్రెస్ కోరినా అమలు చేయలేదన్నారు. ఈ అంశాలపై గవర్నర్ సమీక్షించి ఉంటే బాగుండేదన్నారు. ప్రాణహితను జాతీయ ప్రాజెక్టు ప్రతిపాదన నుంచి ఎందుకు తొలగించారని ఆయన ప్రశ్నించారు. గవర్నర్ తన హోదాను మరిచిపోయి, బాధ్యతలను పక్కన పెట్టి ఒక అధికార పార్టీ ప్రతినిధిగా మాట్లాడడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ మాజీ ఎంఎల్‌సి కె.జనార్ధన్‌రెడ్డి విమర్శించారు. గవర్నర్ కేంద్ర, రాష్ట్ర పాలకులకు కొమ్ముకాసే విధంగా వ్యవహరించడం మంచి పరిణామం కాదని, గవర్నర్ ఎప్పుడూ నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన భాధ్యతను మరువరాదని ఆయన ఒక ప్రకటనలో సూచించారు.

గవర్నరా? టిఆర్ఎస్ ఏజెంటా?

ధర్మారం : కాళేశ్వరం సందర్శనలో గవర్నర్ మాటల తీరు హస్యాస్పదంగా ఉందని, టిఆర్ఎస్ ఏజెంట్‌గా మాట్లాడడం మంచి పద్ధతి కాదని సిఎల్‌పి ఉపనేత టి.జీవన్ రెడ్డి అన్నారు. మేడారంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిఆర్ఎస్ రాసిచ్చిన మాటల్ని గవర్నర్ వల్లెవేసినట్లుగా ఉందన్నారు. నరసింహన్ రాష్ట్రానికి గవర్నర్‌గా వ్యవహరించకుండా టిఆర్ఎస్ ఏజెంట్‌గా పని చేస్తున్నారా అని అనుమానం కలుగుతోందని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గవర్నర్ నీటిపారుదలపై మాట్లాడకుండా వ్యక్తుల భజన చేస్తూ పేర్లు మార్చి వ్యాఖ్యలు చేస్తే ప్రజల్లో వేరే సంకేతాలు వెళతాయని, గవర్నర్ పదవిపై ఉన్న గౌరవం పోతుందని అన్నారు.

కొత్త సిఇసి రావత్

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. ప్రస్తుత సిఇసి అచల్ కుమార్ జ్యోతి పదవీకాలం సోమవారంనాటితో ముగియనుంది. 64 ఏళ్ల రావత్ 1977 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. కేంద్రంలో పలు కీలక శాఖల్లో అధికారిగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఇక మరో ఎన్నికల కమిషనర్‌గా ఆర్థిక మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి అశోక్ లావాసాను నియమించారు. ఆయన కూడా ఈ నెల 23న బాధ్యతలు స్వీకరిస్తారు. 1980 బ్యాచ్‌కు చెందిన హర్యానా ఐఏఎస్ అధికారి లావాసా. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో మరొకరు సునీల్ అరోరా ఇప్పటికే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

వేటు

(మొదటిపేజీ తరువాయి)

పడతాయి. చివరికి నిజాయితీయే వ్యాప్తి చెందుతుంది' అని రాష్ట్రపతి నిర్ణయం వెలువడిన తర్వాత కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఆదివారంనాడు సాయంత్రం ఆప్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన కాసేపు మాట్లాడారు. అందరం ఒక్కతాటిపై నిలబడి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఆప్‌ను శతవిధాలా వేధించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని పరోక్షంగా బిజెపిని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. తమ ఎంఎల్‌ఎలపై కృత్రిమ కేసులు బనాయించారని, తనపై కూడా సిబిఐని ఉసిగొల్పి ఏం తేల్చలేకపోయారన్నారు. చివరికి చేసేదేం లేక 20మందిని అనర్హులను చేశారని కేజ్రీవాల్ మండిపడ్డారు. దేవుడు తమకు భారీ మెజారిటీని ఇచ్చారని చెబుతూ ప్రభుత్వానికి వచ్చిన ఢోకాలేదని పరోక్షంగా పేర్కొన్నారు. రాష్ట్రపతి నిర్ణయాన్ని బిజెపి స్వాగతించింది. లాభాదాయక పదవుల్లో ఉండి ఆర్జించిన సొమ్మును తిరిగిచ్చేయాలని బిజెపి ఢిల్లీశాఖ అధ్యక్షుడు మనోజ్ తివారీ డిమాండ్ చేశారు. వేటు పడ్డ ఎంఎల్‌ఎల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి...

వరుస సంఖ్య	ఎమ్మెల్యే పేరు	నియోజక వర్గం	హోదా/ శాఖ
1.	ఆదర్శ్ శాస్త్రి	ద్వారక	ఐటి
2.	ఆల్కా లంబా	చాందినిచౌక్	పర్యాటకం
3.	అనిల్ వాజ్‌పేయి	గాంధీనగర్	ఆరోగ్యశాఖ
4.	అవతార్ సింగ్	కల్కాజి	గురుద్వారా ఎలక్షన్
5.	కైలాష్‌గెహ్లాట్	నజఫ్‌ఘర్	న్యాయశాఖ
6.	మదన్‌లాల్	కస్తూర్బనగర్	విజిలెన్స్ శాఖ
7.	మనోజ్‌కుమార్	కొండ్లీ	పౌర సరఫరాలు
8.	నరేశ్‌యాదవ్	మెహరౌలి	కార్మిక
9.	నితిన్ త్యాగి	లక్ష్మీ నగర్	మహిళా శిశు సంక్షేమ
10.	ప్రవీణ్‌కుమార్	జంగాపుర	విద్యా
11.	రాజేశ్‌గుప్తా	వజీర్‌పూర్	ఆరోగ్య
12.	రాజేశ్‌రిషి	జనక్‌పూర్	ఆరోగ్యం
13.	సంజీవ్ ఝా	బురారి	రవాణా
14.	సరితాసింగ్	రోహ్తస్ నగర్	ఉద్యోగుల సంక్షేమం
15.	సోమ్‌దత్	సదర బజార్	పారిశ్రామిక
16.	శరద్ కుమార్	నరేల	రెవెన్యూ
17.	శివ్‌చరణ్ గోయల్	మోతినగర్	ఆర్థిక
18.	సుఖ్‌బీర్ సింగ్	ముండ్క	భాష, ఎస్‌టి, ఎస్‌సి, ఒబిసి సంక్షేమం
19.	విజేందర్ గార్గ్	రాజిందర్‌నగర్	పిడబ్ల్యూడి
20.	జర్నైల్ సింగ్	తిలక్‌నగర్	అభివృద్ధి సంక్షేమం

పెరిగిన రాబడి

(మొదటిపేజీ తరువాయి)

లభించింది. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల ఆదాయం కూడా వంద కోట్ల రూపాయల లోపే ఉంది. గతేడాది ఇదే ఎనిమిది నెలల కాలానికి ఈ రంగం నుంచి ప్రభుత్వం ఆర్జించిన ఆదాయం రూ. 2537.25 కోట్లు కాగా ఈసారి రూ. 22 కోట్లు అదనంగా సమకూరింది. ఏప్రిల్, మే, ఆగస్టు నెలల్లో గతేడాది కంటే తక్కువ ఆదాయమే వచ్చినా మొత్తంమీద స్వల్పంగా పెరుగుదల కనిపించింది. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల విభాగం అధికారులు ఎనిమిది నెలల ఆదాయాన్ని రూ. 2559.73 కోట్లుగా అంచనా వేస్తే 'కాగ్' మాత్రం రూ. 2446.46 కోట్లుగా పేర్కొనింది. కాగ్ లెక్కల ప్రకారం గతేడాది ఇదే ఎనిమిది నెలలకు ప్రభుత్వం ఆర్జించింది రూ. 2942.49 కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నెలకు సగటును రూ. 319.96 కోట్ల చొప్పున ఈ రంగం నుంచి ప్రభుత్వం ఆర్జిస్తుండగా మిగిలిన నాలుగు నెలల కాలానికి ఇది రూ. 1279.86 కోట్ల మేరకు వచ్చే అవకాశం ఉంది. సరాసరి లెక్కల ప్రకారం అంచనా వేస్తే రూ. 839 కోట్లు ఎక్కువగానే నమోదయ్యే అవకాశం ఉంది. అయితే రిజిస్ట్రేషన్ల సంఖ్యాపరంగా చూస్తే మాత్రం గతేడాదితో పోలిస్తే సుమారు 54 వేలు తగ్గింది. గతేడాది ఎనిమిది నెలల కాలానికి రాష్ట్రం మొత్తంమీద 7,44,754 రిజిస్ట్రేషన్లు చోటుచేసుకుంటే ఈ ఏడాది మాత్రం అది 6,90,146 మాత్రమే. రిజిస్ట్రేషన్లలో సింహభాగం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లోనే చోటు చేసుకున్నాయి.

మొత్తం రిజిస్ట్రేషన్లలో 65% (4,51,995) పై జిల్లాల్లోనే నమోదయ్యాయి. హైదరాబాద్ నగరానికి అనుకుని ఉన్న జిల్లాల్లోనే ఎక్కువగా భూములు రిజిస్ట్రేషన్‌లు అవుతున్నట్లు పై గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఏప్రిల్ మొదలు అక్టోబర్ వరకు గతేడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్లు రాష్ట్రవ్యాప్తంగా తగ్గినా నవంబరు నెలలో మాత్రం 19,401 పెరిగాయి. రంగారెడ్డి జిల్లాలో మాత్రం గతేడాది ఎనిమిది నెలల్లో నమోదైన రిజిస్ట్రేషన్ల కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి స్వల్పంగా పెరిగాయి. ఒక్క నవంబరు నెలలోనే ఈ జిల్లాలో నాలుగు వేల రిజిస్ట్రేషన్లు పెరిగాయి. బడ్జెట్‌లో ప్రభుత్వం వేసిన అంచనాకంటే రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ద్వారా ఎక్కువ ఆదాయమే వచ్చే అవకాశం ఉంది.



చట్టసభల్లో వడ్డెర్లకు సముచిత స్థానం : మంత్రి జగదీశ్‌రెడ్డి

మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి : చట్టసభల్లో వడ్డెర్లకు స్థానం ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర విద్యుత్, ఎస్‌సి అభివృద్ధి శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన వడ్డెర్ల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మా ట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంచార జాతుల అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉందని ఆయన వెల్లడించారు. వడ్డెర్లను కూడా సంచార జా తుల్లో ఒకటిగా ప్రభుత్వం భావిస్తుందని, వారి అభివృద్ధికి మొట్టమొదటిసారిగా కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఉద్యమ కాలంలోనే ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం ఏ వర్గాలకు ఎటువంటి సమస్యలు ఉన్నాయన్నది అధ్యయనం చేశారన్నారు. శాశ్వతంగా నివాసాలు లేని వడ్డెర్లు ఒక్కటై వేల మందితో సభ జరుపుకోవడం అభినందనీయమన్నారు. బతుకు బాటల్లో వలస పోయిన వడ్డెర్లు కేవలం తమ ఇండ్ల మరమ్మత్తుల నిమిత్తమే సుస్థలానికి రావడం ఆణవాయితీగా మారిందన్నారు. అటువంటి వడ్డెర జాతుల నుండి చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉన్నట్లయితే వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసు కురావడం సులభతరమవుతుందన్నారు. అదే సమయంలో వడ్డెర్ల వెనుకబాటుతనానికి విద్య లేకపోవడం ప్రధాన కారణంగా ప్రభుత్వం గుర్తించిందన్నారు.

రిమ్స్‌లో నిమ్స్ తరహా వైద్యం

• అవగాహనతో ప్రగతి సాధ్యం • ఖాళీల భర్తీకి ప్రత్యేక చర్యలు : వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి • డయాలసిస్, పిడియాట్రిక్ ఐసియు, సిటి స్కాన్‌ల ప్రారంభం

మన తెలంగాణ/ ఆదిలాబాద్ టౌన్ : రిమ్స్ ఆసుపత్రిని నిమ్స్ తరహాలో ఆధునీకరించి నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రయత్నిస్తున్నామని, దీనిలో భాగంగా అధునాతన వైద్య పరికరాలు వైద్య సిబ్బందిని డాక్టర్లను నియమిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సి. లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లాకు వచ్చిన ఆరోగ్య శాఖ మంత్రికి రాష్ట్ర మంత్రులు జోగు రామన్న, ఐకె రెడ్డిలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ముందుగా రిమ్స్ బోధన, బోధనేతర సిబ్బంది క్వార్టర్స్‌లను ప్రారంభించారు. నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడి నుంచి రిమ్స్‌లో సిటి స్కాన్, అల్ట్రాసౌండ్, డిజిటల్ ఎక్స్ రే, హెల్త్ సెంటర్, పేయింగ్ రూంలు, విశ్రాంతి భవనం, డయాలసిస్ సెంటర్‌లను మంత్రులు జోగు రామన్న, ఐకె రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గిరిజన జనాభా అధికంగా కలిగిన ఆదిలాబాద్ జిల్లాలో గతంలో అవగాహన లేకపోవడం వలన మలేరియా లాంటి వ్యాధులు సోకి మరణాలు సంభవించాయన్నారు. రాష్ట్రంలో 40 డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేసి సేవలు అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సింగిల్ యూజ్ ఫిల్టర్‌తో డయాలసిస్ చేయడం జరుగుతుందన్నారు.



రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలను అటానమస్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. రిమ్స్‌లో వైద్యుల కొరత ఉందన్నారు. కానీ ఇక్కడి వైద్యులు వారి శక్తికి మించిన సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. త్వరలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో 10వేల పోస్టులు భర్తీ చేసేందుకు ప్రణాళిక బద్దంగా ముందు సాగుతున్నామన్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ రూ.103 కోట్లతో పనులకు ప్రతిపాదించి వైద్య శాఖ మంత్రికి విన్నవించామని, నర్సింగ్ విద్యార్థులకు భవన నిర్మాణానికి కోరామన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రిమ్స్‌లో పీజీ కోసం అనుమతులు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వాల హయాంలో ఏ మంత్రి కూడా జిల్లా పర్యటనకు రాలేదని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా వైద్యం అందిస్తున్నాయన్నారు.

రాష్ట్ర దేవాదాయ, న్యాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వైద్య శాఖలో మార్పులు తెచ్చామని, రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా రిమ్స్ ఎస్‌ఎన్‌సియుకు రెండవ స్థానం రావడంతో మంత్రి చేతుల మీదుగా డా॥సూర్యకాంత్‌కు ప్రశంసాపత్రాలతో పాటు అవార్డును అందించారు. అనంతరం రిమ్స్‌కు వచ్చిన ఆరోగ్య శాఖ మంత్రిని శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డి దివ్య, పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి, బోథ్ ఎంఎల్‌ఎ రాథోడ్ బాపురావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రంగినేని మనీషా, ఐసిడిఎస్ ఆర్గనైజర్ కస్తాల ప్రేమల, డిసిసిబి అధ్యక్షుడు ముడుపు దామోదర్‌రెడ్డి, జడ్‌పిటిసి అశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆరె రాజన్న, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కమిటీ సభ్యులు నీలాబాయి, రిమ్స్ డైరెక్టర్ డా అశోక్, డిఎంహెచ్‌ఓ డాక్టర్ రాజీవ్ రాజ్, మావల సర్పంచ్ రఘుపతి, వైస్ ఎంపిపి గంగారెడ్డి, బాలూరి గోవర్ధన్ రెడ్డి, యూనీస్ అక్బానీ, నారాయణ, భోజారెడ్డి, రాజేశ్వర్, బండారి సతీష్, కొండ గణేష్, రేడియాజిస్ట్ డా. కళ్యాణ్ రెడ్డి, వైద్యులు రామా కృష్ణ, శరత్ రెడ్డి, సూర్యకాంత్, అనంత్ రావ్, రిమ్స్ ఆర్ ఎంఓ వినయ్ కుమార్, మెడికోలు, రిమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




ఉపరాష్ట్రపతి నివాసంలో సంక్రాంతి మిలన్

మనతెలంగాణ/ న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాసంలో సంక్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అక్కడి అందరిని ఆకట్టుకున్నాయి. 'సంక్రాంతి మిలాన్' పేరిట నిర్వహించిన ఈ కార్యమంలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కురియన్, మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పాల్గొన్నారు. అలాగే రాజకీయ ప్రముఖులు అశోక్‌గజపతి రాజు, సుష్మాస్వరాజ్, అరుణ్‌జైట్లీ, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ, విజయ్ గోయెల్, జితేంద్ర సింగ్, జయంత్ సిన్హా, ఎంపీలు కె.కేశవరావు, తోట నర్సింహం, ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.... భోగి భాగ్యాలతోపాటు... చెడును తరిమి మంచిని ఆహ్వానించడమే సంక్రాంతి పండుగ ప్రత్యేక అన్నారు. ప్రకృతిని పరిరక్షించుకోవడం, సంప్రదాయాలను గౌరవించుకోవడం మన సంస్కృతిలో సమ్మిళితమై ఉందన్నారు. మకర సంక్రాంతి పండుగ సూర్య భగవానునికి అంకితమని, ఇది 'ఉత్తరాయణ' లేదా సూర్యుని ఉత్తర దిశగా ప్రయాణించడాన్ని సూచిస్తుందని అన్నారు. దేశం అంతటా ఈ పండుగను వివిధ పేర్లతో జరుపుకుంటారని, మకర సంక్రాంతి మరియు పొంగల్ పండుగలు మంచి పంటలతో వచ్చే ఆనందాన్ని సూచిస్తాయని తెలిపారు. ఈ పండుగ ద్వారా ప్రజల జీవితాలలో సానుకూల పరివర్తన వస్తుందని ఆయన అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా లక్షలాదిమంది ప్రజలు పవిత్ర నదులలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని పేర్కొన్నారు. నిత్యం పొలాలలో శ్వేదం చిందిస్తూ దేశ ప్రజలకు ఆహారాన్ని అందించే రైతులకు, వారి వెలకట్టలేని శ్రమకు ఈ సంక్రాంతి మిలన్ సందర్భంగా ఉపరాష్ట్రపతి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పండుగల ద్వారా దేశప్రజలలో శాంతిని మరియు సంతోషాన్ని కలిగిస్తాయని ఆయన చెప్పారు.

మన పండుగలు ప్రకృతితో ముడి పడి ఉంటాయి

మనదేశంలో చాలా పండుగలు ప్రకృతి ఆధారమైనవని, ప్రకృతితో ముడిపడి ఉంటాయిని అన్నారు. గ్రామీణ సంస్కృతితో రైతుల జీవన విధానం ముడిపడి ఉంటుందన్నారు. ఈ పండుగల ద్వారా మన సంస్కృతి, సాంప్రదాయాలు భావితరాలకు అందుతాయని ప్రధాని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఢిల్లీలో ఉన్న దక్షిణభారతీయులందరిని ఒకచోటికి చేర్చి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా వివిధ పేర్లతో సంక్రాంతి పండుగను జరుపుకునే దక్షిణ భారత దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన పలువురు కళాకారులను ఆయన అభినందించారు

గవర్నర్ ప్రస్తావించి ఉండాల్సింది



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశంలో ముఖ్యమంత్రి కెసిఆర్‌ను పొగడ్తలతో ముంచెత్తిన గవర్నర్ ఇఎస్‌ఎల్. నరసింహన్, రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులతో పాటు వివిధ రంగాలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని ప్రస్తావించి ఉంటే బాగుండేదని ఎంపి బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల విషయంలో కేంద్రం చేస్తున్న సహకారాన్ని టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాగూ చెప్పడం లేదని, కనీసం గవర్నర్ అయినా ప్రస్తావించాల్సి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టులకు అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతుల్లో కేంద్రం సహకారాన్ని ఎవ్వరూ విస్మరించలేరని గుర్తుచేశారు.

నేడు ఆర్‌టిసి ఇయు శిక్షణ శిబిరం

మన తెలంగాణ / హైదరాబాద్ : టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యకర్తల రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరాన్ని ఈ నెల 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లోని మఖ్దూం మినీ హాల్‌లో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి తెలిపారు. ఈ శిబిరాన్ని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్మికుAల విధులు, హక్కులు, భాధ్యతలు, కార్మిక సంఘం పాత్ర, ఎన్నికలు, సంస్థ పరిరక్షణ తదితర అంశాలను ఈ శిబిరంలో వివరించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.


బస్సు - బైక్ ఢీ : ఇద్దరు మృతి

సికింద్రాబాద్ : ఓ ప్రైవేటు పాఠశాల బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే చనిపోయారు. ఈ ఘటన సికింద్రాబాద్ జవహర్‌నగర్ కౌకూర్ వద్ద ఆదివారం జరిగింది. మృతుల వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మహారాష్ట్రలో భూకంపం

ముంబయి : మహారాష్ట్రలోని కొయ్నా ప్రాంతంలో ఆదివారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 3.6గా నమోదైంది. ఒక్కసారిగా భూమి కంపించడంతో భయంతో ప్రజలు రోడ్ల మీదకు పరుగులు తీశారు. భూకంపం వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

విద్యావేత్త ఆరోన్ రాస్ సతీమణి మృతి




మనతెలంగాణ / హైదరాబాద్ : ప్రముఖ విద్యావేత్తగా జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలకు సుపరిచితులైన భూంపాగ్ ఆరోన్‌రాస్ సతీమణి శారా రాస్ (80) ఆదివారం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె గద్వాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలిగా కొన్నేళ్ల పాటు సేవలు అందించారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ము గ్గురు కూతుళ్లు ఉన్నారు. ఆమె కుమారుడు జేకబ్ రాస్ తెలంగాణ సిఎం కార్యాలయ పిఆర్‌ఓగా పని చేస్తున్నారు. ఆమె మృతిపై జడ్‌పి చైర్మన్ బండా రి భాస్కర్, గద్వాల ఎంఎల్‌ఎ డికె అరుణ, స్థానిక రాజకీయ నేతలు సం తాపం వ్యక్తం చేశారు. 50 ఏళ్ల నుంచి పాఠశాలలు, నర్సింగ్ కళాశాలలు నిర్వహించి పాలమూరులోని పేద విద్యార్థులకు విద్యా దానం చేశారు.

స్వచ్ఛతతోనే పర్యాటకం భేష్

మన తెలంగాణ / హైదరాబాద్ : రాజధాని హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పర్యాటక రంగం అభివృద్ధి చెంది ఉపాధి, ఆర్థికాభివృద్ధి గణనీయంగా పెరుగుతుందని జిహెచ్‌ఎంసి కమిషనర్ డా. బి. జనార్థన్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్వచ్ఛ సర్వేక్షణ్–2018 పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దేశ విదేశీ పర్యాటకుల సంఖ్య పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. తాము గత మూడేళ్లుగా చేపడుతున్న వినూత్న స్వచ్ఛ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లోని మున్సిపాలిటీల్లో ప్రవేశపెట్టిందన్నారు. తడి చెత్త, పొడి చెత్త రెండు వేర్వేరు డస్ట్ బిన్‌లు, 'స్వచ్ఛ ఆటో'ల ప్రవేశం, ఇంటింటికీ చెత్త సేకరణకు రూ. 50 వసూలు వంటి వాటిని ఉదహరించారు.

కెసిఆర్ కుటుంబ కూటమిని కూలుస్తాం

• టిటిడిపి అధ్యక్షులు ఎల్.రమణ



మన తెలంగాణ/ ముషీరాబాద్ : 2019 ఎన్నికల్లో సిఎం కెసిఆర్ కుటుంబ కూటమిని కూల్చి టీడీపిని తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి తీసుకు వచ్చేందుకు టిడిపి నేతలు కృషి చేయాలని టిటిడిపి అధ్యక్షులు ఎల్.రమణ పిలుపునిచ్చారు. బస్తీ బస్తీకి టీడీపి కార్యక్రమాన్ని నగర టీడీపి అధ్యక్షులు ఎం.ఎన్.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని బాగ్‌లింగంపల్లి శ్రీరాంనగర్ బస్తీలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీటీడీపి అధ్యక్షులు ఎల్.రమణ, ఎంపి గరికపాటి మోహన్‌రావు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, టీడీపి పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బస్తీలో ఇంటింటికి తిరుగుతూ టీడీపి హయాంలో చేసిన అభివృద్ధిని కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎల్.రమణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో 70 వేల కోట్ల అప్పు ఉంటే ప్రస్తుతం 2 లక్షల కోట్లకు పెంచిన ఘనత కెసిఆర్‌దేనని ఆరోపించారు. ప్రగతి భవన్‌ను పేదల ప్రభుత్వ ఆసుపత్రిగా మార్చే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. మార్చిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఉద్యమానికి శ్రీకారం చుడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు రంజన్‌నాయుడు, అతినగరం సుధేష్, వివేక్, శంకర్ ముదిరాజ్, కరికె కిరణ్‌కుమార్, అస్లాం, నవీన్‌కుమార్, జయేందర్‌బాబు, గోవింద్, షకీల్‌రెడ్డి, శ్రీహరి, ముప్పిడి నర్సింగ్‌రావు, శరణ్, బాబు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య తెలంగాణ కావాలి

• విరసం నాయకుడు వరవరరావు



మన తెలంగాణ/ ఎన్‌జిఒస్ కాలనీ: గత యాభై సంవత్సరాలుగా నక్సలైట్ ఉద్యమంలో పనిచేస్తూ నక్సల్ బరి ఉద్యమాన్ని ముందుకు తీసుకవచ్చి ప్రజాస్వామ్య బద్ధంగా ముందుకెళుతూ ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తున్నానని విరసం నాయకుడు వరవరరావు అన్నారు. ఆదివారం హన్మకొండ హంటర్‌రోడ్డులోని అభిరాంగార్డెన్‌లో నిర్వహించిన టిపిఎఫ్ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ప్రజలు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తామనుకుంటే అడుగడుగునా అడ్డంకులు కల్పిస్తూ నిర్భంధాలకు గురి చేస్తుందని విమర్శించారు. తెలంగాణ రాకముందు చంద్రశేఖర్‌రావు నక్సలైట్ ఎజెండాను తెలంగాణ వస్తే అమలు చేస్తానని చెప్పి అడుగడుగునా తెలంగాణ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని విమర్శించారు. ప్రజా కళాకారులను, కవులను, టిపిఎఫ్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్భంధించడం ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కులను కాలరాయడమేనన్నారు. తెలంగాణ కోసం యావత్ తెలంగాణ ప్రజలు పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో దళితులు, గిరిజనులు, ఆదివాసిలు, చెంచులు, మైనార్టీలు, అడుగడుగునా అవమానాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రజాసామ్యం లేకుండా పోయిందని విమర్శించారు. టిపిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరంగల్ డిక్లరేషన్ మహాసభకు హాజరవుతుంటే అక్రమంగా మ మ్మల్ని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం చట్ట విరుద్ధమని ఇదేనా ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. తె లంగాణ కోసం, తెలంగాణ ప్రజల కోసం పనిచేస్తున్న కోదండరాం విమలక్క, మంద కృష్ణ మాదిగ లాంటి ఎం దరో నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. అనంతరం ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ భౌగోళికంగా మాత్రమే వచ్చిందని ప్రజాస్వామ్య తెలంగాణ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య తెలంగాణ అంటే ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించడమేనని, ఇది రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కు అని ఆయన న్నారు. తెలంగాణ రాష్ట్రం పోరాటాలతో వచ్చిందని కాని, ప్రజలకు స్వాతంత్ర్యం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిపిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నలమాస కృష్ణ, ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి, ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వర్‌రావు, రమాదేవి, డాక్టర్ సి.కాశీ, టిపిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కేంద్రానికి అన్ని రాష్ట్రాలు సమానమే

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం



మన తెలంగాణ/ బోడుప్పల్: ప్రాంతీయ బేదాలు లేకుండా అన్ని రాష్ట్రాల అభివృద్ధి కి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అన్ని విధాలుగా కేంద్రం సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. బోడుప్పల్ పురపాలక సంఘం పరిధిలోని కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ యుఫోరియా 2018 వార్షిక వేడుకలు పాఠశాల ఆవరణలో కనున్నల పండువగా జరిగాయి .ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న హన్స్‌రాజ్ జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజాన్ని గౌరవించించేలా విద్యార్థులను తీర్చిదిద్దినప్పుడే వారు ఉన్నత విలువలతో కూడిన భావి భారత పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యాలు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో పరిచేయాలని కోరారు. ఎమ్మెల్యే మలిపేద్ది సుధీర్ రెడ్డి సూచనను ప్రధాన మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. మేడ్చల్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విదాలుగా కేంద్రానికి సహాయ సహకారాలు అందిస్తూన్నా హైకోర్టు వంటి పలు అంశాల్లో నాన్చుడుధోరణి ప్రదర్శిస్తోందన్నారు. తక్షణమే కేంద్ర హోంశాఖ చొరువతీసుకుని హైకోర్టు విభజన చేపట్టాలని అయన కొరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంచందర్ రావు, ఎమ్మెల్యే డాక్టార్ లక్ష్మణ్ , యువజన సర్వీసులు, బిసి సంక్షేమా కార్యదర్శి వెంకటష్, జడ్పిటిసి మంద సంజీవ రెడ్డి ,పాఠశాల చైర్మెన్ కేవల్‌చంద్ ,కిరణ్మయి ,కరస్పాండేంట్ రితీష్ లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వివాదాస్పద పద్మావత్ చిత్రం విడుదలను నిరసిస్తూ ఆదివారంనాడు రాజస్థాన్‌లోని చిత్తోర్‌ఘడ్‌లో భారీ నిరసన ప్రదర్శనకు దిగిన రాజ్‌పుత్ మహిళలు

పింఛన్ల కోసం ఎదురుచూపు

మన తెలంగాణ/ మహబూబ్‌నగర్ : రాష్ట్రంలో పదవీ విరమణ పొంది పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న విఆర్‌ఓలు ఇకనైన ప్రభుత్వం కనికరించాలని మొరపెట్టుకుంటున్నారు. బ్రిటీష్ కాలం నుంచి గ్రామాల్లో రెవెన్యూ, శాంతిభద్రతలు వంటి అంశాలను చక్కదిద్దేందుకు గ్రామాల్లో పట్వారీ, పటేల్ వ్యవస్థ కొనసాగుతూ వచ్చింది. వీరంతా భూములకు సంబంధించిన కీలకమైన రెవెన్యూ రికార్డుల నిర్వహణతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడుతూ ఉండేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామానికి వీరే కీలకమైన వ్యక్తులుగా ఉండేవారు. 1984లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి. రామారావు పట్వారీ, పటేల్ వ్యవస్థను రద్దు చేశారు. దీంతో వేలాది మంది ఉపాధి కోల్పోయారు. సుదీర్ఘ పోరాటం తర్వాత సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు 1992లో తిరిగి వీరిలో అర్హులైన వారిని విఎఒలుగా ప్రభుత్వం నియమించింది. అప్పట్లో కేవలం రూ.600 వేతనంతో తాత్కాలిక ఉద్యోగులుగా పని చేశారు. చివరకు పదవ తరగతి, ఇంటర్ చదివిన వారిని 2002 జనవరి 1 నుంచి పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేలు ఇచ్చారు. వారిని విఆర్‌ఓలుగా, పంచాయతీ కార్యదర్శులుగా నియమించారు. 2002లో ప్రభుత్వ ఉద్యోగులుగా నియామకమై 2008 జూన్ 30న పదవీ విరమణ పొందిన వారికి కనీసం ఏడేళ్ల సర్వీసు లేదనే సాకుతూ పెన్షన్ ఇచ్చేందుకు నిరాకరించారు. ఇలాంటి వారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2,225లో ఉన్నారు. వీరంతా తాము దాదాపు 2 నుంచి 3 దశాబ్దాలుగా ప్రభుత్వానికి సేవలు అందించామని తమకు కనీస పెన్షన్ మంజూరి చేసేందుకు గతంలో 1992 నుంచి 2002 మధ్య పని చేసిన కాలన్ని కలపాలని విన్నవించారు. ఎపి అడ్మినిషన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యూనల్ ఆదేశాలు, 1980 ఆర్‌పిఆర్ జిఒలను పరిశీలించి తర్వాత ఫైల్ నెంబర్ 28496/va/2013 ప్రకారం పాత సర్వీసును పరిగణలోకి తీసుకుని 2225 మందికి కనీస పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఫిబ్రవరి 2 2014న అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి అంగీకారం తెలుపుతూ సంతకం చేశారు. కానీ తెలంగాణలో ఇలాంటి వారు కేవలం 492 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో కొంతమంది మృతి చెందారు కూడా. ఇక్కడి వారికి మాత్రం పెన్షన్ కోసం ఎదురు చూపులు తప్పటం లేదు. తమకు ఎప్పుడు పెన్షన్ అందుతుందోనని, ఆశగా ఎదురుచూస్తున్నారు.

మన తెలంగాణ
8
హైదరాబాద్
సోమవారం
22 జనవరి 2018
wraw.manatelangana.news

పెళ్లి ఆలోచనే లేదు



చిత్ర పరిశ్రమలో 50కి పైగా సినిమాలు చేసిన చెన్నై బ్యూటీ త్రిష. తెలుగు, తమిళ్‌లో ఎన్నో సూపర్‌హిట్ సినిమాల్లో నటించిన ఆమె కోట్లాదిమంది అభిమానులను సొంతం చేసుకుంది. ఈ సీనియర్ బ్యూటీకి ఎవరంటే ఇష్టమంటే... ఆసక్తికరమైన సమాధనం చెప్పింది. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్‌కు తాను పెద్ద ఫ్యాన్ అని త్రిష పేర్కొంది. ఇక సౌత్‌లో మీరు పనిచేసిన హీరోల్లో ఎవరంటే ఇష్టం అని అడిగితే పెద్ద లిస్ట్ చెప్పింది. టాలీవుడ్, కోలీవుడ్‌లలో దాదాపు స్టార్ హీరోలు అందరి పేర్లు చెప్పేసింది. అజిత్, సిద్ధార్థ్, పవన్‌కళ్యాణ్, మహేష్‌బాబు, ప్రభాస్, ఎన్‌టిఆర్‌లు తన ఫేవరేట్‌లు అని పేర్కొంది. అయితే ఎవరూ తనకు బెస్ట్ ఫ్రెండ్ కారని చెప్పింది. పెళ్లి గురించి అడిగితే మాత్రం డిఫరెంట్‌గా సమాధానమిచ్చింది. ప్రస్తుతానికి తన మనసులో పెళ్లి ఆలోచనే లేదని అంది. ఇప్పటికైతే సినిమాలు తప్ప వేరే వాటిపై దృష్టి పెట్టనని అంటోంది. కొంత కాలం క్రితం నిశ్చితార్థం పూర్తయి పెళ్లి ఆగిపోవడమే దీనికి కారణమైతే... ఇప్పట్లో తన పెళ్లికాదని త్రిష నిర్మొహమాటంగా చెప్పింది. దీంతో ఆమె అభిమానులు కొందరు మాత్రం సంతోషంగా ఉన్నారట. ఎందుకంటే పెళ్లయ్యాక సినిమాలకు గుడ్‌బై చెబుతానని త్రిష చెప్పడమే ఇందుకు కారణం.



ప్రభాస్

ఫిబ్రవరి 25 నుంచి దుబాయ్‌లో...

ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ మూవీ 'సాహో'. సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్ హీరోయిన్‌గా చేస్తోంది. అయితే అంతా అనుకున్నట్లు జరిగితే 'సాహో' సినిమాకు ప్రధాన ఆకర్షణ అనదగ్గ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ ఈపాటికి అయిపోవాల్సింది. కానీ షెడ్యూల్ ప్లాన్ చేసుకొని సినిమా యూనిట్ అంతా కలిసి దుబాయ్ చేరుకొని ఇక షూటింగ్ ఆరంభించడమే తరువాయి అనుకున్న తరుణంలో పెద్ద షాక్ తగిలింది. వీళ్లు షూటింగ్ చేయాలనుకున్న కొన్ని ప్రాంతాల్లో అనుమతులు రాలేదు. అనుకున్న ప్రకారం షూటింగ్ చేసే పరిస్థితి లేకపోవడంతో ఆతర్వాత హైదరాబాద్ షెడ్యూల్ మొదలుపెట్టారు. భాగ్యనగరంలో కొన్ని సీన్లను చిత్రీకరించారు. అయితే ఈలోపు ఒక టీం దుబాయ్‌లోనే ఉండి అక్కడి వ్యవహారాలన్నింటినీ చక్కబెట్టింది. అనుకున్న ప్రాంతాల్లో షూటింగ్ చేయడానికి అనుమతులు మంజూరయ్యాయి. దీంతో చిత్ర బృందం దుబాయ్ పయనానికి సన్నాహాలను పూర్తిచేసింది. ఫిబ్రవరి 25 నుంచి అక్కడ షూటింగ్ చేయడానికి ప్రణాళిక వేసుకుంది చిత్ర బృందం. ఇంతకుముందు 75 రోజుల పాటు దుబాయ్‌లో షూటింగ్ చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు 15 రోజుల కోత పడింది. 60 రోజుల్లోనే ఈ షెడ్యూల్ పూర్తి చేయడానికి ప్లాన్ చేసుకున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయితే సినిమా దాదాపుగా పూర్తికావచ్చినట్లేనట. మిగిలిన షూటింగ్‌ను ఒక షెడ్యూల్‌లో పూర్తి చేసేస్తారట. ఈ ఏడాది ప్రథమార్థంలో షూటింగ్ అయిపోవచ్చని అంటున్నారు. ఆతర్వాత పోస్ట్‌ప్రొడక్షన్‌కు కొంచెం సమయం పడుతుంది. దసరా లేదా దీపావళి సమయానికి 'సాహో' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముంది.



'తొలి ప్రేమ' ఆడియో వేడుకలో అల్లుఅరవింద్, దిల్‌రాజు, వరుణ్‌తేజ్, రాశీఖన్నా, బివిఎస్‌ఎన్ ప్రసాద్, వెంకీ అట్లూరి, సీనియర్ నరేష్, తమన్ తదితరులు.

నా మనసుకు దగ్గరైన కథ తొలి ప్రేమ

వరుణ్‌తేజ్

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై నిర్మితమవుతున్న చిత్రం 'తొలిప్రేమ'. రాశీఖన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని యువ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్నారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదలకానుంది. ఎస్.ఎస్.తమన్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా బిగ్ సీడీ, ఆడియో సీడీలను అల్లు అరవింద్ విడుదల చేయగా... తొలి సీడీని దిల్‌రాజు అందుకున్నారు. కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడుతూ ''పవన్‌కళ్యాణ్‌కు 'తొలిప్రేమ' చిత్రం ఎంత పేరును తీసుకువచ్చిందో ఈ 'తొలి ప్రేమ' వరుణ్‌తేజ్‌కు అంత పేరు తీసుకువస్తుందని అనుకుంటున్నాను. తమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించాడు''అని పేర్కొన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''20 సంవత్సరాల క్రితం పవన్ 'తొలి ప్రేమ' విడుదలైంది. ఆ తొలి ప్రేమ ప్రేక్షకులను ఎలా ఉర్రూతలూగించిందో ఈ తొలి ప్రేమ కూడా అలాగే ఉర్రూతలూగిస్తుంది. 'ఫిదా'కు ముందు వెంకీ ఈ సినిమాను మా బ్యానర్‌లో చేయాల్సింది. కానీ ఫిదా కారణంగా తను బాపినీడుకు ఈ కథ వినిపించాడు. తనకు నచ్చడంతో సినిమా ఓకే అయింది. మా బ్యానర్‌లో చేయాల్సిన సినిమాను వారి బ్యానర్‌లో చేశారనే కారణంతో బాపినీడు ఈ సినిమా మొత్తం రైట్స్‌ను నాకు ఇచ్చేశాడు. ఇలాంటి విషయాలు అరుదుగా జరుగుతుంటాయి''అని అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''ఈ సినిమా చేసే క్రమంలో ఆరు నెలల వరకు ఏ టైటిల్ పెడదామని ఆలోచించాం. దర్శకుడు వెంకీ ముందుగా 'తొలిప్రేమ' అనే టైటిల్ పెడదామని అనడంతో నాకు ఇష్టమున్నా కాస్త భయపడ్డాను. ఎందుకంటే అది బాబాయ్ పవన్ బ్లాక్‌బస్టర్ మూవీ టైటిల్. ఆ సినిమా టైటిల్ పెట్టినందుకు జస్టిఫై చేసేలా మా సినిమా ఉంటుందని నమ్మకంగా ఉన్నాం. ఇక లోఫర్, ఫిదా చిత్రాలకు ముందు ఈ కథ విన్నాను. కథ నచ్చింది. నా మనసుకు దగ్గరైన కథ ఇది. దర్శకుడు వెంకీ అట్లూరి నా కోసం ఎదురుచూసి ఈ సినిమాను తెరకెక్కించాడు. ప్రేమ కథకు మంచి సంగీతం, మంచి కెమెరావర్క్ ఉండాలి. తమన్ మంచి మ్యూజిక్, జార్జ్ మంచి విజువల్స్ అందించారు. వర్ష అనే క్యారెక్టర్‌కు రాశీఖన్నా తన నటనతో న్యాయం చేసింది''అని అన్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ ''నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నన్ను నమ్మిన వ్యక్తి, ఇండస్ట్రీ నన్ను నమ్మేలా చేసిన వ్యక్తి దిల్‌రాజు. ఇక వరుణ్ విషయానికొస్తే నేను నమ్మకాన్ని కోల్పోతున్న తరుణంలో ఆరు అడుగుల నాలుగు అంగుళాల ధైర్యాన్నిచ్చాడు. తర్వాత నా నమ్మకానికి ఊపిరి పోసిన వ్యక్తి బాపినీడు. తమన్, శ్రీమణిని మంచి పాటల కోసం ఇబ్బంది పెట్టాను. ఇప్పటివరకు రాశీని గ్లామర్ క్వీన్‌గా చూసిన ప్రేక్షకులకు ఈ సినిమాలో పర్‌ఫార్మెన్స్‌తో ఆకట్టుకునే రాశిఖన్నా కనపడుతుంది'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమన్, సీనియర్ నరేష్, రాశీఖన్నా, ప్రియదర్శితో పాటు చిత్ర బృందం పాల్గొంది.

పెళ్లి బహుమతుల వేలం

ఎవరైనా పెళ్లికి వచ్చిన బహుమతుల్ని అపురూపంగా భావిస్తారు. వాటిలో ప్రత్యేకమైన వాటిని ఎంచుకొని భద్రంగా దాచుకుంటారు. ముఖ్యంగా సెలబ్రిటీలు ప్రత్యేక సందర్భాల్లో వచ్చిన బహుమతుల్ని ప్రత్యేకంగా చూసుకుంటారు. కానీ సమంత మాత్రం తన పెళ్లికి వచ్చిన బహుమతుల్ని అమ్మేయాలని చూస్తోంది. ఆమెకు అలాంటి అవసరం ఎందుకు వచ్చింది అన్న సందేహం రావడం సహజం. అయితే సమంత ఈ పనిచేస్తోంది ఓ మంచి పని కోసం. హీరోయిన్‌గా తనకంటూ ఒక ఇమేజ్ వచ్చినప్పటి నుంచి సమంత 'ప్రత్యూష ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సేవా సంస్థ పెట్టి అభాగ్యుల్ని ఆదుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ ఫౌండేషన్ కోసం ఇప్పటికే ఆమె కొన్ని కోట్లు ఖర్చు చేసింది. ఈ సంస్థకు విరాళాలు అందించడం కోసం ఇప్పటికే రెండు సార్లు వేలంపాట కూడా నిర్వహించింది సమంత. తనతో పాటు కొందరు సెలబ్రిటీలకు సంబంధించిన వస్తువులు, దుస్తుల్ని ఆమె వేలం వేసి ఆ మొత్తాన్ని ఫౌండేషన్‌కు అందజేసింది. ఇదే తరహాలో తన పెళ్లికి వచ్చిన బహుమతుల్లో కొన్నింటిని సమంత వేలం వేయబోతోందట. ఇందుకు ఆమె భర్త నాగచైతన్య, మామయ్య నాగార్జునల అనుమతి కూడా తీసుకుందట. వాళ్లు సంతోషంగా ఇందుకు అంగీకరించారట. త్వరలోనే వేలం పాట జరుగనుంది. ఇలా తన పెళ్లి బహుమతుల్ని కూడా సేవా కార్యక్రమాలకు వినియోగించాలన్న సమంత ఆలోచనను అభినందించాల్సిందే.



సమంత, నాగచైతన్య

ఫిబ్రవరి 16న 'మనసుకు నచ్చింది'



అమైరా దస్తూర్, సందీప్ కిషన్

ఆనంది ఆర్ట్ క్రియేషన్స్‌ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్‌కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం ద్వారా మంజుల ఘట్టమనేని దర్శకురాలిగా పరిచయమవుతోంది. ఈ చిత్రం ఇటీవల సెన్సార్ పూర్తిచేసుకొని యు/ఎ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఫిబ్రవరి 16న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ''విడుదలైన పోస్టర్లు, ట్రైలర్, టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. ఫ్రెష్, రొమాంటిక్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా 'మనసుకు నచ్చింది' చిత్రం తెరకెక్కింది. సెన్సార్ పూర్తిచేసుకున్న చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్ వచ్చింది. రాధన్ మ్యూజిక్ సినిమాకు హైలైట్‌గా ఉంటుంది. ప్రేక్షకులకు ఒక మంచి సినిమా చూశామనే భావన కలిగించే చిత్రమిది''అని అన్నారు. ప్రియదర్శి, పునర్నవి భూపాలం, నాజర్, అరుణ్ అదిత్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః రవి యాదవ్, మాటలుః సాయిమాధవ్ బుర్రా, ఎడిటర్ః సతీష్ సూర్య, ఆర్ట్ః హరివర్మ.

ఉల్లాసంగా... ఉత్సాహంగా ఫిలింఫేర్ అవార్డుల వేడుక

- ఉత్తమ చిత్రంగా 'హిందీ మీడియం'
- ఉత్తమ నటుడు ఇర్ఫాన్ ఖాన్
- ఉత్తమ నటిగా విద్యాబాలన్



ఇర్ఫాన్‌ఖాన్



విద్యాబాలన్

బాలీవుడ్ తారల తళుకుబెళుకుల మధ్య 63వ జియో ఫిలింఫేర్ అవార్డ్స్2018 కన్నుల పండువగా కొనసాగింది. అందాల భామల మెరుపుల మధ్య ఈ అవార్డుల వేడుక ఆద్యంతం ఉల్లాసంగా... ఉత్సాహంగా కొనసాగింది. ముంబయ్ వర్లీలోని ఎన్ఎస్‌సిఐ డోమ్‌లో ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక హుషారుగా జరిగింది. ఈ వేడుకలో ఉత్తమ చిత్రంగా 'హిందీ మీడియం' సినిమాకు ఫిలింఫేర్ అవార్డు దక్కగా ఇందులో నటించిన ఇర్ఫాన్‌ఖాన్ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నాడు. 'తుమారీ సూలు' చిత్రానికిగాను విద్యాబాలన్‌కు ఉత్తమ నటిగా, 'బరేలీ కీ బర్ఫీ' చిత్రానికిగాను ఉత్తమ దర్శకుడిగా అశ్విని అయ్యర్ తివారి అవార్డులను అందుకున్నారు. క్రిటిక్స్ బెస్ట్ ఫిల్మ్ అవార్డు 'న్యూటన్' సినిమాకు వచ్చింది. ప్రీతమ్ సంగీతాన్ని అందించిన 'జగ్గా జాసూస్' చిత్రానికి బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్ అవార్డు రాగా... బెస్ట్ ప్లేబ్యాక్ సింగర్‌లుగా అర్జిత్ సింగ్ (బద్రినాథ్‌కి దుల్హనియా), మేఘనా మిశ్రా (సీక్రెట్ సూపర్‌స్టార్) అవార్డులు అందుకున్నారు. మాలాసిన్హా, బప్పిలహరిలకు ఫిలింఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు దక్కాయి. ఈ వేడుకలో మిస్ వరల్డ్ మానుషి చిల్లర్ రెడ్ గౌన్‌లో మెరిసి ఆహుతులను మైమరపించింది. బాలీవుడ్ స్టార్లు షారుఖ్‌ఖాన్, రణవీర్ సింగ్‌లతో కలిసి ఆమె స్టేజ్‌పై స్టెప్పులు వేసి అలరించింది. అలాగే హాట్ బ్యూటీ సన్నీలియాన్ పలు హిట్ సాంగ్స్‌కు అనుగుణంగా హుషారుగా డ్యాన్స్‌చేసి మురిపించింది. షారుఖ్‌ఖాన్, అక్షయ్‌కుమార్, పరిణితిచోప్రాతో పాటు పలువురు స్టార్ల లైవ్ డ్యాన్స్‌లు ఈ అవార్డుల వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



సన్నీలియోన్



రణవీర్‌సింగ్



మానుషి చిల్లర్



షారుఖ్‌ఖాన్

మగవారెవరూ మహిళలకు సాయం చేయరు



తాప్సీ

పురుషాధిక్య సమాజంలో స్త్రీల పరిస్థితి అధ్వాన్నంగా ఉంటోందని అందాల తార తాప్సీ ఆవేదన వ్యక్తంచేసింది. మగవారికి ధీటుగా మహిళలు రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొంది. ప్రస్తుతం సౌత్‌లో పెద్దగా అవకాశాల్లేని తాప్సీ ఇప్పుడు బాలీవుడ్‌లో మంచి హిట్స్‌ను అందుకుంటోంది. ప్రస్తుతం బాలీవుడ్‌నే నమ్ముకున్న తాప్సీ సౌత్‌పై పెద్దగా దృష్టిపెట్టడం లేదు. ఇక నేడు సమాజంలో మహిళల పరిస్థితి గురించి ఆమె మాట్లాడుతూ ''ఏ దేశంలోనైనా పురుషాధిక్యత కనిపిస్తుంది. మనదేశంలోనైతే పురుషాధిక్యత మరీ ఎక్కువగా కనిపిస్తుంది. ఈ పరిస్థితుల్లో స్త్రీల జీవనం ఇబ్బందికరంగా మారుతోంది. నేడు సమాజంలో మగవారెవరూ మహిళలకు సాయం చేయరు. తమకు తామే స్త్రీలు సాయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక నేను నటిగా పంజాబీ చిత్రాలతో పరిచయమైనా ఆతర్వాత తమిళ్, తెలుగు భాషా చిత్రాలతో ప్రాచుర్యం పొందాను. ప్రస్తుతం హిందీలో హీరోయిన్‌గా మంచి పాపులారిటీని తెచ్చుకున్నా''అని తాప్సీ పేర్కొంది.


ఆ షాక్ ఆశ్చర్యానికి గురిచేసింది



శృతిహాసన్

విశ్వ నటుడు కమల్‌హాసన్ ముద్దుల కూతురు శృతిహాసన్ తండ్రికి తగ్గ తనయురాలిగా చిత్ర పరిశ్రమలో రాణిస్తోంది. గ్లామరస్ తారగా ఆమె తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది. ''నాన్న నాకు షాకులివ్వడం కొత్తేం కాదు. నా ప్రతి పుట్టినరోజుకు ఏదో ఒక షాక్ ఇస్తూనే ఉంటారు. నిజానికి అవన్నీ స్వీట్ షాక్స్. కానీ ఇటీవల నాన్న ఇచ్చిన షాక్ మాత్రం నన్ను నిజంగా ఆశ్చర్యానికి గురిచేసింది''అని శృతిహాసన్ పేర్కొంది. ఇంతకీ శృతిహాసన్‌కు కమల్ ఇచ్చిన షాక్ ఏంటో తెలుసా. అతను రాజకీయాల్లోకి రావడమే ఆ షాక్. తన కూతురికి ఒక్కమాట కూడా చెప్పకుండా తన రాజకీయ రంగప్రవేశం గురించి ప్రకటన చేశాడు కమల్. ఈ విషయం తెలుసుకున్న శృతిహాసన్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యిందట. ''ప్రతి విషయాన్ని నేను, మా నాన్న చర్చించుకుంటాం. మా చర్చల్లో అప్పుడప్పుడు రాజకీయ విషయాలు కూడా వస్తుంటాయి. కానీ ఇంత అకస్మాత్తుగా నాన్న ఇలా రాజకీయాల్లోకి వెళ్తారని అస్సలు ఊహించలేదు''అని శృతి చెప్పింది. ఏ రంగంలో ఉన్నా నాన్న నంబర్ వన్ అవుతారని, రాజకీయాల్లో కూడా ఇలాగే రాణిస్తారనే నమ్మకం తనకుందని ఆమె పేర్కొంది.

మన తెలంగాణ
9
హైదరాబాద్
సోమవారం
22, జనవరి 2018
www.manatelangana.news



బడ్జెట్‌లో ద్రవ్య లోటును జైట్లీ అరికట్టాలి

న్యూఢిల్లీ: ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకునేందుకు రానున్న బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ కృషి చేయాలని, కేంద్ర పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకోవాలని అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త టి.ఎన్.శ్రీనివాసన్ సూచించారు. ఆయన యేల్ యూనివర్సిటీలో ఆర్థిక ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పెద్ద నోట్ల రద్దుకు, ఉద్యోగాలు కోల్పోడానికీ, వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) అమలుకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. 'నిర్దేశించుకున్న ద్రవ్యలోటు లక్ష్యానికి వీలైనంత దగ్గరగా జైట్లీ చేరతారని భావిస్తున్నా. అంతేకాకుండా మరిన్ని పథకాలను సరైన సమయంలో అమలు చేస్తారని అనుకుంటున్నా' అని ఆయన చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్థూల జాతీయోత్పత్తి(జిడిపి)లో ద్రవ్యలోటు 3.2శాతం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వీలైనంత వరకు ద్రవ్యలోటును పూడ్చేందుకు యత్నించాలని కోరారు. ఇదిలా ఉండగా 2018–19 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. నోట్ల రద్దు, వస్తు,సేవల పన్ను అమలుతో ఉద్యోగాలు కోల్పోవడంపై ఆందోళనను వ్యక్తం చేస్తూ అడిగిన ప్రశ్నకు ఆయన ప్రతిస్పందిస్తూ ' ఆ రెండింటిని ముడిపెట్టే ఆర్థిక సిద్ధాంతం ఏది లేదు' అన్నారు. ఆయన ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్‌కు బోధించిన ప్రొఫెసర్.

ఉల్లి కనీస ఎగుమతి ధర తగ్గింపు



న్యూఢిల్లీ: ఉల్లి కనీస ఎగుమతి ధరను(ఎంఇపి) టన్నుకు 150 అమెరికా డాలర్లకు ప్రభుత్వం తగ్గించింది. ఈ కనీస ధర కంటే తక్కువ ధరకు ఉల్లిని ఎగుమతి చేసేందుకు అనుమతించరు. కనీస ఎగుమతి ధరను నవంబరులో టన్నుకు 850 డాలర్ల నుంచి 700 డాలర్లకు తగ్గించారని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. జనవరి 20 వరకు కనీస ఎగుమతి ధరగా 850 డాలర్లే అన్వయించారు. ఫిబ్రవరి 20 వరకు కనీస ఎగుమతి ధర 700 డాలర్ల లెక్కన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌సి)పైనే ఉల్లిని ఎగుమతికి అనుమతిస్తారని వాణిజ్య మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. వినియోగదారుల వ్యవహారాల శాఖ ధర పర్యవేక్షణ విభాగం ప్రకారం అనేక నగరాల్లో ఉల్లి చిల్లర ధర కిలోకు రూ. 40 గా ఉంది. భారత్ ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జులై మధ్య కాలంలో 10 లక్షల 20 వేల టన్నులను ఎగుమతి చేసింది. గత ఏడాదితో పోల్చినప్పుడు ఎగుమతి 56 శాతం పెరిగింది. సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో నాణ్యమైన ఉల్లి ఎగుమతి కావడంతో సరఫరా బాగా తగ్గిపోయింది. ఖరీఫ్ సీజనులోనే 40 శాతం మేరకు ఉల్లిని ఉత్పత్తి చేస్తారు. మిగతాది రబీ సీజనులో ఉత్పత్తి చేస్తారు. అయితే ఖరీఫ్ పంటను నిల్వ చేయడం సాధ్యపడదు. ఉల్లిని అత్యధికంగా మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్, గుజరాత్ రాష్ట్రాలు ఉత్పత్తి చేస్తున్నాయి.

నెయిల్ పాలిష్ ధర కోటి రూపాయలా?



వాషింగ్టన్: అమెరికాకు చెందిన ఓ సంస్థ తయారు చేసిన నెయిల్ పాలిష్ ధర తెలిస్తే అవక్కైపోతారు. అదె ంతో తెలుసా... అక్షరాల కోటి రూపాయలు. ఈ ధర విన్న వాళ్లు వామ్మో అంటూ నోళ్లు తెరుస్తున్నారట. త్వరలో మార్కెట్లోకి రానున్న ఈ నెయిల్ పాలిష్ ధర అక్షరాల 1 కోటి 63 లక్షల 66వేల రూపాయలు. లాస్ ఏంజెల్స్‌కు చెందిన అజాతురె అనే కంపెనీ దీన్ని తయారు చేసింది. మరీ ఇంత ధర ఎందుకో తెలుసా..? 267 క్యారెట్ల బ్లాక్ డైమండ్ తో దీన్ని తయారు చేశారు. వచ్చే నెల దీన్ని మార్కెట్లో ప్రవేశపెట్టనున్నారు. సంపన్న వర్గాల కోసం ప్రత్యేకంగా ఈ నెయిల్ పాలిష్ తయారుచేసిందీ కంపెనీ. ప్రపంచంలోనే ఖరీదైన గోళ్ల రంగు ఇది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనేడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28840	30844.92	0.28%
ముంబై	29510	31561.50	0.41%
ఢిల్లీ	28950	30962.57	0%
కోల్‌కతా	29490	31540.11	0.07%
కేరళ	27850	29786.10	0.36%
బెంగళూరు	28230	30192.51	0.46%
హైదరాబాద్	28840	30844.92	0.66%
గల్ఫ్	1421.2	1520.00	0%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	41900.00	42000.00	–0.24
ముంబై	41900.00	42000.00	–0.24
ఢిల్లీ	41900.00	42000.00	–0.24
కోల్‌కతా	41900.00	42000.00	–0.24
హైదరాబాద్	41900.00	42000.00	–0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	402	విశాఖపట్నం	412
వరంగల్	404	చిత్తూరు	403
విజయవాడ	412	చెన్నై	410
గోదావరి	412	బెంగళూరు	405

మొండి బాకీలు అమ్మేందుకు అమెరికా తరహా ఆన్‌లైన్ వేదిక




ముంబయి: అమెరికా తరహాలో మొండి బాకీలను విక్రయించే ఆన్‌లైన్ ట్రేడింగ్ వేదికను ఏర్పాటు చేయాలని భారత రిజర్వు బ్యాంకు తెలిపింది. మొండి బాకీలకు చెందిన ఆస్తులను విక్రయించడంలో పారదర్శకతకు, మంచి ధర రాబట్టేందుకు ఇది అవసరమని పేర్కొంది. దేశీయ బ్యాంకింగ్ విధానాన్ని మొండి బాకీలు సతమతం చేస్తున్నాయని, మొండిబాకీలను అమ్మేందుకు సంబంధిత పక్షాలు ఒక్కటై తగిన యంత్రాంగాన్ని రూపొందించాలని, ఆన్ ట్రేడింగ్ వేదికను ఏర్పాటు చేయాలని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ వైరల్ ఆచార్య అన్నారు. 2017 సెప్టెంబర్ త్రైమాసికం నాటికి బ్యాంకుల మొండి బాకీల మొత్తం రూ. 10 లక్షల కోట్లకు చేరింది. మొండి బాకీలు పేరుకుపోతున్న క్రమంలో గత జూన్ నుంచి 40 అతి పెద్ద మొండి బకాయిదారలను గుర్తించి వారిని వివిధ డెట్ రికవరీ ట్రిబ్యునల్స్‌కు నివేదించాలని సూచించింది. 10 లక్షల కోట్ల మొండి బకాయిల్లో ఈ 40 ఖాతాలే రూ. 4 లక్షల కోట్ల మేరకు ఉన్నాయి. ఈ 40 ఖాతాల్లో ఎస్సార్ స్టీల్, భూషణ్ పవర్, ఆమ్టెక్ ఆటో, విడియోకాన్ ఇండస్ట్రీస్, జెపి ఇన్‌ఫ్రా, తదితరాలు ఉన్నాయి. ఇటీవల విడుదల చేసిన ఆర్థిక స్థిరత్వ నివేదికలో ఆర్‌బిఐ బ్యాంకుల నిరర్థక ఆస్తులు ఈ ఏడాది మార్చి నాటికి 10.8 శాతం, సెప్టెంబర్ నాటికి 11 శాతానికి పెరుగుతాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలో భారతీయ బ్యాంకుల సంఘం, అసోసియేషన్ ఆఫ్ అసెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీస్(ఆర్కాన్), క్రెడిట్ రేటింగ్ సంస్థలు ఏకమై అమెరికాలో ఉన్నటువంటి లోన్ సిండికేషన్ అండ్ ట్రేడింగ్ అసోసియేషన్(ఎల్ఎస్‌టిఎ)ను ఏర్పాటు చేయాలి' అని ఆచార్య అన్నారు. వారాంతంలో అసోచామ్ ఏర్పాటు చేసిన ఎఆర్‌సి సదస్సులో ఆయన ఈ విషయం చెప్పారు. మొండి బాకీలను తగ్గించుకునేందుకు బ్యాంకులు ప్రైమరీ మార్కెట్ లిక్విడిటీని ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

వినియోగదారులను కేంద్రం పిండేస్తోంది



న్యూఢిల్లీ: అధిక ఇంధన ధరలతో కేంద్రం వినియోగదారులను పిండుకు తింటోందని మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం ఆదివారం అన్నారు. మోడీ ప్రభుత్వం వినియోగదారులకు వ్యతిరేకంగా మారిందన్నారు. పెట్రోలియం ఉత్పత్తులను వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి) పరిధిలోకి తేవాలని కూడా ఆయన కోరారు. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పిసిఎల్)లో ప్రభుత్వ వాటాలను ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఒఎన్‌జిసి) కొనుగోలు చేయడాన్ని చిదంబరం తన ట్వీట్‌లో ప్రశ్నించారు. అది ద్రవ్యలోటుపై ప్రభావం చూపుతుందని కూడా అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు గరిష్ఠ స్థాయికి చేరాయి. ప్రభుత్వం వినియోగదారులను పిండేస్తోంది. ఇది వినియోగదారులకు వ్యతిరేక వైఖరి అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తెచ్చి ప్రభుత్వం వినియోగదారులకు ఉపశమనం ఇవ్వాలని ఆయన కోరారు. ఒఎన్‌జిసి చర్యపై చిదంబరం ప్రతిస్పందిస్తూ ' ప్రభుత్వం రూ. 30,000 కోట్ల అప్పులకు కోత వేస్తోంది. కానీ హెచ్‌పిసిఎల్ వాటాలు కొనుగోలు చేయడానికి ఒఎన్‌జిసి రూ. 30,000 కోట్లను ప్రభుత్వానికి ఇవ్వడానికి అప్పు చేస్తుంది. అంటే ఇది ఒకే రకం ప్రభావం అనే చెప్పాలి' అని ఆయన వివరించారు.

భావనపాడు రేవు అభివృద్ధికి అదానీ ఎంపిక



అమరావతి: శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు రేవు ప్రాజెక్టు అభివృద్ధికి వేలం పాడిన ఒకే బిడ్డర్ అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంపిక చేసింది. శనివారం రాత్రి సమావేశమైన రాష్ట్ర క్యాబినెట్ ఈ మేరకు ఆమోదం తెలిపింది. భావనపాడును పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిఓ అభివృద్ధి చేయనున్నారని అధికార ప్రకటన పేర్కొంది. షిప్పింగ్ మంత్రిత్వ శాఖ తరపున నితిన్ గడ్కరీ 2015 డిసెంబర్‌లో ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకు విశాఖపట్నం రేవుకు శాటిలైట్ పోర్ట్‌గా భావనపాడును అభివృద్ధి చేస్తామని ఓపెన్ ఆఫర్ ప్రకటించారు. అందుకు రాష్ట్రానికి 26 శాతం వాటాను విస్తరిస్తామని కూడా హామీ ఇచ్చారు. అదనీ తొలి 30 ఏళ్లకు 2.3 శాతం ఆదాయం వాటాను ఇవ్వడానికి ఒప్పుకున్నట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'కేంద్ర మంత్రి ఇస్తానన్న 26 శాతం ఈక్విటీయే కాని ఆదాయ వాటా కాదు' అని ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆహ్వానించిన టెండర్‌కు అదనీ, నవయుగ, గంగావరం పోర్ట్ ...ముగ్గురు బిడ్డర్లు ప్రతిస్పందించారు. అయితే తర్వాత నవయుగ, గంగావరం ఉపసంహరించుకోగా అదనీ ఏకైక బిడ్డరుగా నిలిచారు. మొదట అదనీ 0.5 శాతం రెవెన్యూ షేర్‌నే ఇస్తానన్నది. కానీ అనేక రౌండ్ల చర్చల తర్వాత దానిని 2.3 శాతానికి పెంచింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

విశాఖపట్నంకు 120 కిమీ. దూరంలో భావనపాడు ఉంది. విశాఖపట్నం రేవుకు శాటిలైట్ రేవుగా భావనపాడును అభివృద్ధి చేయడం ద్వారా పెద్ద ఎత్తున కార్గో రవాణా చేయవచ్చు. భావనపాడు ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2,050 ఎకరాలను గుర్తించింది. విశాఖపట్నం రేవు, గంగావరం రేవులు 50 శాతం సామర్థ్యంతోనే ప్రస్తుతం పనిచేస్తున్నాయి. భావనపాడుకు 150 కిమీ. దూరంలో ఒడిశాలోని గోపాల్‌పూర్ రేవు ఉంది. భావనపాడు రేవు ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి ఐదు నుంచి ఏడేళ్లు పట్టవచ్చని అదనీ గ్రూపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సూచించింది.

చైనాను అధిగమిస్తున్న భారత్

ప్రపంచంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న ఐదో ఆర్థిక వ్యవస్థగా అవతరణ



న్యూఢిల్లీ: చైనాను అధిగమించి భారత్ 2018లో అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నది. దేశీయ ఈక్విటీ మార్కెటు ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద మార్కెట్‌గా అవతరించబోతున్నదని సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ నివేదిక పేర్కొంది. వ్యవస్థీకృత మార్పులు లేకుండా మిగతా దేశాలన్నీ తక్కువ వృద్ధిని నమోదు చేస్తుంటే దానికి భిన్నంగా భారత్ మాత్రం ఆర్థిక సంస్కరణలతో దీర్ఘకాలిక వృద్ధిలో దూసుకుపోతోందని తెలిపింది. 'చైనాను దాటేసి భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. ప్రపంచంలో ఐదో స్థానానికి భారతీయ ఈక్విటీ మార్కెట్ ఎగబాకనుంది' అని ఆ నివేదిక పేర్కొంది. మిగతా అభివృద్ధి చెందుతున్న దేశాలు 2 నుంచి 3 శాతం ఆర్థిక వృద్ధిని సాధిస్తుంటే, భారత్ మాత్రం 7.5 శాతం వృద్ధిపై దృష్టి పెట్టిందని పేర్కొంది. చైనాలో వృద్ధి రేటు మందగిస్తుండగా, భారత్ వృద్ధి రేటు మాత్రం అనుకూలంగా ఉంది. అయితే పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం ప్రభా వం మార్కెట్‌పై తప్పక ఉంటుందని కూడా సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ నివేదిక పేర్కొంది. భారత ఈక్విటీ మార్కెట్ 6 నుంచి 8 శాతం కన్నా ఎక్కువ రాబడులు అందిస్తాయని వెల్లడించింది.

'నిఫ్టీ 50 గరిష్ఠ స్థాయిలో కొనసాగుతున్నది. స్థూలంగా దాన్ని దృష్టిలో పెట్టుకుని చూసినట్లయితే



10,490 నుంచి 10,580 పాయింట్ల వద్ద నిలదొక్కుకుంటే కొన్ని రోజులకే 11,200 నుంచి 11,500 పాయింట్ల పరిధిలో ర్యాలీ కొనసాగొచ్చని పేర్కొంది. దేశీయ మదుపరులు ఈక్విటీ కొనుగోళ్లు అధికంగా చేపడుతున్నారు.2017లో దేశీయ మ్యూచువల్ ఫండ్లు 1500 కోట్ల 30 లక్షల డాలర్ల మేరకు ఈక్విటీలను కొనుగోలు చేశాయి. కాగా విదే శీ మదుపరులు 800 కోట్ల డాలర్ల మేరకు ఈక్విటీలు కొనగోలు చేశారు. దేశీయంగా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ముఖచిత్రమే మారిపోనుందని, ఆధార్, జన్‌ధన్, పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను వంటి ఆర్థిక సంస్కరణలు భారత్‌లో కొత్త మౌ లిక విధానాన్ని సృష్టించబోతున్నాయని ఆ నివేదిక తెలిపింది. 'వేగంగా అభివృద్ధి చెందుతున్న భార త్ ఆర్థిక వ్యవస్థలో నేడు మదుపరులు కీలక పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవలసి వస్తోంది. వైవిధ్యభరిత ఎంపికల్లో వారు నిర్ణయాలు తీసుకోవలసి ఉంది' అని సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ సిఇఒ శివ గుప్తా చెప్పారు.

జిఎస్‌టిఆర్–3బి దాఖలు గడువు పొడగింపు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను రిటర్ను(జిఎస్‌టిఆర్) 3బి దాఖలు గడువును రెవెన్యూ శాఖ ఆదివారం రెండు రోజులు పెంచి జనవరి 22గా నిర్ణయించింది. జిఎస్‌టిఆర్–3బి అనేది ఎక్సయిజ్ , కస్టమ్స్ కేంద్ర బోర్డు(సిబిఇసి) ప్రవేశపెట్టిన సులభతర పన్ను రిటర్ను ఫారమ్. ఇది డీలర్లు ప్రతి నెల దాఖలు చేయాల్సిన రిటర్ను. జులై 1 నుంచి అమలులోకి వచ్చిన వస్తు, సేవల పన్ను(జిఎస్‌టి)కి సంబంధించినది. ముఖ్యంగా ఇది ఇన్‌వార్డ్, అవుట్‌వార్డ్ సప్లయిస్ వివరాలు తెలుపేదిగా ఉంటుంది. జిఎస్‌టిఆర్–3బి దాఖలు చేసే గడువు ఇదివరలో జనవరి 20గా నిర్ధారించారు. కానీ దీన్ని ఇప్పుడు రెండు రోజులు పెంచారు. 2017 డిసెంబర్‌కు సంబంధించిన జిఎస్‌టిఆర్–3బి రిటర్ను ఫారమ్‌ను 2018 జనవరి 22కల్లా దాఖలు చేయాల్సి ఉంటుందని సిబిఇసి ట్వీట్ చేసింది. సిబిఇసి ఇప్పటికే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల రిటర్ను దాఖలు తేదీలను ప్రకటించింది. జిఎస్‌టి కింద నమోదైన ప్రతి డీలరు తప్పనిసరి జిఎస్‌టిఆర్–3బిని దాఖలు చేయాల్సి ఉంటుంది.



తదుపరి స్పెక్ట్రం వేలంలో విశాల దృక్పథం

ట్రాయ్ నివేదిక కోసం ఎదురుచూస్తున్న టెలికామ్ శాఖ



న్యూఢిల్లీ: తదుపరి స్పెక్ట్రమ్ వేలం సమయం విషయంలో టెలికామ్ శాఖ విశాల దృక్పథంతో ఉందని, ఓ అభిప్రాయానికి వచ్చేలోగా టెలికామ్ రెగ్యులేటర్ ఆథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) నివేదిక కోసం వేచిచూస్తోందని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. స్పెక్ట్రమ్ వేలం విషయంలో టెలికామ్‌లతో గత వారం ట్రాయ్ విస్తృతంగా చర్చలు జరిపింది. లాభాలు తగ్గిపోతున్న, అధిక పన్నుల నేపథ్యంలో ఒత్తిడికి గురవుతున్న అనేక టెలికామ్ కంపెనీలు వేలాన్ని వ్యతిరేకిస్తున్నాయి. బ్యాండ్స్ తర్వాత ఎక్కువగా కోరుకునే రేడియోవేవ్స్‌కు డిమాండ్ పెరిగింది. వీటి కోసం అనేక టెలికామ్‌లు వేలంలో పాల్గొంటాయని టెలికామ్ సెక్రటరీ అరుణా సుందర రాజన్ తెలిపారు. 'మేము ట్రాయ్ నివేదిక కోసం వేచి చూస్తాం. వారిచ్చే సిఫార్సులను అనుసరిస్తాం. వారు టెలికామ్ పరిశ్రమతో చర్చించాక మాకు ఏ విషయం చెబుతారు. ఎవరు ఏ మేరకు బ్యాండ్స్ కోరుతున్నారు. ఎంత మంది వేలంలో పాల్గొంటారు వంటివి వారు మాకు చెబుతారు. అందుకే ట్రాయ్ ఇచ్చే సమాచారం కోసం మేము వేచి ఉన్నాం ' అని అరుణ తెలిపారు. ఇదిలా ఉండగా సిఫార్సులను వీలయినంత త్వరగా ఇస్తామని ట్రాయ్ ఛైర్మన్ ఆర్.ఎస్. శర్మ తెలిపారు. తదుపరి స్పెక్ట్రం వేలం ఎప్పుడన్నది ఇంకా నిర్ధారించలేదు. ఇదివరలో 2016లో స్పెక్ట్రం వేలం జరిగింది. అందులో రూ. 5.6 లక్షల కోట్లు వస్తాయని అంచనా వేయగా రూ. 65,789 కోట్ల మేరకే రేడియోవేవ్స్ అమ్ముడుపోయాయి.

4జి బ్యాండ్లు సహా 60 శాతం రేడియోవేవ్స్ అమ్ముడుకాలేదు. తదుపరి స్పెక్ట్రం వేలంలో 700, 800, 900, 1800, 2100, 2300, 2500 మెగాహెడ్జ్‌లు అంతకు మించిన బ్యాండ్లు వేలం వేయనున్నారు. ప్రస్తుత ఆర్థిక గడ్డు పరిస్థితిలో వేలం సమయ నిర్ధారణ విషయంలో విశాల దృక్పథంతో వ్యవహరించాలని అనేక టెలికామ్ కంపెనీలు చర్చల సందర్భంగా ట్రాయ్‌కు విన్నవించుకున్నాయి. వేలంలో పాల్గొనేందుకు వీలుగా రిజర్వు ధరలను కూడా తగ్గించాలని కోరాయి.

ఎన్‌ఆర్‌ఐ వధువులపై ఐసిఎస్ఎస్‌ఆర్ పరిశోధన

న్యూఢిల్లీ: దేశంలోని ఎన్‌ఆర్‌ఐ వధువులపై పరిశోధన చేయాలని మానవ వనరుల మంత్రిత్వశాఖకు చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్(ఐసిఎస్ఎస్‌ఆర్) యోచిస్తోంది. ఎన్‌ఆర్‌ఐ పురుషులు తమ మాతృదేశానికి వచ్చి పెళ్లి చేసుకోవడం పాత పద్ధతే అయినా, అన్ని వివాహాలు విజయవంతం కావడం లేదు. వధువులను ఇక్కడే వదిలి వెళ్లిన ఉదంతాలు అనేకం ఉన్నాయని, ఎన్‌ఆర్‌ఐలు తమ వివరాలను సైతం తారుమారు చేస్తున్నారని ఐసిఎస్ఎస్‌ఆర్ ఛైర్మన్ బిబి కుమార్ మీడియాకు తెలిపారు. దేశంలో ఇలాంటి పెళ్లిళ్లు ఎన్ని జరుగుతున్నాయి, కొన్నేళ్ల తర్వాత వధువుల పరిస్థితి ఏంటి, వధువులు ఎందుకు మోసపోతున్నారు, కఠిన నిబంధనలు అవసరమా తదితర అంశాలపై అధ్యయనం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఇందుకు సంబంధించి రీసెర్చ్ ప్రాజెక్టు ఇంకా మంజూరు కాలేదని కుమార్ తెలిపారు. ఈ అంశంపై ఒకసారి అధ్యయనం జరిగిన తర్వాత ప్రాథమిక సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. ఎన్‌ఆర్‌ఐ వరులను తల్లిదండ్రులు ఎందుకు ఇష్టపడుతున్నారు, అన్ని వివరాలను పరిగణలోకి తీసుకుంటున్నారా లేదా తదితర అంశాలను అధ్యయనం చేయనున్నట్లు ఆయన తెలిపారు.



బస్తర్‌లో టూరిజం పోలీసింగ్!

● మావోయిస్టుల కోటలో పోలీసుల సరికొత్త విధానం ● విజయవంతమైతే ఏడు జిల్లాలకు విస్తరణ

రాయ్‌పూర్ : నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో పోలీసులు 'టూరిజం పోలీసింగ్'తో పర్యాటకులకు చేయూతనందించనున్నారు. బస్తర్ ప్రాంతంపై ఇటు దేశంలోను, అటు ప్రపంచ వ్యాప్తంగాను సానుకూల ధోరణిని పెంపొందించాలన్న లక్ష్యంతో ఈ కొత్త విధానాన్ని ఎంచుకున్నారు. టూరిజం పోలీసింగ్‌లో భాగంగా భద్రతా బలగాలు ఇక్కడికి వచ్చే పర్యాటకులకు అవసరమైన సమాచారాన్ని అందించడంతో పాటు, వారికి సహాయకారిగా వ్యవహరిస్తారు. ఇందుకోసం ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే, పోలీసులు టూరిస్ట్ గైడ్‌లుగా మాత్రం వ్యవహరించబోరని ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేయనున్న మొదటి హెల్ప్ డెస్క్‌కు 'బెస్ట్ కాప్' (ప్రజాహిత పోలీసుల ద్వారా బస్తర్‌లో భద్రతతో కూడిన మెరుగైన పర్యాటకం) అని నామకరణం చేశారు. దీన్ని రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన చిత్రకోట్ జలపాతం సమీపంలోని పోలీసు ఔట్‌పోస్టు వద్ద ఏర్పాటు చేయబోతున్నారు.


చిత్రకోట్ జలపాతం

భద్రతతో కూడిన, మెరుగైన పర్యాటకమే లక్ష్యం

'వచ్చేసారి మీరు బస్తర్‌లోని చిత్రకోట్ జలపాతం వద్దకు వస్తే మీకు అవసరమైన మార్గాలు, ప్రదేశాలు, రవాణా, ఇతర వసతుల గురించి తెలుసుకునేందుకు ఇక్కడ ఏర్పాటు చేసిన పోలీసు ఔట్ పోస్టు వద్దకు రండి' అని పోలీసు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (దక్షిణ బస్తర్ రేంజ్) పి.సుందర్‌రాజ్ అన్నారు. 'సందర్శకులకు అవసరమైన సమాచారాన్ని ఇచ్చి వారికి మార్గదర్శకం చేస్తాం. అయితే, పోలీసులు మాత్రం టూరిస్టు గైడ్‌లుగా వ్యవహరించరు. బస్తర్‌లో భద్రతతో కూడిన, మెరుగైన పర్యాటకాన్ని రూపొందించం, అతిథులు సౌకర్యవంతంగా ఫీల్ కావడమే మా లక్ష్యం' అని ఆయన వ్యాఖ్యానించారు. తాము చేస్తున్న ఈ ప్రయత్నం బస్తర్ ప్రాంతంపై ప్రజల్లో సానుకూల ధోరణిని పెంచుతుందని, ఇది జాతీయ స్థాయిలో మాత్రమే కాదు ప్రపంచం మొత్తంలో పెంపొందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రసిద్ధ బస్తర్ దసరా పండుగ, చిత్రకోట్, తిరథ్‌ఘర్ జలపాతం, కంగర్ లోయ, జాతీయ పార్కు వంటి పర్యాటక ప్రాంతాలు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. సందర్శకులు కొన్నిసార్లు స్థానికులతో మాట్లాడడానికి కాని లేదా పర్యాటక ప్రాంతాల గురించి వ్యాపారులను అడిగి సమాచారం, ఇతర వివరాలు తెలుసుకోవడానికి భాషాపరంగా అనేక ఇబ్బందులు పడుతుంటారని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో తాము ఈ సమస్యలను పరిష్కరించడానికి, సందర్శకుల్లో సానుకూల ధోరణిని మెరుగుపర్చడానికి ఈ 'టూరిజం పోలీసింగ్' అమలులోకి తెస్తున్నామని ఆయన వివరించారు. ఇందుకోసం 35 మంది పోలీసులకు కొద్ది రోజుల క్రితమే శిక్షణను ఇచ్చామని, ఇందులో మహిళా పోలీసులు కూడా ఉన్నారని అన్నారు. వీరందరికీ సమర్థ భావ వ్యక్తీకరణ, అనుకూల ధోరణి, మర్యాదపూర్వకమైన భాష వంటి అంశాల్లో తర్ఫీదునిచ్చామని చెప్పారు. హెల్ప్ డెస్క్‌లు సందర్శకులకు అవసరమైన రవాణా వసతులు, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలు, ఆసుపత్రులు తదితరాల సమాచారాన్ని అందిస్తాయని తెలిపారు. ప్రస్తుతానికి ప్రయోగాత్మకంగా మొదట చిత్రకోట్ జలపాతం సమీపంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని, ఇది విజయవంతమైన తర్వాత జిల్లాలోని పలు ప్రాంతాల్లో మరిన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. క్రమంగా బస్తర్ డివిజన్‌లోని ఏడు జిల్లాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాల్లో ఈ 'టూరిజం పోలీసింగ్'ను విస్తరించాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. ఇది ఆహ్వానించదగిన 'మంచి అడుగు' అని, ఇలాంటి ఆలోచన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా చేయాల్సివుందని చత్తీస్‌గఢ్ పర్యాటక శాఖ ఆకాంక్షించింది.

నక్సల్ ప్రభావిత ప్రాంతంలో ఇదే తొలిసారి

'టూరిజం పోలీసింగ్' విధానాన్ని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని, అయితే వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యుఇ) ప్రభావిత ప్రాంతంలో అమలు చేయడం ఇదే ప్రథమమని చత్తీస్‌గఢ్ టూరిజం బోర్డు వైస్ ఛైర్మన్ కేదార్ నాథ్ గుప్త అన్నారు. ప్రసిద్ధి చెందిన ఇతర పర్యాటక ప్రాంతాల్లోనూ దీన్ని అమలు చేయాలన్నారు. నక్సలైట్లు, హింస ...బస్తర్‌లోని పర్యాటక ప్రాంతాలపై ప్రభావాన్ని చూపుతున్నాయి కదా అని అడిగిన ప్రశ్నకు స్పందించిన ఆయన ...నక్సలైట్లు ఎప్పుడూ రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోలేదని చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో పోలీసుల భద్రత పటిష్టంగా ఉందని, అందువల్ల పర్యాటకులు ఎలాంటి సంకోచం లేకుండా హాయిగా సందర్శించవచ్చని ఆయన చెప్పారు.

అవసరమైతే విదేశీ భూభాగాల్లోనూ దాడిచేస్తాం



న్యూఢిల్లీ: శత్రువులపై భారత్ తన భూభాగంలోనే కాదు, అవసరమైతే విదేశీ భూభాగాల్లో దాడి చేస్తుందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. ఆదివారం 'భారతీయ రైల్వేమాల్ గోదాం శ్రామిక్ సంఘ్'ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. భారత్‌కు శక్తివంతమైన దేశంగా పేరుందని, శత్రువులపై తన భూభాగంలోనే కాదు, విదేశీభూభాగాల్లో దాడి చేస్తామనే సందేశాన్ని ప్రపంచానికి తెలిపాన్నారు. పాకిస్థాన్‌తో భారత్, స్నేహ సంబంధాలను కోరుకుంటున్నప్పటికీ, పాక్ తన పద్ధతులను మార్చుకోవడం లేదని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. భారత్ ఇతర దేశాల ముందు తలవంచబోదనే హామీ ఇస్తున్నానన్నారు. పూంచ్ సెక్టార్‌లో ఐదుగురు ఆర్మీ కమాండర్ల బృందం నియంత్రణ రేఖ దాటి ముగ్గురు పాకిస్థాన్ సైనికులను కాల్చిచంపిన నెల రోజుల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నలుగురు భారత సైనికులను చంపడానికి ప్రతికారంగా ఈ చర్యకు ఉపక్రమించింది.

పాక్ అదే వరస

జమ్మూ: నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్ వరుసగా నాలుగో రోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. కశ్మీర్‌లోని నౌషేరా, రాజౌరి, అఖ్నూర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దుల్లో పాక్ భారీగా కాల్పులకు తెగబడింది. పాక్ కాల్పుల్లో శనివారం రాత్రి తీవ్ర గాయాలతో జవాన్ మృతి చెందారు. దీంతో గురువారం నుంచి సరిహద్దుల్లో జరిగిన కాల్పుల్లో అమరులైన జవాన్‌ల సంఖ్య 11 మందికి చేరింది. ఆదివారం సాయంత్రం రాజౌరిలోని భవానీ, కరాలి, సెడ్, నంబ్, షేర్ మక్రి ప్రాంతాల్లో నియంత్రణ రేఖ వద్ద పాక్ పెద్ద ఎత్తున కాల్పులకు పాల్పడినట్లు డిసి షహీద్ ఇక్బాల్ చౌదరి తెలిపారు. పాక్ కాల్పులను భారత్ బలగాలు సమర్థంగా తిప్పికొటాయని అధికారులు తెలిపారు.

కేసుల కేటాయింపు
ఇక రోస్టర్ పద్ధతిలో..

సుప్రీం ప్రధాన న్యాయమూర్తి యోచన



న్యూఢిల్లీ : ప్రజాప్రయోజన వ్యాజ్యాలను న్యాయమూర్తులకు కేటాయింపులో పారదర్శకత పాటించడంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా దృష్టిని కేటాయించినట్టు తెలుస్తోంది. ఇందుకు గాను వివాదానికి సంబంధించిన వారి నుంచి వచ్చిన సలహాలను ఆయన పరిశీలిస్తున్నారని ఆయన సన్నిహిత వర్గాల ద్వారా తెలిసింది. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు జనవరి 12న మీడియా సమావేశంలో లేవనెత్తిన వివాదానికి సంబంధించి సిబిఐ ప్రత్యేక జడ్జి బిహెచ్ లోయా మృతిపై స్వతంత్ర విచారణ చేయాలని కోరుతూ దాఖలైన రెండు పిటిషన్లు సహా ఇతర అన్ని కేసుల కేటాయింపులపై ఆయన ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించారని సమాచారం. లోయా కేసు పిటిషన్లు సోమవారం విచారణకు రానున్నాయి. కాగా, దీపక్ మిశ్రా ఇప్పటికే ఇతర న్యాయమూర్తులతో చర్చలు జరిపారని, వారి సలహాలను ఆయన పరిగణలోకి తీసుకున్నారని, వీటిని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ) ఎదుట ఉంచనున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఇకపై కేసుల కేటాయింపును కచ్చితంగా రోస్టర్ పద్ధతిలో చేయాలని దీపక్ మిశ్రా యోచిస్తున్నారని ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో కేసుల కేటాయింపునకు అమలులో ఉన్న రోస్టర్ పద్ధతిని ఇక్కడ కూడా అమలు చేయాలని ఎస్‌సిబిఎ చేస్తున్నదని ఎస్‌సిబిఎ అధ్యక్షుడు వికాస్ సింగ్ తెలిపారు.

రాజ్యాంగం ఓ గొప్ప ప్రజా విధానం

బెంగళూరు : రాజ్యాంగం ఓ గొప్ప ప్రజా వి ధానమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె. చలమేశ్వర్ అన్నారు. దేశం కోసం స్వా తంత్ర్య సమర యోధులుగా అనేక త్యాగాలు చేసిన వారు రూపొందించిన అతిపెద్ద ప్రజాస్వామ్య విధానమైన భారత రాజ్యాంగాన్ని యువత గౌరవించాలని ఆయన సూచించారు.



ఆదివారం ఇక్కడ జరిగిన ఓ విద్యా సంస్థ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాసనసభ్యుల విజ్ఞానం, గొప్ప అనుభవం తదితరాలతో దేశానికి రాజకీయ భవిష్యత్‌ను అందించేందుకు అవసరమైన నిర్మాణం, స్పష్టమైన మార్గదర్శకాల ద్వారా రాజ్యాంగ ప్రతిష్టను మరింత పెంపొందించాలని అన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తుల్లో ఒకరైన చలమేశ్వర్ ఇటీవల ఏకంగా ప్రధాన న్యాయమూర్తిపై ఆరోపణలు చేసిన విషయం విదితమే. వచ్చిన డిమాండ్లు, సమయాలను బట్టి రాజ్యాంగానికి పలుమార్లు సవరణలు జరిగాయని అన్నారు.

కాంగ్రెస్‌తో జత కట్టొద్దు

సిపిఐ(ఎం) రాజకీయ తీర్మానం



న్యూఢిల్లీ : కాంగ్రెస్‌తో ఎలాంటి అవగాహన లేదా రాజకీయ ఒప్పందాలు చేసుకోరాదని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం మెజారిటీ ఓట్ల ద్వారా ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని ఆమోదించింది. అయితే, ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరుగనున్న సమావేశంలో పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. ఎన్నికల వ్యూహాలను ఎన్నికల సమయంలో ఆయా రాష్టాల శాఖలు తగు నిర్ణయం తీసుకుంటాయని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగిన పార్టీ సమావేశాలు ఆదివారం ఇక్కడ ముగిసాయి. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య, ప్రజాతంత్ర శక్తులన్నింటినీ ఏకం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. అనంతరం సీతారాం ఏచూరి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వాన్ని, దాని విధానాలను ఓడించడమే పార్టీ లక్ష్యమని ఆయన చెప్పారు. దాని అప్రజాస్వామిక దాడులు, అప్రజాస్వామిక విధానాలతో ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నదని విమర్శించారు.

గుజరాత్ ఫలితాలతో నైతిక స్థైర్యం

న్యూఢిల్లీ: గుజరాత్ ఎన్నికల ఫలితాలు బిజెపిని ఓడించగలమనే విశ్వాసం కాంగ్రెస్‌లో కలిగిందని, 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత అహ్మద్ పటేల్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ సొంత రాష్ట్రంలో 150 సీట్లు గెలుచుకుంటామని బిజెపి అనేకసార్లు చెప్పిందని, ఆ సంఖ్య 100కు పడి పోయిందన్నారు. మోడీ ఎన్నో గిమ్మిక్కులను ఉపయోగించారన్నారు. పాక్‌లో కొందరు పటేల్‌ను ముఖ్యమంత్రిని చేయాలనుకుంటున్నారని ఆరోపించినప్పటికీ ప్రజలు ఏకపక్షంగా వ్యవహరించలేదన్నారు. ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలోనే కాదు, దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాన్ని నింపాయని పటేల్ పేర్కొన్నారు.





హైదరాబాద్‌లోని కళాభారతి(ఎన్‌టిఆర్ స్టేడియం)లో జరుగుతున్న జాతీయ పుస్తక ప్రదర్శనకు పుస్తక ప్రియుల తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. పాఠశాల విద్యార్థులు కూడా భారీ ఎత్తున తరలివస్తున్నారు. ఈ నెల 28వరకు జరగనున్న బుక్ ఫెయిర్‌కు పాఠకుల నుంచి అమితాదరణ లభిస్తోందని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కాషాయమయమవుతోన్న యుపి

లక్నో: ఉత్తరప్రదేశ్ క్రమంగా కాషాయమయమవుతోంది. యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ముఖ్యమంత్రి కార్యాలయం, లక్నోలోని ఖ్వైసర్ బాగ్ పోలీస్ స్టేషన్‌కు, ఓ మసీదు ప్రహరీకి కాషాయ రంగును వేసి వివాదంలో ఇరుక్కుంది. అదే విధంగా ఒకేసారి 50 కాషాయ రంగుగల బస్సులను కూడా ప్రారంభించింది. తాజాగా శనివారం లక్నోలోని గోమతి నగర్‌లో పురపాలక సిబ్బంది అనేక పార్కులకు, డివైడర్లకు కాషాయరంగును వేశారు. గత ఏడాది మార్చి 19న యోగి ఆదిత్యనాథ్ అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రాన్ని కాషాయీకరణగా మార్చుతున్నారు. నాటి నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 100 పాథమిక పాఠశాలలకు, అనేక పోలీస్‌స్టేషన్లకు నారింజ రంగును అద్దింది. ముఖ్యమంత్రి కార్యాలయం, అధికారిక నివాసంలోని ఫర్నీచర్‌కు కాషాయ టవల్స్‌ను అమర్చారు. ప్రభుత్వ పథకాలను తెలిపే హోర్డింగ్‌లు, యోగి ప్రభుత్వం సాధించిన విజయాలను సూచించే హోర్డింగ్‌లను కూడా ముఖ్యమంత్రికి ఇష్టమైన కలర్‌లోనే ఏర్పాటు చేస్తున్నారు.

ప్లాంటులో పేలుడు : 4గురు మృతి

వడోదర : గుజరాత్ వడోదర నగర శివార్లలో ఉన్న ఓ రసాయన ప్లాంటులో ఆదివారం పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందారు. మరో 9 మంది గాయపడినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. జిఎస్‌పి క్రాప్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్‌లోని రసాయన ప్లాంటులో మంటలు చెలరేగి ప్లాంటు ఆవరణ మొత్తం వ్యాపించాయని ఓ పోలీసు అధికారి చెప్పారు. కంపెనీలోని ఫిల్టర్ ప్లాంటులో ఉదయం 5.30 గంటలకు ఈ ఘటన జరిగిందన్నారు. ఈ పేలుడులో కంపెనీకి చెందిన నలుగురు ఉద్యోగులు మృత్యువాత పడినట్లు వడోదర జిల్లా కలెక్టర్ పి. భారతి పేర్కొన్నారు. క్షతగాత్రులైన వారిని వేర్వేరు ఆసుపత్రుల్లో చేర్చినట్లు ఆమె చెప్పారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఈ అగ్నిప్రమాదంపై దర్యాప్తుకు ఆదేశించామన్నారు. అయితే పేలుడుకు గల కారణాలను ఇంకా తెలియలేదని, అగ్నిమాపక దళాలు సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలు అదుపులోకి తెచ్చాయని పోలీసులు వెల్లడించారు. కంపెనీలోని రెండు ప్లాంట్లకు చెందిన మెషన్లు, ఇతర సామాగ్రి ధ్వంసమైందన్నారు. ఈ ఘటన నేపథ్యంలో చుట్టుపక్కల ఉన్న యూనిట్లను కూడా మూసి వేయాలని ఆదేశించినట్లు అగ్నిమాపక అధికారి పేర్కొన్నారు.

ఎంఎల్‌ఎ బ్యాంక్ అకౌంట్ల స్తంభన



భువనేశ్వర్: ఒడిశాలో సంపన్న ఎంఎల్‌ఎలలో ఒకరైన సనాతన్ మహకుద్ బ్యాంక్ ఆకౌంట్లను పోలీసులు స్తంభింపజేశారు. ఎంఎల్‌ఎ ఇంటికి సరైన పత్రాలు లేకుండా రూ.50 లక్షలు తరలించిన ఇండస్ ఇండ్ బ్యాంక్ జోడా బ్రాంచ్ మేనేజరు అరెస్టయిన వారం రోజుల తర్వాత ఈ చర్యకు తీసుకున్నారు. చంపావ్ ఎంఎల్‌ఎ సనాతన్ మహకుద్‌కు చెందిన ఐదు అకౌంట్లను తాత్కాలికంగా స్తంభింప చేయాలని బ్యాంక్ యాజమాన్యాన్ని కోరామని కోయింఝూర్ జిల్లా ఎస్‌పి రాజేశ్ పండిట్ తెలిపారు. ఈ అకౌంట్లలో దాదాపు రూ.165 కోట్ల నగదు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో శాంతి భద్రతల సమస్యను సృష్టించేందుకు ఆయన ఈ నగదును వినియోగిసున్నారని పండిట్ తెలిపారు. ఇతర బ్యాంకులలో ఆకౌంట్లను కూడా తాత్కాలికంగా స్తంభింప జేయాలని లేఖ రాయనున్నట్లు ఆయన తెలిపారు. మహాకుద్‌కు చెందిన 'సనసేన' సంస్థ జిల్లాలో శాంతి భద్రతల సమస్యలను సృష్టిస్తోంది. జాతీయ రహదారులపై ఉన్న టోల్‌గేట్లను దిగ్బంధించడంతోపాటు ఓ మంత్రి కుమారుడి కార్యాలయానికి నిప్పుబెట్టింది. దీంతో పోలీసులు సనసేన, మహకుద్‌పై కేసు నమోదు చేశారు.

ఎన్నికలకు ముందే నాగా సమస్యకు పరిష్కారం : గిరిజన మండలి

న్యూఢిల్లీ: నాగాలాండ్‌లో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించడంపై అత్యున్నత నాగా గిరిజన మండలి నాగా హోహో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో నెలకొన్న తీవ్రవాద సమస్య పరిష్కారం కాకముందే ఎన్నికలు జరపాలనుకోవడం ఏ మాత్రం అంగీకార యోగ్యం కాదని పేర్కొంది. ఈ ఎన్నికలను బహిష్కరించాలని అన్ని రాజకీయ పార్టీలకు సూచించనుంది. నాగా తిరుగుబాటు గ్రూపు ఎన్ఎస్‌సిఎన్–ఐఎం, కేంద్రం మధ్య శాంతి ఒప్పందం కుదిరిన తరువాతే రాష్ట్రంలో ఎన్నికలు జరపాలని నాగా హోహో ప్రతినిధి బృందం గత కొన్ని రోజుల నుంచి దేశ రాజధాని ఢిల్లీలో మకాం వేసి హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సహా అనేక మంది నాయకులను కలిసి విజ్ఞప్తి చేసింది. అయినప్పటికీ వచ్చే నెలలో ఎన్నికలను జరిపేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో హోహో అధ్యక్షుడు చుబా ఉజ్కుం మీడియాతో మాట్లాడుతూ అన్ని గిరిజన సంఘాలు, పౌర సమాజం, రాజకీయ నాయకులు ఒక్కతాటిపైకి వచ్చి ఎన్నికలకు ముందే నాగా సమస్యను పరిష్కరించాలని ముక్తకంఠంతో కోరుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితులపై మీ చర్య ఎలా ఉండబోతుందని విలేకరులు ప్రశ్నించగా, ఎన్నికల్లో పోటీ చేయవద్దని బరిలోకి దిగే అభ్యర్థులందరిపై ఒత్తిడి తెస్తామన్నారు. నాగాలాండ్ ప్రజలు ఎన్నికలను కాదు, సమస్యకు పరిష్కారాన్ని కోరుకుంటున్నారని చెప్పారు.

బొగ్గు గనులపై విచారణ పూర్తి

న్యూఢిల్లీ:1993 నుంచి 2005 వరకు జరిగిన 22 బొగ్గు గనుల కేటాయింపులపై చీఫ్ విజిలెన్స్ కమిషనర్ అనుమతితో విచారణను పూర్తి చేసినట్టు సిబిఐ ఆదివారంనాడు సుప్రీంకోర్టుకు తెలియజేసింది. బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణం కేసులపై సిబిఐ గత డిసెంబరులో 18వ నివేదికను సమర్పించింది. ఈ కుంభకోణానికి సంబంధించి 21 గనుల కేటాయింపుపై మొత్తం 16 కేసులు నమోదు చేసినట్టు తెలిపింది. ఈ బొగ్గు గనుల కుంభకోణం కేసులన్నింటినీ సుప్రీంకోర్టు పర్యవేక్షణ చేస్తున్నది. '43 బొగ్గు గనులకు గాను (1993–2005 మధ్య కాలంలో) 21 గనులకు సంబంధించి సిబిఐ 16 కేసులను నమోదు చేసింది. మిగతా 22 కేసులపై విచారణ ముగిసింది. ఈ విచారణ అంతా సివిసి అనుమతితోనే జరిగింది' అని జస్టిస్ మదన్ బి లోకుర్ నేతృత్వంలోని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. మొత్తం 43 బొగ్గు గనుల కేటాయింపులపై విచారణ పూర్తయిందని, మొదట 45 బొగ్గు గనులు పరిశీలనలో ఉండగా, రెండు ప్రభుత్వ ఆమోదం కోసం వున్నాయని ధర్మాసనం పేర్కొంది.

మన తెలంగాణ
11 హైదరాబాద్ సోమవారం 22, జనవరి 2018
www.manatelangana.news




కిమ్ అందగత్తెల సైన్యానికి ప్రేయసి నాయకత్వం!

సియోల్ : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ మరో ఆశ్చర్యకరమైన నిర్ణయం తీసుకున్నారు. పొరుగుదేశం దక్షిణ కొరియాలో జరగనున్న శీతాకాల ఒలింపిక్స్‌కు ఓ అందగత్తెల సైన్యాన్ని పంపాలని కిమ్ నిర్ణయించుకున్నారు.ఆ భామలు ఆయుధాలు లాంటివి చేతపట్టరు. కేవలం తమ అధ్యక్షుడు పంపుతున్నారన్న కారణంగా దక్షిణ కొరియాకు వెళ్తున్నారు. ఇక ఆ అందగత్తెల బృందానికి నేతృత్వం వహించేది కిమ్ ప్రేయసి హోన్ సాంగ్ వోల్. ఇటీవల కిమ్ ఆమెను హత్య చేయించారని విస్తృత ప్రచారం జరిగింది. కానీ ఆమె దర్శనమివ్వడంతో అవన్నీ వదంతులేనని తేలిపోయింది. నియంతగా దేశాన్ని పాలిస్తున్నాడన్న అపప్రదను తొలగించుకోవడానికి అందగత్తెలను కిమ్ ద.కొరియాకు పంపుతున్నారట. 22మంది తమ అథ్లెట్లను కిమ్ వింటర్ ఒలింపిక్స్ లో భాగస్వాములు చేయాలనుకున్న తరుణంలో ఆయన ప్రేయసి సాంగ్ వోల్ బయటి ప్రపంచానికి దర్శనమిచ్చింది. ప్యోంగ్ యాంగ్‌కు చెందిన మారన్ బాంగ్ బ్యాండ్‌కు హోన్ సాంగ్ వోల్ లీడ్ చేస్తోంది. ఈ బ్యాండ్ ను తన హస్తగతం చేసుకున్న కిమ్ ఆదేశానుసారం ఆమహిళలు స్టేజ్ షోలు చేస్తుంటారు. సాధారణంగా కొంతమందిఅందెగత్తెలు ఓబృం దంగా ఉంటే 'ఆర్మీ ఆఫ్ బ్యూటీస్' అని సంబోధిస్తారు.ఈ అందగత్తెలు అథ్లెట్లతో పాటు ద.కొరియా వెళ్తారు.

మంచులో 15మంది సజీవ సమాధి



లెబనాన్ : సిరియా శరణార్థులపై ప్రకృతి కూడా విరుచుకుపడింది. సిరియాను వదిలి లెబనాన్‌లో ప్రవేశించాలంటే సరిహద్దులోని పర్వతాలను దాటాల్సివుంటుంది. సరిహద్దును జాగ్రత్తగా దాటేందుకు శరణార్థుల గ్రూపు ఇద్దరు స్మగ్లర్ల తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సిరియా నుంచి బయల్దేరిన శరణార్థులు గ్రూపు లెబనాన్ సరిహద్దులోని మన్సా వద్దకు వెళ్లే సరికి పెను మంచు తుపా ను ప్రారంభమైంది. దీంతో గ్రూపులోని వారందరూ చెల్లాచెదురయ్యారు. కొందరు మంచు తుపాను ధాటికి గడ్డకట్టుకుపోయి సజీవ సమాధి అయ్యారు. మృతుల్లో పసిపిల్లలు కూడా ఉండటం మరింత బాధాకరం.ఘటనపై సమాచారం అందుకున్న లెబనీస్ పౌరరక్షణ అధికారులు శనివారం మంచులో కూరుకుపోయిన 15 మంది శరణార్థుల మృతదేహాలను వెలికి తీశారు. శరణార్థులను ప్రమాదంలో వదిలేసిన ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. 2011లో సిరియా అంతర్యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకూ 10 లక్షల మంది సిరియన్లు లెబనాన్‌కు వలస వెళ్లారు. 2015లో దేశంలో ప్రవేశించే శరణార్థులపై లెబనాన్ ఆంక్షలు విధించి సంగతి తెలిసిందే.

బూజుపట్టిన చికెన్‌తో పకోడి




కర్నూలు: బూజుపట్టిన చికెన్‌తో పకోడి తయారు చేస్తుండడం వెలుగుచూసిం ది. కర్నూలు నగరంలోని మాంసం దుకాణాల్లో ఆదివారం మాంసాహార అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ప్రకాష్‌నాయు డు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బూజుపట్టిన చికెన్‌తో పకోడి తయారీ చేస్తున్న విషయం వెలుగులో కి వచ్చింది. అలాగే పృథ్వీ చికెన్ సెంటర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ కోళ్లు తక్కువ రోజుల్లో ఎదిగేలా స్టెరాయిడ్స్ ఇచ్చి మాంసంగా మారుస్తున్నారని, ఇలాంటి కోళ్ల మాంసం తినడం వల్ల పలు రోగాలు వస్తాయని పేర్కొన్నారు.

విష గుళికలు తిన్న ముగ్గురు చిన్నారులు

గుంటూరు: తినే పదార్థాలు అనుకుని ముగ్గురు చిన్నారులు విష గుళికలు తిన్నారు. వారిలో ఒక చిన్నారి చనిపోగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గుంటూరు జిల్లా, అమరావతి మండలం, నరుకుళ్లపాడులో ఈ ఘటన జరిగింది. కర్నూలు జిల్లా, మంత్రాలయం నుంచి వలస వచ్చిన రైతు కూలీల పిల్లలు విష గుళికలు తిన్నారు. ఏడాదిన్నర చిన్నారి చనిపోగా ఇద్దరు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కర్నూలులో చెడ్డీ గ్యాంగ్ హల్ చల్



కర్నూలు: ఉత్తరాది రాష్ట్రాల్లో, హైదరాబాద్‌లో దోపిడీలకు పాల్పడి హడలెత్తించిన చెడ్డీ గ్యాంగ్ ఇప్పుడు రాయలసీమ జిల్లాల్లో హల్‌హల్ చేస్తోంది. కర్నూలు పట్టణంలోని న్యాకృష్ణానగర్‌లో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. రూ.50 వేలు, రెండు తులాల బంగారం చోరీ చేశారు. ఓ ఇంట్లో వస్తువులను చెడ్డీ గ్యాంగ్ తగులబెట్టారు. చెడ్డీగ్యాంగ్ అంటేనే దడ పుట్టించే విధంగా దోపిడీలుంటాయి. అవసరమైతే దాడులకు పాల్పడడానికి ఏ మాత్రం వెనుకాడరు. వీరు హైదరాబాదులోనే మకాం ఉంటూ అనుకూలమైన ప్రదేశాలను గమనించి అక్కడ ముందుగానే రెక్కీ నిర్వహించి దోపిడీలకు పాల్పడతారు. చెడ్డీలు, బనియన్లు వేసుకుని దోపిడీలకు పాల్పడే ఈ గ్యాంగ్‌ను 'కబ్జా బనియన్ గ్యాంగ్' అని కూడా పిలుస్తారు. దోపిడీ జరిగే ప్రయత్నంలో ఎవరైనా అడ్డుకుని పట్టుకుంటే జారిపోయేందుకు శరీరానికి ఆయిల్, జారిపోయే మట్టిలాంటివి పూసుకుంటారు.

త్వరలో పార్లమెంట్ ముట్టడి

మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్ : బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ బిసి భవన్‌లో తెలంగాణ ఆర్టీసీ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘం గౌరవాధ్యక్షురాలు కొమ్ము ఉమాదేవి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆర్.కృష్ణయ్య ప్రసంగించారు. బిసి ఉద్యోగులంతా ఐకమత్యంతో పోరాడి రాజ్యాంగబద్ధమైన హక్కులు సాధించాలని పిలుపునిచ్చారు. ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం త్వరలో పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన జరుపుతామన్నారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యాంగపరమైన, న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమి లేవన్నారు. గతంలో పాలించిన కేంద్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం, బిసి వ్యతిరేక వైఖరి అవలంభించడం మూలంగానే పెట్టలేదని, రాజ్యాంగబద్ధమైన మండల కమీషన్ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసిందన్నారు. చట్ట బద్ధమైన పార్లమెంటరి కమిటీ ఛైర్మన్ నాచియప్పన్ కమిటీ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసిందని, ఇక ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తర్‌ప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం ఉద్యోగుల సంఖ్య లేకపోతే ఎస్సీ,ఎస్టీ, బిసిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. అన్ని వైపుల నుంచి బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సులు, తీర్పులు ఉంటే కూడా ప్రభుత్వం పెట్టకుండా అన్యాయం చేస్తుందని విమర్శించారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎస్ ఆర్టీసీ బిసి ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు ఉమాదేవి, అధ్యక్షులు గుండ్ల ఆంజనేయులు గౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్ సాంబయ్య, ఉపాధ్యక్షులు రామేశ్వర్, ప్రధాన కార్యదర్శి హరికిషన్, జాయింట్ సెక్రటరి వెంకటేష్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి రవి, కార్యదర్శులు శ్రీనివాస్, సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి దావోస్ సదస్సు

బయలుదేరి వెళ్లిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ/దావోస్ : స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా సోమవారం నుంచి ప్రారంభం కానున్న ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యుఇఎఫ్) సదస్సులో పాల్గొనేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారంనాడు రాత్రి ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. ఈనెల 22 నుంచి 26 వరకు ఐదు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. డబ్ల్యుఇఎఫ్ సదస్సులో దాదాపు మూడు వేల మంది వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, కళాకారులు, విద్యావేత్తలు,సామాజిక వేత్తలు పాల్గొననున్నారు. భారత్ నుంచి దాదాపు 130 మంది పాల్గొంటారు. మోడీ వెంట కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, సురేశ్ ప్రభు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, ఎంజె అక్బర్, జితేంద్ర సింగ్ పాల్గొంటున్నారు. 'ముక్కలైన ప్రపంచంలోనే భాగస్వామ్య భవిష్యత్తు సృష్టించాలి' అనేది ఈ సారి సదస్సు ముఖ్యాంశంగా నిర్ణయించారు. మహిళా నేతల భాగస్వామ్యమూ అధిక స్థాయిలో ఉండనుందని డబ్ల్యుఇఎఫ్ తెలిపింది. మంగళవారం నుంచి సదస్సు అధికారిక కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. ఈ సదస్సులో ప్రారంభ ప్రసంగం ప్రధాని నరేంద్రమోడీ చేస్తారు. చివరి రోజు ముఖ్య ప్రసంగాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేయనున్నారు. మోడీ 24 గంటల పాటు మాత్రమే దావోస్ పర్యటనలో ఉంటారు. వివిధ దేశాల కంపెనీల సిఇఒలతో నిర్వహించే విందు కార్యక్రమంలో మోడీ పాల్గొంటారు. స్విస్ అధ్యక్షుడు అలైన్ బెర్సట్‌తో మోడీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు.

ప్రపంచంతో అన్నీ పంచుకుంటా : మోడీ

ప్రపంచ వేదిక దావోస్‌లో భారత్ భవిష్యత్‌ను ఆవిష్కరిస్తానని ప్రధాని మోడీ అన్నారు. ప్రపంచ దేశాలతో అన్ని విషయాలు పంచుకుంటానని తెలిపారు. సమకాలీన ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు, ఉద్భవించబోయే సమస్యలను, వాటిని ఎలా ఎదుర్కోవాల్సిన అవసరమున్నదన్న విషయాలను తనవంతుగా చెప్పే ప్రయత్నం చేస్తానని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అదే విధంగా పలు ద్వైపాక్షిక సమావేశాల్లో కూడా పాల్గొనబోతున్నానని, వాటితో భారత్‌కు చెప్పుకోదగ్గ రీతిలో లబ్ధి చేకూరుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

తొలిసారి యోగా...

దావోస్ సోమవారం జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు సందర్భంగా అక్కడ యోగా అభ్యాసనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొననున్నారు. ప్రతి రోజూ రెండుసార్లు ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా సెషన్లను నిర్వహించనున్నారు. 'మొదటిసారిగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదికపై యోగా జరుగనుంది. మన దేశానికి చెందిన ఇద్దరు ఆచార్యులు దావోస్‌కు ఆదివారం బయలుదేరారు. వీరు ఉదయం, సాయంత్రం జరిగిన రెండు సెషన్లలో పాల్గొంటారు' అని యోగా గురు బాబా రాందేవ్ తెలిపారు. 'ఈ సదస్సుకు భారత ప్రధాని హాజరు కావడం 1997 తర్వాత ఇదే తొలిసారి. ప్రధాని మోడీ ప్రారంభ కీలకోపాన్యాసం చేయనున్నారు. ఇందుకోసం అక్కడ పారిశ్రామికవేత్తలు ఎదురు చూస్తున్నారు' అని స్విట్జర్లాండ్ భారత రాయబారి సిబి జార్జ్ తెలిపారు. '1997లో ప్రధానితో కలిసిఈ సదస్సుకు హాజరైనప్పుడు భారత్ చాలా చిన్న ఆర్థిక వ్యవస్థను కలిగివుంది. కాని ఇప్పుడు ఎంతో వేగవంతంగా మార్పు చెందింది' అని ఆయన పేర్కొన్నారు.

ఈ48వ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు మూడు వేల మందికి పైగా వ్యాపార, రాజకీయ, కళా, విద్య,సామాజిక రంగాలకు చెందిన వారు హాజరవుతారు. మంచుతో కప్పబడిన చిన్న పట్టణమైన దావోస్‌లో ఐదు రోజుల పాటు ఈ సదస్సు జరుగనుంది.

దూరంగా ఉందాం

● సుప్రీం వివాదం నేపథ్యంలో పార్టీలకు మోడీ సూచన



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వివాదంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తొలిసారిగా నోరు విప్పారు. ప్రస్తుత వివాదం నేపథ్యంలో దానికి ప్రభుత్వం, రాజకీయ పార్టీలు దూరంగా ఉండాలని అన్నారు. న్యాయవ్యవస్థ తన సమస్యలను తానే పరిష్కరించుకుంటుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. భారతీయ న్యాయ వ్యవస్థకు గొప్ప చరిత ఉన్నదని, ఇందులో సమర్థులైన వారు ఉన్నారని చెప్పారు. 'మన దేశ న్యాయవ్యవస్థ ఘన చరిత గలది. వారంతా చాలా సమర్థులు. వారంతా కూర్చుని మాట్లాడుకుని సమస్యలను పరిష్కరించుకుంటారు. మన న్యాయవ్యవస్థపై నాకు నమ్మకం ఉంది' అని 'టైమ్స్ నౌ'కు ఇచ్చిన సుదీర్ఘ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కేసుల కేటాయింపులో సుప్రీం ప్రధాన న్యాయమూర్తిపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ఆరోపణలు చేసిన నేపథ్యంలో న్యాయవ్యవస్థలో అప్రజాస్వామిక పరిస్థితి నెలకొంటుంది కదా అన్న ప్రశ్నకు సమాధానంగా ..ఈ అంశంపై ఏమీ మాట్లాడకుండా దూరంగా ఉండాలనుకుంటున్నానని, ప్రభుత్వం కూడా దూరంగా ఉంటుందని, రాజకీయ పార్టీలు కూడా ఇలాగే ఉండాలని అన్నారు. తనను రాజకీయంగా దెబ్బతీయడానికి ప్రతిపక్షాలు అనేక సార్లు యత్నించాయని ఓ ప్రశ్నకు సమాధానంగా మోడీ చెప్పారు.

ఎంఎల్‌సీ వాకాటి అరెస్ట్



బెంగళూరు: నెల్లూరు జిల్లాకు చెందిన ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డిని సిబిఐ అరెస్ట్ చేసింది. నకిలీ పత్రాలతో రుణాలు తీసుకున్న కేసులో సిబిఐ అధికారులు ఆయనను బెంగళూరులో అరెస్ట్ చేశారు. బ్యాంకులకు రూ.180 కోట్లకు పైగా మోసం చేశారని వాకాటిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేసు విచారణ నిమిత్తం ఆయనను బెంగళూరుకు పిలిపించిన సిబిఐ అధికారులు అక్కడ అరెస్ట్ చేశారు.

త్వరలో అన్న క్యాంటీన్లు : చంద్రబాబు





అమరావతి: పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్ర భవిష్యత్తు, ముఖచిత్రం, రూపురేఖలు మారుతాయని టిడిపి అధినేత, ఎపి సీఎం చంద్రబాబు అన్నారు. ఆదివారం ఉండవల్లిలో సీఎం నివాసం వద్ద ఏర్పాటు చేసిన టిడిపి కార్య శాలను చంద్రబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టిడిపి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని పునరుద్ఘాటించారు. మూడేళ్లలో ప్రతి ఇంటికీ శుద్ధనీటిని అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని.. అన్న క్యాంటీన్లు, నిరుద్యోగ భృతికి త్వరలో శ్రీకారం చుడతామని సీఎం వెల్లడించారు. ప్రజలతో మమేకమై వారిని మెప్పించే విధంగా ప్రవర్తన ఉండాలని నాయకులకు చంద్రబాబు సూచించారు.

8 అంశాలపై సీఎం చంద్రబాబు చర్చ

ఇక్కడ ప్రధానంగా 8 అంశాలపై సీఎం నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఇంటింటికి తెలుగుదేశం, జన్మభూమి కార్యక్రమం తీరు, నియోజక వర్గాలలో పార్టీ పరిస్థితి, పోలవరం పనుల తీరు, విభజన చట్టం హామీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, కులాలు, ప్రాంతాల మధ్య ప్రతిపక్షం చేస్తున్న కుట్రలు, పలు అంశాలపై నేతలతో చంద్రబాబు మాట్లాడుతున్నారు. రాష్ట్ర రాజధాని కోసం ఎంతమంది అడ్డుపడినా.. 33 వేల ఎకరాలు రైతులు ఉదారంగా ఇచ్చారని, తనపై నమ్మకంతోనే చొరవ చూపారని అన్నారు. మూడున్నరేళ్ల తర్వాత ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం పెట్టామని, ప్రభుత్వం చేసిన పనులకు ప్రజలు చూపుతున్న ఆదరణ.. గుర్తింపుగా భావిస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఇక్కడ నేతలు రెండు విషయాలు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. జవాబుదారీ తనం ఉంటే బాధ్యతగా పనిచేస్తారు, అది లేకపోతే ఎవరిపాటికి వాళ్లు ఆ ఊర్లు తిరిగి వచ్చేస్తారని అన్నారు. టెక్నాలజీని బాగా ఉపయోగిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రతి ఒక్క సమస్యకు పరిష్కారమార్గంగా ఆలోచిస్తున్నామని, అన్నీ ఆన్‌లైన్‌లో పెట్టామని, ఎక్కడికక్కడ సర్వీస్‌ను ఎస్టాబ్లిష్ చేశామని, ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్, ఇండివిడ్యువల్, కమ్యూనిటీ తదితరవన్నీ ఏర్పాటు చేసి నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై ఎంపి అవంతి వ్యాఖ్యలు

విజయవాడ: టిడిపి వర్క్‌షాప్‌లో అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాస్ ఆవేశపూరితంగా ప్రసంగించారు. చంద్రబాబును ఉద్దేశించి ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు ఎపికి ముఖ్యమంత్రే కాదు. 5 కోట్ల మందికి ప్రతినిధి అని గుర్తుపెట్టుకోవాలని బాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఢిల్లీకి 42 సార్లు వెళ్లొచ్చారు.విభజన చట్టంలోని హామీలు ఒక్కటి కూడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ అన్నారు. ఇంతవరకు ప్రత్యేక ప్యాకేజీ, రైల్వేజోన్ కూడా అమలు కాలేదని అవంతి పేర్కొన్నారు. 'మీకు సముద్రమంత సహనం ఉంది. కానీ ప్రజలు అంతా గమనిస్తున్నారు. మీ అంత సహనం ప్రజలకు లేదు. అవసరమైనప్పుడు తీర్పు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. ఎపి ప్రజలు ప్రతి దానికి తెలంగాణ ప్రజల్లా ఆందోళన చేయరు. సమయం చూసి ఎపి ప్రజలు నిర్ణయం తీసుకుం టారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనైనా హామీలు అమలుకు నోచుకోవాలి'' అని అవంతి శ్రీనివాస్ ఆవేశంగా ప్రసంగించారు. ఎంపీ అవంతి ప్రసంగానికి ఎమ్మెల్యేల హర్షధ్వానాలు పలికారు.



వైఎస్ జగన్ పాదయాత్ర@900 కి.మీ



చిత్తూరు : ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర చిత్తూరు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. ఆదివారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని చెర్లోపల్లి వద్ద ప్రజాసంకల్పయాత్ర 900 కిలోమీటర్ల మైలు రాయిని దాటింది. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం చెర్లోపల్లి గ్రామంలో వైఎస్ జగన్ రావి మొక్కను నాటారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వేల సంఖ్యలో యువకులు, మహిళలు జగన్‌కు మద్దతుగా ఆయనతో కలసి అడుగులో అడుగేస్తున్నారు. ఊరూరా సందడి వాతావరణం నెలకొంది. కొండలు, కోనలు, అడవులు.. కరువు నేలల మీదుగా పాదయాత్ర సాగిస్తున్న జగన్‌కు అడుగడుగునా ప్రజలు తమ సమస్యలు ఏకరువు పెడుతున్నారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో ఎవరికీ న్యాయం జరగలేదని గోడు వెళ్లబోసుకుంటున్నారు. తమ కష్టాలు వినే నాయకుడొచ్చాడని ఘన స్వాగతం పలుకుతున్నారు.

జగన్ పాదయాత్రలో అపశ్రుతి : వైసిపి అధినేత జగన్ చేపట్టిన పాదయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక కుప్పకూలింది. సాంస్కృతిక కార్యక్రమాలకు వీలుగా చెక్కలతో చేసిన వేదికపై కార్య కర్తలు ఎక్కువగా చేరుకోవటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఓ మహిళా సహా ఇద్దరు కార్యకర్తలకు గాయాలయ్యాయి. వేదిక సరిగా లేకపోవటంతో జగన్ బస్సుపై నుంచి మాట్లాడుతూ బహిరంగ సభను కొనసాగించారు.

ప్రత్యేక హోదా కోసం నిలదీయండి



మన తెలంగాణ / హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం రాష్ట్ర ఎంపిలు పార్లమెంట్‌ను స్థంభింపజేయాలని, జాతీయ రాజకీయ నాయకులను నిలదీయాలని, అవసరమైతే ప్రధాని నివాసాన్ని ముట్టడించాలని, ఎపి ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్, కె.రామకృష్ణ, శివాజీ అన్నారు. ప్రత్యేక హోదాపై అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి సిఎం చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్ పరస్పరం తిట్టుకోవడమే సరిపోతోందని, ప్రత్యేక హోదాపై ప్రధాని మోడీని, బిజెపి అధ్యక్షులు అమిత్ షాను మాత్రం నిలదీయడం లేదని వారు విమర్శించారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఇంకా ఎన్నాళ్లు ఎపి ప్రజలను మోసం చేస్తుందని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజా ప్రతినిధులు ఎపికి ప్రత్యేక హోదా వచ్చే వరకు పోరాడుతామన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని బస్ యాత్ర, ఆమరణ నిరాహారదీక్షలు చేశామని, కోర్టుకు వెళ్లినా ఫలితం లేకుండా పోయిందని చలసాని శ్రీనివాస్ అన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలను మోసం చేసిన పార్టీలకు చెన్నయ్‌లోని ఆర్‌కె నగర్‌లో పట్టిన గతే పడుతుందన్నారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎపి ప్రజలను మోసం చేయడానికి సిఎం చంద్రబాబు సుప్రీంకోర్టు వెళ్తానంటున్నారన్నారు. వెంకయ్య నాయుడు,చంద్రబాబు నాయుడు ఎపికి ద్రోహం చేశారని ఆరోపించారు. పోలవరంకు నాబార్డ్ అప్పు ఇస్తుందని, రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు అప్పు ఇచ్చిందని, ఎన్‌డిఎ నుండి టిడిపి బయటకి వచ్చి వారిపై సుప్రీంకోర్టుకు వెళ్ళాలని, గవర్నర్ వద్దని చెప్పడం ఎందుకని ఆయన ప్రశ్నించారు.

మన తెలంగాణ
12
హైదరాబాద్
సోమవారం
22, జనవరి 2018
www.manatelangana.news

లంక సిరీస్‌తో ప్రయోజనం శూన్యం: హర్భజన్



కోల్‌కతా: కీలకమైన దక్షిణాఫ్రికా సిరీస్ కంటే ముందు శ్రీలంకతో నిర్వహించిన సుదీర్ఘ సిరీస్ వల్ల టీమిండియాకు లాభం కంటే నష్టమే జరిగిందని భారత స్టార్ బౌలర్ హర్భజన్ సింగ్ అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్ వల్ల భారత్‌కు కలిగిన ప్రయోజనం ఏమీ లేదన్నాడు. సుదీర్ఘ సిరీస్ వల్ల క్రికెటర్లకు కనీసం విశ్రాంతి లేకుండా పోయిందన్నాడు. సిరీస్‌కు బదులు కొంత మంది కీలక ఆటగాళ్లను ముందే దక్షిణాఫ్రికాకు పంపిస్తే ఫలితం వేరే విధంగా ఉండేదన్నాడు. అలాకానీ పక్షంలో కనీసం ధర్మశాల మైదానంలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తే బాగుండేదన్నాడు. అలా చేస్తే బౌన్సీ పిచ్‌లపై మంచి సాధన చేసే అవకాశం లభించేదన్నాడు. కాగా, ఇప్పటికే సిరీస్ కోల్పోయిన టీమిండియా చివరి టెస్టులో ఒత్తిడి లేకుండా బరిలోకి దిగుతుందనే నమ్మకాన్ని హర్భజన్ వ్యక్తం చేశాడు. కాగా, ఒక సిరీస్‌లో ఓడినంత మాత్రాన భారత్‌ను తక్కువ చేసే చూడడం తగదన్నాడు. కాగా, తుది జట్టులో ఎవరిని తీసుకోవాలో, ఎవర్ని పక్కన బెట్టాలో కెప్టెన్‌కు పూర్తి అధికారం ఉంటుందని, దీనిపై విమర్శలు చేసే హక్కు ఎవరికి ఉండదన్నాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో భారత బౌలర్ల ప్రదర్శన తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. భువనేశ్వర్ రూపంలో మ్యాచ్ విన్నర్ బౌలర్ భారత్‌కు లభించాడని భజ్జీ వివరించాడు.

క్వార్టర్స్‌లో నాదల్



- మహిళల సింగిల్స్‌లో వోజ్నియాకి ముందుకు
- డిమిత్రొవ్, సిలిక్ గెలుపు, ఆస్ట్రేలియా ఓపెన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్పెయిన్ యోదుడు రఫెల్ నాదల్, డెన్మార్క్ స్టార్ కరొలిన్ వోజ్నియాకి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. మూడో సీడ్ గ్రిగర్ డిమిత్రొవ్ (బల్గేరియా), ఆరోసీడ్ మారిన్ సిలిక్ (క్రొయేసియా) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ సమరంలో విజయం సాధించారు. అయితే నిక్ కిర్గియాస్ (ఆస్ట్రేలియా), అనెట్ కొంటావెట్ (ఇస్టోనియా) నాలుగో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్ సమరంలో టాప్ సీడ్ నాదల్ 6–3, 7–6, 4–6, 7–6 తేడాతో అర్జింటీనా ఆటగాడు డిగో స్చ్వార్ట్‌జ్‌మన్‌ను ఓడించాడు. ఈ టోర్నమెంట్‌లో తొలిసారి నాదల్‌కు కాస్త గట్టి పోటీ ఎదురైంది. అయినా చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకుంటూ నాదల్ మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. తొలి సెట్‌ను సునాయాసంగా గెలుచుకున్న నాదల్‌కు తర్వాతి సెట్‌లో ప్రత్యర్థి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. డిగో అద్భుత పోరాట పటిమ కనబరచడంతో సెట్ టైబ్రేకర్ వరకు వెళ్లింది. కానీ, కీలక సమయంలో డిగో ఒత్తిడికి గురయ్యాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న నాదల్ సెట్‌ను కైవసం చేసుకున్నాడు. కాగా, నాలుగో సెట్‌లో మాత్రం నాదల్‌కు ఓటమి తప్పలేదు. డిగో అద్భుతంగా ఆడి సెట్‌ను దక్కించుకున్నాడు. నాలుగో సెట్‌లో కూడా పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. ఈ సెట్ టైబ్రేకర్ వరకు వెళ్లింది. ఒక దశలో డిగో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. కానీ, నాదల్ కీలక సమయంలో పుంజుకున్నాడు. తన మార్క్ షాట్లతో ప్రత్యర్థిని హడలెత్తిస్తూ మ్యాచ్‌ను సొంతం చేసుకుని క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు.

సిలిక్ ముందుకు...

క్రొయేసియా స్టార్, ఆరో సీడ్ మారిన్ సిలిక్ కూడా పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఆదివారం జరిగిన నాలుగో రౌండ్‌లో సిలిక్ స్పెయిన్ ఆటగాడు కరెనొ బుస్టా (స్పెయిన్)ను ఓడించాడు. నాలుగు సెట్ల సమరంలో సిలిక్ 6–7, 6–3, 7–6, 7–6 తేడాతో విజయం సాధించాడు. తొలి సెట్‌ను కోల్పోయిన సిలిక్ తర్వాత చెలరేగి ఆడాడు. వరుసగా మూడు సెట్‌లు గెలిచి ప్రత్యర్థిని మట్టి కరిపించాడు. మరవైపు బుస్టా కూడా గెలుపు కోసం చివరి వరకు పోరాడాడు. రెండు సెట్లను టైబ్రేకర్ వరకు తీసుకెళ్లాడు. అయినా సిలిక్ తన అపార అనుభవాన్ని ఉపయోగించి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.



చెమటోడ్చిన డిమిత్రొవ్

మరోవైపు మూడో సీడ్ డిమిత్రొవ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో చెమటోడ్చాడు. ఆస్ట్రేలియా ఆటగాడు, 17వ సీడ్ నిక్ కిర్గియస్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో డిమిత్రొవ్ విజయం సాధించాడు. చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో డిమిత్రొవ్ 7–6, 7–6, 4–6, 7–6 తేడాతో కిర్గియాస్‌ను ఓడించాడు. తొలి సెట్‌లలో పోరు టైబ్రేకర్ వరకు వెళ్లింది. ఇద్దరు కూడా ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డారు. దీంతో పోరు యుద్ధాన్ని తలపించింది. కాగా, తొలి రెండు సెట్‌లను డిమిత్రొవ్ దక్కించుకున్నాడు. కానీ, మూడో సెట్‌లో స్థానిక ఆటగాడు కిర్గియాస్ విజయం సాధించాడు. అద్భుత షాట్లతో డిమిత్రొవ్‌ను హడలెత్తించిన కిర్గియాస్ 6–4తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. నాలుగో సెట్‌లో కూడా ఇద్దరి మధ్య హోరాహోరీ పోరాటం కొనసాగింది. కానీ కీలక సమయంలో కిర్గియాస్ ఒత్తిడిని తట్టుకోలేక పోయాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న డిమిత్రొవ్‌తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు.

వోజ్నియాకి అలవోకగా...

మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ వోజ్నియాకి సునాయాస విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. స్లొవేకియా క్రీడాకారిణి రైబరికొవాతో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో వోజ్నియాకి 6–3, 6–2తో విజయం సాధించింది. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన వోజ్నియాకి ఏ దశలోనూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. తన మార్క్ షాట్లతో రైబరికొవాను హడలెత్తించింది. వోజ్నియాకి దూకుడుకు ప్రత్యర్థి వద్ద సమాధానమే లేకుండా పోయింది. చివరి వరకు పూర్తి ఆధిపత్యం చెలాయించిన మాజీ నంబర్‌వన్ వోజ్నియాకి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మరో ప్రిక్వార్టర్ ఫైనల్ సమరంలో కార్లా సౌరెజ్ నవేరా (స్పెయిన్) విజయం సాధించింది. మూడు సెట్ల సమరంలో 4–6, 6–4, 8–6 తేడాతో ఇస్టోనియా క్రీడాకారిణి కొంటావెట్‌ను ఓడించింది. నువ్వానేనా అన్నట్టు సాగిన మారథాన్ సమరంలో కార్లా అసాధారణ ఆటతో విజయాన్ని అందుకుంది. మరోవైపు క్రొయేసియా క్రీడాకారిణి పెట్రా మ్యాట్రిక్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లో జయకేతనం ఎగుర వేసింది. బెల్జియం క్రీడాకారిణి ఎలిసె మెర్టెన్స్‌పై మ్యాట్రిక్ విజయం సాధించింది. నువ్వానేనా అన్నట్టు సాగిన సమరంలో మ్యాట్రిక్ 7–6, 7–5తో విజయాన్ని అందుకుంది.



పేస్ జోడీకి షాక్...

కాగా, పురుషుల డబుల్స్‌లో లియాండర్ పేస్, పూరవ్ రాజా (భారత్) జంటకు మూడో రౌండ్‌లోనే షాక్ తగిలింది. ఆదివారం జరిగిన మూడో రౌండ్‌లో కొలంబియాకు చెందిన 11వ సీడ్ జువాన్ సెబాస్టియన్, రాబర్ట్ ఫరా జంట చేతిలో ఓటమి పాలైంది. ఏకపక్షంగా సాగిన పోరులో పేస్ జోడీ కనీస ప్రతిఘటన ఇవ్వకుండానే చేతులెత్తేసింది. మరోవైపు ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన కొలంబియా జంట 6–1, 6–2తో సునాయాస విజయాన్ని అందుకుంది.

ఫైనల్లో భారత్ ఓటమి

నాలుగు దేశాల హాకీ



టౌరంగా: న్యూజిలాండ్‌లో జరిగిన నాలుగు దేశాల హాకీ టోర్నమెంట్‌లో భారత పురుషుల జట్టు రన్నరప్‌తో సరి పెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 1–2 గోల్స్ తేడాతో బెల్జియం చేతిలో ఓటమి పాలైంది. ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు బెల్జియం చేతిలో ఇది వరుసగా రెండో ఓటమి కావడం విశేషం. ఇటీవల కాలంలో భారత్‌పై స్పష్టమైన ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న బెల్జియం ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. ఉత్కంఠభరితంగా సాగిన తుది సమరంలో 2–1 తేడాతో గెలిచి ట్రోఫీని సొంతం చేసుకుంది. ఆట నాలుగో నిమిషంలోనే బెల్జియం తొలి గోల్ నమోదు చేసింది. టామ్ బ్రూన్ అద్భుత గోల్‌తో బెల్జియంకు పైచేయి అందించాడు. తర్వాత భారత్ ఎదురు దాడికి దిగింది. స్కోరును సమం చేసేందుకు తీవ్రంగా పోరాడింది. ఎట్టకేలకు ఈ ప్రయత్నం ఫలించింది. ఆట 19వ నిమిషంలో మణ్‌దీప్ సింగ్ భారత్‌కు మొదటి గోల్ అందించాడు. దీంతో స్కోరు 1–1తో సమమైంది. తర్వాత కూడా రెండు జట్లు నువ్వానేనా అన్నట్టు పోరాడాయి. కానీ, ప్రథమార్ధంలో మరో గోల్ నమోదు కాలేదు. కాగా, ద్వితీయార్ధం ప్రారంభంలోనే సెబాస్టియన్ బెల్జియంకు రెండో గోల్ సాధించి పెట్టాడు. ఈ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకున్న బెల్జియం విజేతగా నిలిచింది. భారత్‌కు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు లభించినా ఫలితం లేకుండా పోయింది. దీన్ని గోల్స్‌గా మలచడంలో విఫలమైంది. దీంతో రెండో స్థానంతోనే సంతృప్తి పడక తప్పలేదు.

ఈ నెల 23 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్

మన తెలంగాణ/ అబ్దుల్లాపూర్‌మెట్ : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో ఈ నెల 23 నుండి 25 వరకు రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ పోటీలను నిర్వహిస్తున్నామని నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు మోడెపు నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎ.రామకృష్ణ, ఉపాధ్యాక్షులు శివగౌడ్, రవికుమార్, క్రీడాకార్యదర్శులు సాయి, సాయివిక్రంలు ఒక ప్రకటనలో తెలిపారు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్ 121వ జయంతి వేడుకల సందర్భంగా రాష్ట్ర స్థాయి (ఓపెన్ టు అల్) కబడ్డీ టోర్నమెంట్‌ను హైదరాబాద్ కబడ్డీ అసోసియేషన్ అనుమతితో బాటసింగారం నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అసక్తి గల కలిగిన క్రీడాకారులు నేతాజి యువజన సంఘం కార్యాలయంలో రూ.400లు ఎంట్రీ ఫిజు చెల్లించి 22 తేది సాయంత్రం 5 గంటల వరకు జట్టు పేరు పేరు నమోదు చేసుకోవాలని కోరారు. 23న సాయంత్రం 4 గంటలకు సంఘం అవరణంలో డ్రా తీస్తామని తెలిపారు. ప్రధమ బహుమతి రూ.22,111 నగదు ట్రోఫి, ద్వితీయ బహుమతి రూ.10,111 నగదు, ట్రోఫి, తృతీయ బహుమతి రూ. 2,222+2,222 నగదు, ట్రోఫి అందజేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

హాకీ జట్టుకు కిట్స్ బహూకరణ

మన తెలంగాణ/ హైదరాబాద్: జాతీయ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ మహిళా జట్టుకు కిట్స్‌ను అందజేశారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో జట్టుకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి చేతుల మీదుల మహిళా క్రీడాకారిణిలు కిట్స్‌ను అందుకున్నారు. జాతీయ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న తెలంగాణ జట్టుకు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. తెలంగాణ హాకీ సంఘం ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. కాగా, జాతీయ హాకీ చాంపియన్‌షిప్ ఈ నెల 24 నుంచి జార్ఖండ్ రాజధాని రాంచిలో జరుగనుంది. కాగా, పోటీల్లో తెలంగాణ జట్టు విజేతగా నిలువాలని శాట్స్ చైర్మన్ ఆకాంక్షించారు.





లంకకు ఓ గెలుపు

ఢాకా: వరుస ఓటములతో సతమతమవుతున్న శ్రీలంక జట్టుకు ఓ విజయం లభించింది. ముక్కోణపు టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో లంక ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ టోర్నీలో లంకకు ఇదే తొలి విజయం కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 44 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. జట్టులో బ్రాండెన్ టైలర్ (58), కెప్టెన్ క్రీమర్ (34) మాత్రమే రాణించగా మిగతా వారు విఫలమయ్యారు. లంక బౌలర్లలో నువాన్ ప్రదీప్ మూడు, తిసారా పెరీరా నాలుగు వికెట్లు పడగొట్టారు. సందకాన్‌కు రెండు వికెట్లు లభించాయి. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. పెరీరా ఆల్‌రౌండ్ ప్రతిభతో లంకను గెలిపించాడు. ధాటిగా ఆడిన తిసారా పెరీరా మూడు సిక్సర్లు, ఒక ఫోర్‌తో అజేయంగా 39 పరుగులు చేశాడు. ఓపెనర్ కుశాల్ పెరీరా (49), కుశాల్ మెండిస్ (36) తమవంతు సహకారం అందించారు. దీంతో విజయం ఖాయమైంది.

స్కాట్లాండ్ విజయం



దుబాయి: ఇక్కడ జరుగుతున్న ట్రై సిరీస్‌లో స్కాట్లాండ్ ఓ విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఐదో మ్యాచ్‌లో స్కాట్లాండ్ 31 పరుగుల తేడాతో యూఎఇను ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. మాథ్యూ క్రాస్ పది ఫోర్లు, రెండు సిక్సర్లతో 107 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జార్జ్ మున్సె (45), షరీఫ్ (22) తమవంతు సహకారం అందించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన యూఎఇ 46.3 ఓవర్లలో 218 పరుగులకే కుప్పకూలింది. వికెట్ కీపర్ గులాం షబ్బీర్ (90) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది. మిగతావారు విఫలం కావడంతో యూఎఇకి ఓటమి తప్పలేదు.

మూడో వన్డేలోనూ ఇంగ్లాండ్ గెలుపు

- రెండు వన్డేలు మిగిలి ఉండగానే సిరీస్ కైవసం



సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న వన్డే సిరీస్‌ను ఇంగ్లాండ్ మరో రెండు మ్యాచ్‌లు మిగిలివుండగానే కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన మూడో వన్డేలో ఇంగ్లాండ్ 16 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో 3–0 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 286 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాకు ప్రారంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఓపెనర్ డేవిడ్ వార్నర్ 8 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. వన్‌డౌన్‌లో వచ్చిన కామెరూన్ వైట్ (17) కూడా నిరాశ పరిచాడు. దీంతో ఆసీస్ 44 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ ఫించ్ పోరాటాన్ని కొనసాగించాడు. ఇంగ్లాండ్ బౌలర్లను హడలెత్తించిన ఫించ్ 53 బంతుల్లోనే 3 సిక్సర్లు, మరో మూడు ఫోర్లతో 62 పరుగులు చేసి వెనుదిరిగాడు. కెప్టెన్ స్మిత్ 46 పరుగులు చేశాడు. యువ ఆల్‌రౌండర్ మిఛెల్ మార్ష్ 4 ఫోర్లతో 55 పరుగులు సాధించాడు. వేగంగా ఆడిన మార్కస్ స్టోయినిస్ మూడు ఫోర్లు, రెండు ఇక్సర్లతో వేగంగా 56 పరుగులు చేశాడు. చివర్లో ఇంగ్లాండ్ బౌలర్లు కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేయడంతో ఆసీస్ స్కోరు 286 పరుగులకే పరిమితమైంది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌ను వికెట్ కీపర్ జోల్ బట్లర్ అజేయ సెంచరీతో ఆదుకున్నాడు. క్రిస్ వోక్స్ 36 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 53 పరుగులు చేసి తనవంతు పాత్ర పోషించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన బట్లర్ 83 బంతుల్లోనే 4 భారీ సిక్సర్లు, మరో ఆరు బౌండరీలతో 100 పరుగులు సాధించాడు. మిగతావారిలో కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ (41), ఓపెనర్ బైర్‌స్టో (31) పరుగులు చేశారు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.